
'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 146

శుక్రవారం 16-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ప్రతి ఒక్కరూ చాంపియనే

పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత అథ్లెట్ల బృందాన్ని ప్రధాని మోదీ అభినందించారు. పలువురు క్రీడాకారులతో ముచ్చటించారు. ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు.

- వివరాలు 15లో



జమ్మూకశ్మీర్ స్పెషల్ డీజీపీగా నళిన్

ఏపీ కేడర్‌కు చెందిన 1992 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి నళిన్ ప్రభాత్‌కు కేంద్రం జమ్మూకశ్మీర్‌లో కీలక బాధ్యతలు అప్పగించింది.

- వివరాలు 6లో



కార్ ఆస్పత్రిలో విధ్వంసం

కోల్‌కతాలో యువ వైద్యురాలు శవమై కనిపించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో దుండగులు విధ్వంసం సృష్టించారు.

- వివరాలు 6లో



ఆఫ్రికాలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి

ఆఫ్రికా దేశాలను మంకీపాక్స్ వణికిస్తోంది. దీంతో డబ్ల్యూహెచ్‌వో ఆయా దేశాల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితిని విధించింది.

- వివరాలు 6లో



కరకర @ రూ.50,000 కోట్లు!

దేశీ, విదేశీ కంపెనీలు ప్యాకేజ్డ్ స్నాక్స్‌ను తయారు చేస్తూ మార్కెట్‌ను భారీగా విస్తరించేందుకు పోటీ పడుతున్నాయి.

- వివరాలు 15లో



78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం ఢిల్లీలోని ఎర్రకోట నుంచి జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

లౌకిక పౌరస్మృతి

దేశానికి తక్షణావసరం: మోదీ.. రాజ్యాంగం, సుప్రీంకోర్టు చెప్పిందీ అదే

- ఇప్పుడున్నది మతపరమైన స్మృతి
- 75 ఏళ్లుగా దాన్నే భరిస్తూ వస్తున్నాం
- పంద్రాగస్టు ప్రసంగంలో కీలక వ్యాఖ్యలు
- ఉన్నతవిద్యకు గమ్యస్థానంగా భారత్
- అన్ని రంగాల్లోనూ అద్భుతాలు చేస్తున్నాం
- మహిళలపై అకృత్యాలకు ఉరే సరి
- ఎర్రకోట నుంచి వరుసగా 11వ సారి జాతినుద్దేశించి మాట్లాడిన ప్రధాని

మన దేశంలో 75 ఏళ్లుగా మతపరమైన పౌరస్మృతి కొనసాగుతోందంటూ ప్రధాని మోదీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ''అది వివక్షాపూరితమైనది. రాజ్యాంగ స్ఫూర్తికి, సుప్రీంకోర్టు తీర్పులకూ విరుద్ధం'' అంటూ పంద్రాగస్టు ప్రసంగంలో కుండబద్దలు కొట్టారు. ఎవరడ్డుకున్నా త్వరలో 'లౌకిక' పౌరస్మృతిని, 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'ను అమల్లోకి తెచ్చి తీరతామని ఎర్రకోట వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారు. తమ హయాంలో దేశ ప్రగతిని విపక్షాలు ఓర్వలేకపోతున్నాయంటూ దుయ్యబట్టారు. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారంతో పాటు పలు అంశాలను స్పృశిస్తూ ఏకంగా 98 నిమిషాల పాటు ప్రసంగించి రికార్డు నెలకొల్పారు. - 6లో

విశ్వ వేదికపై తెలంగాణ బ్రాండ్

- సగర్వంగా చాటాలి: సీఎం రేవంత్
- పెట్టుబడుల ఒప్పందాలు కార్యరూపం దాల్చేలా కార్యాచరణ
- దశాబ్దం తర్వాత రాష్ట్రంలో నిజమైన ప్రజాపాలన
- రుణాల రీస్ట్రక్చరింగ్‌పై సర్కారు దృష్టి
- గోల్కొండ కోటపై జాతీయ జెండా ఆవిష్కరించిన సీఎం

2లో

మాట నిలబెట్టుకున్నాం

రూ.31 వేల కోట్లతో రైతులను రుణ విముక్తులను చేశాం: సీఎం రేవంత్‌రెడ్డి

- హరీశ్‌రావును సవాల్ చేస్తున్నా.. మాట మీద నిలబడి రాజీనామా చెయ్యి
- ప్రజల నమ్మకం కోల్పోయి బీఆర్ఎస్ దీనంగా, హీనంగా మారింది
- రీడిజైనింగ్ పేరుతో బీఆర్ఎస్ సర్కారు దోపిడీకి పాల్పడింది
- రూ.1,500 కోట్లతో పూర్తయ్యే సీతారామ ప్రాజెక్టు అంచనాలు పెంచారు
- కేసీఆర్ చేసిన అప్పులకు మిత్తీలు కట్టేందుకే కొత్త అప్పులు చేస్తున్నాం
- సీతారామ ప్రాజెక్టు పంపుల ప్రారంభం.. ఖమ్మం జిల్లా వైరాలో సభ



సీతారామ రెండో పంపును ప్రారంభిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, తుమ్మల

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ 2022 మే 6న వరంగల్ గడ్డపై రైతు డిక్లరేషన్ ప్రకటించిందని.. రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. గురువారం ఒకేరోజు రూ.18 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేసి చూపిస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్‌రావు మాట నిలబెట్టుకోవాలని సవాల్ చేశారు. రేవంత్ గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ పంపులను ప్రారంభించారు. తర్వాత ఖమ్మం జిల్లా వైరాలో ఏర్పాటు చేసిన రైతాంగ సభలో పాల్గొని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించారు. రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ 2004లో తెలంగాణ ఇచ్చారు. ఆమె కుమారుడు రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో రుణమాఫీ ఇస్తామని వాగ్దానం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పట్టువదలని ప్రయత్నంతో రైతుల రుణమాఫీ పూర్తయ్యేలా చేసి రాహుల్‌గాంధీ మాట నిలబెట్టారు. జూలై 18న మొదలుపెట్టి అతి తక్కువ సమయంలో రుణమాఫీ చేశాం. ఇప్పటికే ఆర్టీసీలో ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం, పేదలకు 200 యూనిట్లు ఉచిత కరెంట్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచుతామన్న హామీలు అమలు చేశాం. వైఎస్ దళితులు, గిరిజనులు ఆత్మగౌరవంతో మిగతా 2వ పేజీలో ▶

హరీశ్.. రాజీనామా చెయ్!

❝ కాంగ్రెస్ సర్కారును పంద్రాగస్టులోపు రైతు రుణమాఫీ చేయమంది, నేను సిద్దిపేట ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా, మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయనని హరీశ్‌రావు అన్నరు. ఇప్పుడు నేను సవాల్ చేస్తున్నా.. రుణమాఫీ పూర్తి చేశాం. హరీశ్‌రావ్ చీమూ నెత్తురు ఉంటే రాజీనామా చెయ్యి.. అమరవీరుల స్తూపం వద్దకు వచ్చి ముక్కు నేలకు రాసి.. కాంగ్రెస్ పార్టీకి సవాల్ విసిరినందుకు క్షమాపణ చెప్పు. నువ్వు కూడా నీ మామలా సిగ్గు లేనివాడివైతే ఏట్లో దూకు.. సిద్దిపేటకు పట్టిన శని, చీడపీడ విరగడ అవుతాయి. వ్యవసాయ, సాగునీటి రంగాలు, సంక్షేమ పథకాలైనా సరే కాంగ్రెస్ తరఫున భట్టి, ఉత్తమ్ వస్తారు.. హరీశ్, కేసీఆర్ ఎవరెవరు వస్తారో రండి.. ఏ సెంటర్ అయినా సరే మేం సిద్ధం.. పదేళ్ల బీఆర్ఎస్ పాలన.. 8 నెలల మా పాలనపై చర్చపెడదాం.. వస్తారా?

– సీఎం రేవంత్

అబద్ధం సైతం ఆత్మహత్య చేసుకుంటుంది

- రుణమాఫీ పూర్తిచేశామన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- ఉమ్మడి ఏపీ, తెలంగాణ చరిత్రలో ఇంత దిగజారుడు సీఎం ఇంకెవ్వరూ లేరు
- 2 లక్షల రుణమాఫీకి అర్హులు 22 లక్షల మందేనా? రూ.17,869 కోట్లే రుణమాఫీనా?
- దగా చేసినట్లు తెలిశాక రాజీనామా ఎవరు చేయాలి?

2లో



అలాగైతే.. మా ఆడబిడ్డ జైల్లో ఉండేదా?

- బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందంటూ తప్పుడు ప్రచారం
- నిజానికి కాంగ్రెస్సే ఆ పార్టీతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
- బీఆర్ఎస్‌లో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ నేతలు



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో రాజయ్య, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'బీఆర్ఎస్ బీజేపీలో విలీనమవుతుందని, చీకట్లో ఒప్పందాలు చేసుకున్నామని ప్రచారం చేస్తున్నారు. మాకు వాళ్లతో ఒప్పందం ఉంటే మా ఇంటి ఆడబిడ్డ 150 రోజులుగా జైల్లో ఉండేదా? పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, కవిత సోదరుడిగా న్యాయవాదులతో మాట్లాడేందుకు, అక్కడి విషయాలు తెలుసుకునేందుకు ఢిల్లీకి వెళ్తే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి బీజేపీతో కాంగ్రెస్ లోపాయికారీ ఒప్పందాల వల్లే ఆ పార్టీ నేత ఒక్కరు కూడా జైల్లో లేడు. కేసీఆర్ టీఆర్ఎస్ పెట్టిన నాటి నుంచి పార్టీ మాయం కావాలని కోరుకుంటున్నవారు అనేకమంది ఉన్నారు. అలాంటి వారే కనుమరుగయ్యారు తప్ప 24 ఏళ్లుగా పార్టీ విజయవంతంగా కొనసాగుతోంది. మరో 50 ఏళ్లు కూడా కొనసాగేలా బలంగా తయారు చేసుకుందాం'అని మాజీమంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మంచి రేవంత్ ఖాతాలో..చెడు కేసీఆర్ ఖాతాలో

'మంచిని తన ఖాతాలో వేసుకుని, చెడును మాత్రం కేసీఆర్ ఖాతాలో వేయడం, కేసీఆర్ చేసిన పనులను తన క్రెడిట్‌గా చెప్పుకోవడం రేవంత్‌కు అలవాటు అయింది. కేసీఆర్ పూర్తి చేసిన సీతారామ ప్రాజెక్టును తామే కట్టినట్లుగా రిబ్బన్ కటింగ్‌లు చేస్తున్నారు. కానీ ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీల విషయంలో రేవంత్ మాట తప్పిన తీరును యువత, రైతులు, మహిళలు, వృద్ధులు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు. పీఆర్ స్టంట్లతో ప్రజలను రేవంత్ ఎక్కువకాలం గందరగోళానికి గురి చేయలేరు. అడ్డగోలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు ప్రశ్నించడం మొదలు పెడతారు. మనం కూడా వాటిని ఉప ఎన్నికల్లో మిగతా 5వ పేజీలో ▶



'అగ్ని' తొలి డైరెక్టర్ రామ్ నరైన్ కన్నుమూత

- వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచిన క్షిపణి శాస్త్రవేత్త
- అగ్ని క్షిపణుల అభివృద్ధిలో కీలకపాత్ర.. 'ఫాదర్ ఆఫ్ అగ్ని మిస్సైల్స్'గా ఖ్యాతి
- రేపు మధ్యాహ్నం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు

- వివరాలు 12లో



ఎల్‌బీ నగర్ చింతలకుంట వద్ద జలమయమైన విజయవాడ జాతీయ రహదారి

2 గంటలు.. 8 సెం.మీ.

హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

సాక్షి, హైదరాబాద్: నగరంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు ఆగకుండా కురిసిన వానతో నగర జనజీవనం స్తంభించింది. రహదారులు చెరువులను తలపించాయి. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యింది. ముఖ్యంగా జీడిమెట్ల, కొంపల్లి, సికింద్రాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, బేగంపేట్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చి.. గంజాయి చాక్లెట్లు తెప్పించి..



గంజాయి చాక్లెట్ల తయారీదారులు ఇండియామార్ట్ వెబ్‌సైట్ ద్వారా క్యాష్ ఆన్ డెలివరీ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా విక్రయాలు సాగిస్తున్నట్లు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు గుర్తించారు.

- వివరాలు 16లో

అధ్యక్షుడు, నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు..



నామినేటెడ్ పోస్టుల భర్తీ, మంత్రివర్గ విస్తరణ త్వరలోనే జరుగుతుందన్న వార్తలకు తోడు టీపీసీసీ అధ్యక్షుడి ఎంపిక, అనుబంధ సంఘాల అధ్యక్షుల మార్పు కూడా ఉంటుందన్న చర్చ జరుగుతోంది.

- వివరాలు 5లో

నేడే నింగిలోకి డీ-3



ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగవేదిక నుంచి శుక్రవారం ఉదయం 9.17 గంటలకు స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ డీ3) ప్రయోగించేందుకు సర్వం సిద్ధమైంది.

- వివరాలు 16లో

3 ప్రాజెక్టులను ఆదుకున్న 'ఎల్లంపల్లి'



మిడ్‌మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్ ప్రాజెక్టులు ప్రస్తుతం జలకళ సంతరించుకున్నాయి. ఎల్లంపల్లి జలాలు ఎత్తిపోతల ద్వారా వస్తుండడంతో మూడు ప్రాజెక్టుల్లో నీటినిల్వలు పెరిగాయి.

- వివరాలు 12లో





ప్లాస్టిక్ బాటిల్ నీళ్లతో హై బీపీ!

- అధిక రక్తపోటుకు కారణమవుతున్న మైక్రో ప్లాస్టిక్స్
- ఇన్‌ఫ్లమేషన్, హార్మోన్ల అసమతుల్యత, కేన్సర్ లాంటి వాటికీ దోహదం
- నల్లా నీళ్లను వేడిచేసి తాగడం, స్టీల్ బాటిళ్ల వినియోగం మంచిది
- ఆస్ట్రియాలోని డాన్యూబ్ ప్రైవేట్ యూనివర్సిటీ పరిశోధనలో వెల్లడి

16లో

కొడుకు కోసం.. తల్లి నిర్బంధం

- ప్రేమించిన బాలికతో పరారైన బాలుడి తల్లిని వేధించిన ఎస్‌ఐ
- ఠాణాకు పిలిపించి కాళ్లు, చేతులు వాచిపోయేలా లాఠీ దెబ్బలు
- మూడు నెలలుగా పోలీస్ స్టేషన్‌కు హాజరవుతున్న బాధితురాలు
- బషీరాబాద్‌లో మరో 'షాద్‌నగర్' తరహా ఉదంతం..



బషీరాబాద్: షాద్‌నగర్ దళిత మహిళపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఘటన మరవకముందే వికారాబాద్ జిల్లా బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మరో దారుణం.. పదహారేళ్ల బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడైన కొడుకు ఆచూకీ చెప్పాలంటూ బాలుడి తల్లిని పోలీసులు చిత్రహింసలకు గురిచేశారు. రోజూ స్టేషన్‌కు పిలవడం.. కొడుకు గురించి వివరాలు చెప్పాలని ఒత్తిడి చేస్తూ సాయంత్రం వరకు కూర్చోబెట్టడం.. మధ్యలో లాఠీలతో విచక్షణారహితంగా కొట్టడం.. గడిచిన మే నుంచి ఆగస్టు 15 వరకూ ఇదే వరస.. కాలూచేయీ కూడ దీసుకోలేని స్థితిలో భర్త.. తను పనికి వెళ్తే కానీ పూట గడవని దుస్థితి.. పోలీసులు మాత్రం ఆమె పొట్టకొడుతూ మూడున్నర నెలలుగా ఠాణా చుట్టూనే తిప్పుతున్నారు. పంద్రాగస్టు సందర్భంగా వార్తా సేకరణకు బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన మీడియా ప్రతినిధులకు దీనస్థితిలో స్టేషన్ ముందు కూర్చున్న ఆమె కంటపడింది. ఆరా తీస్తే ఈ దారుణం వెలుగుచూసింది. బాధితురాలు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

కుమారుడిపై కిడ్నాప్ కేసు..

బషీరాబాద్ మండలం నవల్గా గ్రామానికి చెందిన లోహడ నరేష్ (17), కాశీంపూర్ గ్రామానికి చెందిన బాలిక (16) ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుని మే 2న ఇంట్లోంచి పారిపోయారు. తమ కూతురును నరేష్ కిడ్నాప్ చేశాడంటూ బాలిక కుటుంబసభ్యులు బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మే 4న నరేష్‌పై పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. బాలుడి తల్లి కళావతి, తండ్రి నర్సప్ప కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. పోలీసులు కళావతిని మే నెలలోనే ఠాణాకు పిలిపించారు. ఎస్‌ఐ రమేశ్‌కుమార్ ఆమెను విచారిస్తూ.. మిగతా 12వ పేజీలో ▶



రెండు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

- రంగారెడ్డి, గద్వాల జిల్లాల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. కుటుంబ సమేతంగా దైవదర్శనం చేసుకొని తిరుగు ప్రయాణమైన వారి వాహనాన్ని కారు ఢీకొంది. ఈ దుర్ఘటనలో రెండు నెలల బాలుడుతో సహా ముగ్గురు మృతిచెందారు. మరోవైపు పొట్టకూటి కోసం పనులకు వస్తున్న కూలీల ఆటోను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు.

- వివరాలు 5లో

విశ్వ వేదికపై తెలంగాణ బ్రాండ్

సగర్వంగా చాటాలి: సీఎం రేవంత్

పెట్టుబడుల ఒప్పందాలు కార్యరూపం దాల్చేలా కార్యాచరణ

దశాబ్దం తర్వాత రాష్ట్రంలో నిజమైన ప్రజాపాలన

రుణాల రీస్ట్రక్చరింగ్‌పై సర్కారు దృష్టి

గోల్కొండ కోటపై జాతీయ జెండా ఆవిష్కరించిన ముఖ్యమంత్రి



సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణను ప్రపంచానికి ముఖద్వారంగా మార్చాలి. విశ్వవేదికపై తెలంగాణ బ్రాండ్‌ను సగర్వంగా చాటాలి. అమెరికా, దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల గురించి సమగ్రంగా వివరించాం. ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణను పరిచయం చేశాం. ఈ సందర్భంగా, దావోస్ పర్యటన సందర్భంగా కుదుర్చుకున్న ఒప్పందాలు కార్యరూపం దాల్చడానికి కార్యాచరణ ప్రారంభించాం. పోరాడి సాధించుకున్న తెలంగాణలో దశాబ్దం తర్వాత నిజమైన ప్రజాపాలన మొదలైంది. లోతైన సమీక్షలతో మంచీ చెడులను విశ్లేషించి మెజారిటీ వర్గాల ప్రయోజనాలే ప్రామాణికంగా పాలన చేస్తున్నాం. ఇది ప్రజాస్వామ్యం అన్న స్పృహ, స్ఫూర్తితో పాలన చేస్తున్నాం..' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం గోల్కొండ కోటపై ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

స్వేచ్ఛా స్వాతంత్య్రాల పునరుద్ధరణ

'అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామన్నాం. అక్షరాలా చేసి చూపిస్తున్నాం. పాలకులు తప్పు చేస్తే నిలదీసే స్వేచ్ఛ ఈ రోజు తెలంగాణలో ఉంది. మా ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విధ్వంసమై ఉంది. గత పదేళ్లలో రాష్ట్ర అప్పు దాదాపు 10 రెట్లు పెరిగింది. రాష్ట్ర ఆవిర్భావ సమయంలో రూ.75,577 కోట్లు ఉన్న అప్పు, 2023 డిసెంబర్ నాటికి రూ.7 లక్షల కోట్లకు చేరింది. ప్రస్తుతం ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థకు చికిత్స చేస్తున్నాం. అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో జరిగిన భేటీలో తక్కువ వడ్డీలతో రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చుకునే అంశంపై సానుకూల చర్చలు జరిగాయి. గతంలో మాదిరిగా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రజలపై భారం మోపం' అని రేవంత్ చెప్పారు.

త్వరలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు

'ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలలో రెండు గ్యారంటీల అమలు బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే ప్రారంభించి చరిత్ర సృష్టించాం. మహాలక్ష్మీ పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాల ద్వారా జూలై నాటికి మహిళలు రూ. 2,619 కోట్లు ఆదా చేయగలిగారు. ఆరోగ్యశ్రీ వైద్యచికిత్సల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఆరోగ్యశ్రీ అమలు చేయాలని నిర్ణయించాం. ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు జారీని త్వరలో ప్రారంభిస్తాం. రూ.500కే వంట గ్యాస్ సరఫరాతో 43 లక్షల మందికి లబ్ధి చేకూరుతోంది. గృహజ్యోతి పథకం కింద 47,13,112 పేదల గృహాలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. నియోజకవర్గానికి 3,500 చొప్పున 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని ముఖ్యమంత్రి తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి కొత్త చట్టం

'ధరణిలో అనేక అవకతవకలు జరిగినట్టుగా గుర్తించాం. భూ సమస్యల పరిష్కారానికి సరికొత్త సమగ్ర చట్టం తీసుకురావాలని భావిస్తున్నాం. డ్రగ్స్ విషయంలో జీరో టాలరెన్స్‌ను అనుసరిస్తున్నాం. సైబర్ నేరాల బాధితులకు సత్వర సహాయం అందేలా 1930 నంబర్‌తో 24 గంటలు పనిచేసే కాల్ సెంటర్ ఏర్పాటు చేశాం. విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చబోతున్నాం. బేగరి కంచె వద్ద యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశాం..' అని సీఎం పేర్కొన్నారు.

అమరవీరులకు సీఎం నివాళి

సాక్షి, హైదరాబాద్/రసూల్‌పురా: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని గురువారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలోని అమరవీరుల స్తూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు ఆర్మీ ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ముందుగా జూనియర్ సైనికుడు ఒకరు నివాళులర్పించిన అనంతరం ఆర్మీ అధికారులు, సీఎం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి.. పలువురు ఆర్మీ ఉన్నతాధికారులతో మాట్లాడారు. కాగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కూడా రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు.

నిరుద్యోగులు చెప్పుడు మాటలు వినొద్దు

'రాష్ట్రంలో 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశాం. శాసనసభలో జాబ్ క్యాలెండర్ ప్రవేశ పెట్టాం. నిరుద్యోగ యువత చెప్పుడు మాటలు విని భవిష్యత్తును చెడగొట్టుకోవద్దు. 63 లక్షల మంది మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఇందిర మహిళా శక్తి పథకానికి రూపకల్పన చేశాం. 63.86 లక్షల మంది మహిళా సభ్యులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నాం. పొరుగు రాష్ట్రాలు, కేంద్రంతో స్నేహ పూర్వకంగా, సఖ్యతతో వ్యవహరిస్తున్నాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు. 'రైతన్నలకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ ఓ అద్భుత ఘట్టం..' అని అన్నారు.

మాట నిలబెట్టుకున్నాం



గురువారం వైరాలో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు

▶ మొదటి పేజీ తరువాయి

బతికేలా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే.. డబుల్ బెడ్రూంల పేరిట కేసీఆర్ మోసం చేశారు.

బీఆర్‌ఎస్ బతుకు బస్టాండే..

మా సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నవి లేనివి మాట్లాడుతున్నరు. కాంగ్రెస్ మోసం చేస్తోందని కేసీఆర్ ఆరోపణలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో గుండు సున్నా వచ్చినా ఇంకా బుద్ధి మారలేదా? తెలంగాణ సమాజం మిమ్మల్ని నమ్మితే ఒక్క సీటైనా ఇచ్చేది. మీ పార్టీ పరిస్థితి హీనంగా దివాలా తీసి బతుకు బస్టాండ్ అయింది. అడవి పందులు తిన్నంత తిని ఊరుకోకుండా పంట పొలాలను సర్వనాశనం చేస్తాయి. అలాగే కేసీఆర్ కుటుంబ సభ్యులు చేయగలిగినంత దోపిడీ చేసి ఊరుకోకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారు. కేసీఆర్ చేసిన అప్పులకు మిత్తీలు కట్టేందుకే మేం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

రీడిజైనింగ్ పేరుతో భారీ దోపిడీ

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించే ప్రాజెక్టుకు రూ.1,500 కోట్లు ఖర్చు పెడితే సరిపోయే సమయంలో రీడిజైనింగ్ పేరిట అంచనాలను రూ. 18 వేల కోట్లకు పెంచి మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు ప్రజలను దోపిడీ చేశారు. కేసీఆర్ పాలన అంతా అంచనాలు పెంచుడు, నిధులు మెక్కుడు మీదనే ఉండేది. దోపిడీ గురించి తెలిసిపోతుందనే భయంతోనే సీతారామ ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్)ను కేంద్రానికి సమర్పించకుండా పదేళ్లు కాలయాపన చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిసి.. అనుమతులు తెచ్చాం.



వైరా సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

'సీతారామ'తో 7 లక్షల ఎకరాలకు నీళ్లు..

భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ప్రతిపాదనతో ఈరోజు సీతారామ ప్రాజెక్టు నుంచి నీరు పొంగింది. కృష్ణా జలాలు ఖమ్మం జిల్లాకు అందకపోతే గోదావరి జలాలను తీసుకువచ్చి కాల్వల్లో పారించాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నాం. ఇంకో రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తేగానీ 'సీతారామ'ప్రాజెక్టు పూర్తవదు. 2026 ఆగస్టు 15లోపు ప్రాజెక్టు పూర్తిచేసి ఖమ్మం జిల్లాలో 7 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. దీనికితోడు పాలమూరు-రంగారెడ్డి, ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పూర్తయితే తెలంగాణ సస్యశ్యామలమై రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తుంది..''అని రేవంత్ చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీలు పోరిక బలరాంనాయక్, రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మూడు పంపులు.. ముగ్గురితో ప్రారంభం



పంప్‌హౌస్ నుంచి గోదావరి పరవళ్లు...

హెలికాప్టర్ ద్వారా పూసుగూడెం చేరుకున్న సీఎం రేవంత్, మంత్రులు అక్కడ పైలాన్‌ను ఆవిష్కరించారు. తర్వాత పంపుహౌస్ కంట్రోల్ రూమ్‌కు చేరుకుని మోటార్లు స్విచ్చాన్ చేశారు. మొదటి పంపును మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రెండో పంపును సీఎం రేవంత్‌రెడ్డి, మూడో పంపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే సీతారామ ప్రాజెక్టుతో భద్రాద్రి జిల్లాకు అన్యాయం జరుగుతోందంటూ బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) ఆధ్వర్యంలో నిరసనలకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు సిద్ధం: భట్టి



వైరా సభలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులన్నీ అవినీతిమయమని.. తమ ప్రాజెక్టులు ప్రజలపరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. వైరా సభలో ఆయన మాట్లాడారు. ''ఈ రాష్ట్రంలో ఏయే ప్రాజెక్టులు ప్రారంభించాం, తక్కువ ఖర్చుతో ఏం పూర్తి చేశామనే చర్చకు ఎక్కడైనా, ఎప్పుడైనా నేను, మా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చర్చకు సిద్ధం. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ సిద్ధమా? పదేళ్లలో రూ.లక్ష రుణమాఫీ చేయలేని గత ప్రభుత్వం.. ఏకకాలంలో 15 రోజుల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన మా ప్రభుత్వానికి పోలిక ఉందా? దేశంలో ఏ రాష్ట్ర చరిత్రలోనూ లేనట్టుగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు బడ్జెట్లో రూ.72 వేల కోట్లు కేటాయించాం. సీఎం ఆదేశించిన వెంటనే శుక్రవారం రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ అవుతాయి..'' అని తెలిపారు. గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తీసుకురావాలనే ఉద్దేశంతో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్‌లకు పునాది వేశారని గుర్తు చేశారు. వైఎస్ హయాంలోనే వీటికి రూ.1,500 కోట్లకు పైగా ఖర్చు చేశారని.. మరో రూ.1,548 కోట్లు ఖర్చు చేస్తే 4 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వచ్చేదని చెప్పారు. కానీ బీఆర్‌ఎస్ వీటిని పక్కనపెట్టి రీడిజైనింగ్ పేరిట సీతారామ ప్రాజెక్టును తెచ్చి దోపిడీ చేసిందని.. వేల కోట్లు దండుకునేందుకు, కమీషన్ల కక్కుర్తి కోసం ఐదేళ్ల ముందే మోటార్లను కొనుగోలు చేసిందని ఆరోపించారు.

బీఆర్‌ఎస్ అసమర్థత వల్లే ప్రాజెక్టు ఆలస్యం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



పదేళ్లలో రూ. 7,500 కోట్లు ఖర్చు చేసినా, బీఆర్‌ఎస్ ప్రభుత్వ అసమర్థతతో సీతారామ ప్రాజెక్టు పూర్తికాలేదని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. తమ మంత్రుల పర్యవేక్షణతోనే ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయన్నారు. మరో 15 రోజుల్లో ప్రాజెక్టు ద్వారా 67 టీఎంసీల నీళ్ల వాడుకునేందుకు కేంద్రం నుంచి అనుమతులు వస్తాయని చెప్పారు. రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లలో 35 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు.

మేమే ప్రారంభించాం.. మేమే పూర్తి చేస్తాం: పొంగులేటి



గతంలో కాంగ్రెస్ ప్రారంభించిన ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ ప్రాజెక్టులను ఇప్పుడు కాంగ్రెస్ పార్టీయే పూర్తి చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. వైఎస్సార్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల పనులు మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే జరుగుతున్నాయన్నారు. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి చుక్కనీరు ఇవ్వకుండా కాలం వెళ్లదీశారని మండిపడ్డారు. ఇప్పటివరకు సీతారామ ప్రాజెక్టు పనులు 39 శాతమే పూర్తయ్యాయని వెల్లడించారు.

రైతు రుణం తీర్చుకుంటున్నాం: తుమ్మల



రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం కోసం ప్రజలు తపించారని, వారి రుణం తీర్చుకుంటున్నామని మంత్రి తుమ్మల చెప్పారు. ''రైతులకు రూ.31 వేల కోట్లు రుణాలు మాఫీ చేసి మాట నిలబెట్టుకున్నాం. కొన్ని పార్టీలు రుణమాఫీ రాలేదంటూ వాట్సాప్ చేయాలంటున్నాయి. గత పదేళ్లలో చేయని హామీల గురించి వాట్సాప్ చేస్తే మంచిది' అని పేర్కొన్నారు.

ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొడతాం: మంత్రి కోమటిరెడ్డి



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని.. అందులో భాగంగా రైతు రుణమాఫీ చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఎన్ని వేల కోట్లు అయినా ఖర్చు చేస్తామన్నారు.

సీఎం చేతుల మీదుగా చెక్కులిస్తామని పిలిచి..

వైరా: సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రూ.2 లక్షల రుణమాఫీ చెక్కులు అందుకుందామని వచ్చిన పలువురు రైతులకు నిరాశ ఎదురైంది. సీఎం రేవంత్ వైరా సభలో రుణమాఫీని ప్రకటించి రైతులకు చెక్కులు ఇస్తారని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. ఇందుకోసం కారేపల్లి మండలం చీమలపాడుకు చెందిన అజ్మీరా రాజేశ్వరి, వైరా మండలం స్నానాల లక్ష్మీపురానికి చెందిన అడుసుమిల్లి పురుషోత్తం, వైరాకు చెందిన దార్ల పూజ, ధీరావత్ బిచ్చా, రఘునాథపాలెం మండలం పరికలబోడు తండాకు చెందిన తేజావత్ వీరు, ఏన్కూరు మండలం జన్నారానికి చెందిన పి.నర్సయ్య, కల్లూరు మండలం బాలాజీనగర్‌కు చెందిన పిల్లా నాగేశ్వరరావు, మధిర మండలం సిద్ధినేనిగూడెంకు చెందిన కె.వీరస్వామి తదితరులను రెండు గంటల ముందుగానే సభా ప్రాంగణానికి తీసుకొచ్చారు. సీఎం ప్రసంగం ముగియగానే జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల ఆ రైతులను వేదికపైకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. కానీ సీఎం రేవంత్ పట్టించుకోకుండా మంత్రులతో కలిసి వెళ్లిపోవడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు.



సీఎం చేతుల మీదుగా రుణమాఫీ చెక్కులు అందుకునేందుకు ఎంపిక చేసిన రైతులు

అబద్ధం కూడా ఆత్మహత్య చేసుకుంటుంది

- రుణమాఫీ పూర్తిచేశామన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- ఉమ్మడి ఏపీ, తెలంగాణ చరిత్రలో ఇంత దిగజారుడు సీఎం ఇంకెవ్వరూ లేరు
- దగా చేసినట్లు తెలిశాక రాజీనామా ఎవరు చేయాలి?



సాక్షి, హైదరాబాద్: దిగజారుడు భాషలో నోటికొచ్చినట్లు బీఆర్‌ఎస్‌ను తిడితేనో, తెచ్చిపెట్టుకున్న ఆవేశంతో రంకెలు వేస్తేనో అబద్ధాలు నిజాలైపోవన్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు హితవు చెప్పారు. రుణమాఫీపై మాటతప్పి, తప్పును కప్పిపుచ్చుకునేందుకు సీఎం అవాకులుచెవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి స్థాయికి తగినట్టు ప్రవర్తించడం లేదనే విషయాన్ని రేవంత్ ప్రతి సందర్భంలోనూ నిరూపించుకుంటున్నారని హరీశ్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చరిత్రలో ఇంతగా దిగజారిన ముఖ్యమంత్రి ఇంకెవరూ లేరని విమర్శించారు. అబద్ధం కూడా సిగ్గుపడి మూసీలో దూకి ఆత్మహత్య చేసుకునేలా రేవంత్ ప్రవర్తన ఉందన్నారు. దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకొని కూడా మాట మీద నిలబడక పోగా, నిస్సిగ్గుగా బీఆర్‌ఎస్‌పై, తనపై విమర్శలకు దిగారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియా గాంధీ పుట్టిన రోజు కానుకగా డిసెంబర్ 9 నాటికి రూ.40 వేల కోట్ల రైతు రుణమాఫీ ఏకకాలంలో చేస్తానన్నది రేవంత్‌రెడ్డేనని పేర్కొన్నారు. తర్వాత అది నెరవేర్చలేక పార్లమెంట్ ఎన్నికల ముందు మరో నాటకానికి తెరలేపారని, ఆగస్టు 15 వరకు రూ.31 వేల కోట్లు మాఫీ చేస్తానని ఎన్నికల్లో ఊదరగొట్టి, ఇప్పుడు రూ.13 వేల కోట్లు కోత పెట్టారన్నారు. అయినా ఎవరూ నమ్మడం లేదని, ప్రతి ఊరి దేవుడి మీద రేవంత్ ప్రమాణాలు చేశారని చెప్పారు.

మోసమే తన విధానం..

'సోనియా మీద ఒట్టు పెట్టినా, దేవుళ్ల మీద ఒట్టు పెట్టినా అబద్ధమే నా లక్షణం. మోసమే నా విధానం. మాట తప్పడమే నా నైజం అనే విధంగా రేవంత్ నిజస్వరూపాన్ని బట్టబయలు చేసుకున్నారు' అని హరీశ్‌రావు మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో మొదటి దఫాలో 35 లక్షల మంది రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తేనే దాదాపు రూ.17 వేల కోట్లు అయ్యిందని, కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే 22 లక్షల మంది రైతులే ఉంటారా, రూ.17,869 కోట్లు మాత్రమే అవుతాయా? అని ప్రశ్నించారు. ఈ ఒక్క విషయంతోనే ఈ రుణమాఫీ పచ్చి అబద్ధమని తేలిపోతోందన్నారు. రుణమాఫీ పేరుతో దగా చేశారని స్పష్టంగా తేలిన తర్వాత రాజీనామా ఎవరు చేయాలి? ఏట్లో దూకి ఎవరు చావాలి? అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి రైతు ద్రోహానికే కాక దైవ ద్రోహానికి కూడా పాల్పడ్డారన్నారు. ముఖ్యమంత్రిగా ఉండి దేవుళ్ల మీద ఒట్టుపెట్టి, మాట తప్పిన ఆయన చేసిన అపచారానికి వెంటనే ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్నారు. కానీ ఆయనకు ఆ సంస్కారం లేదని, రేవంత్‌లో ఉన్నది వికారమే తప్ప, సంస్కారం కాదని విమర్శించారు. ముఖ్యమంత్రి స్థాయిలో మాట తప్పినందుకు ఆ దేవుళ్లు తెలంగాణ మీద ఎక్కడ ఆగ్రహిస్తారో, ఆ పాప ఫలితం ప్రజలకు ఎక్కడ శాపంగా మారుతుందో అని తాను ఆందోళన చెందుతున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ చేసిన తప్పుకు, దైవ ద్రోహానికి తెలంగాణ మీద ఆగ్రహించవద్దని ముక్కోటి దేవుళ్లకు మొక్కుతున్నట్లు హరీశ్ చెప్పారు.

ఇది ముమ్మాటికీ రైతులకు ద్రోహమే

- రూ.17,900 కోట్లతోనే రూ.2 లక్షల రుణమాఫీ ఎలా సాధ్యం?
- రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వివరించాలి: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పాలనలో రూ.లక్ష రుణమాఫీకే రూ.17 వేల కోట్లు ఖర్చు అయితే, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో రూ.17,900 కోట్లతోనే రూ.2 లక్షల రుణమాఫీ ఎలా సాధ్యం అయ్యిందో ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి వివరించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రుణమాఫీ మొత్తం రెట్టింపు అయినప్పుడు లబ్ధిదారుల సంఖ్య పెరగాల్సిందిపోయి తగ్గడం కాంగ్రెస్ మోసపూరిత విధానానికి నిలువెత్తు నిదర్శనమని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది ముమ్మాటికీ రైతులకు ద్రోహం చేయడమేనన్నారు. వరికి బోనస్ పథకంలా.. రుణమాఫీ కూడా బోగస్ అని విమర్శించారు. చారాణా రుణమాఫీకి బారాణా ప్రచారం అని ఎద్దేవా చేశారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారును రైతన్నలతో కలిసి ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వమే కట్టినట్లుగా చెప్పుకోవడం విడ్డూరం: ఎంపీ వద్దిరాజు



సాక్షి, హైదరాబాద్: ఏడెనిమిది నెలల్లో సీతారామ ప్రాజెక్టు సాధ్యం కాదని, ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వమే కట్టినట్లుగా చెప్పుకోవడం విడ్డూరమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ధ్వజమెత్తారు. అధికారంలో ఉండి స్విచ్చాన్ చేయండి సంతోషిస్తాం... అంతేకానీ గత పాలకులను అవమానించొద్దని హితవుపలికారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా రైతులు, ప్రజల గుండెల్లో నుంచి మాజీ సీఎం కేసీఆర్‌ను తీసేయలేరని అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌తో కలిసి రవిచంద్ర మీడియాతో మాట్లాడారు. తెలంగాణ నుంచి ఎంతో మంది రాజ్యసభకు అర్హులుగా ఉన్నా తెలంగాణ కోసం ఏ రోజు కూడా అనుకూలంగాలేని అభిషేక్ సింఘ్వీకి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో వీహెచ్ సహా బీసీ, ఎస్సీ, మైనారిటీలు కనిపించలేదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పదవులన్నీ తెలంగాణేతరులకే వచ్చాయని, కేసీఆర్‌పై అనేక ఒత్తిళ్లు వచ్చినా ఇతర రాష్ట్రాల వారికి రాజ్యసభ సీటు ఇవ్వలేదని గుర్తు చేశారు. కేసీఆర్ తెలంగాణ తెచ్చినందుకే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని చెప్పారు.

రేవంత్ భాషను చూసి ప్రజలు సిగ్గుతో తలదించుకుంటున్నారు

ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కౌశిక్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న భాషను చూసి ప్రజలు సిగ్గుతో తలదించుకుంటున్నారని బీఆర్‌ఎస్ ధ్వజమెత్తింది. ఇంతటి అసభ్య సీఎం దేశంలో మరొకరు లేరని ఆపార్టీ ఎమ్మెల్యేలు విమర్శించారు. తెలంగాణభవన్‌లో గురువారం ఎమ్మెల్యేలు పల్లారాజేశ్వర్‌రెడ్డి , కొత్త ప్రభాకర్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి పట్టిన చీడపీడ అని వ్యాఖ్యానించారు. సీఎం నోరు తెరిస్తే బూతులతోపాటు అబద్ధాలు..అవాస్తవాలే మాట్లాడుతున్నారన్నారు. 30 వేల ఉద్యోగాలు, సీతారామసాగర్‌పై సీఎం, మంత్రులు అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. మొదట రైతు రుణమాఫీకి రూ.40 వేల కోట్లు అవుతుందని చెప్పి, తర్వాత రూ.31 వేల కోట్లు అని, ఇప్పుడు రూ.17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. హరీశ్‌రావు సీఎం మెడలు వంచి రుణమాఫీ చేయించారన్నారు. హరీశ్‌రావును తిడితే ఆకాశం మీద ఉమ్మి వేసినట్టేనని చెప్పారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున కూడా సీఎం రేవంత్ బూతు పురాణం అందుకోవడం సిగ్గుచేటని, రుణమాఫీ పూర్తి చేయనందుకు రేవంత్ అమరుల స్తూపం దగ్గర ముక్కు నేలకు రాయాలన్నారు.



గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ మంత్రి శంకర్‌రావు, కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, పీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్‌మానేరు నిండా.. మువ్వన్నెల జెండా



మత్స్యకారులు మిడ్‌మానేరు జలాల్లో జాతీయజెండాను ఆవిష్కరించి తమ దేశభక్తిని చాటుకున్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో.. ముంపునకు గురైన కొడుముంజ శివారులోకి తెప్పల్లో వెళ్లి జాతీయజెండాను ఎగురవేశారు.

– వేములవాడ అర్బన్



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నివాసంలో...
ఢిల్లీలోని తన నివాసంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి



హైదరాబాద్ సీబీఐ కోర్టు ఆవరణలో జరిగిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో ప్రిన్సిపల్ జడ్జి డాక్టర్ టీ రఘురామ్. చిత్రంలో ఏసీబీ కోర్టు జడ్జి అఫ్రోజ్ అక్తర్, సీబీఐ జడ్జి ఈవో మైత్రేయిని, జ్యుడీషియల్ ఉద్యోగుల సంఘం జాతీయాధ్యక్షుడు బి.లక్ష్మారెడ్డి తదితరులు

ర్యాగింగ్, డ్రగ్స్‌పై సమరభేరి

- ఇంజనీరింగ్ కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు
- రేపు ఉన్నతస్థాయి సదస్సు నిర్వహించనున్న ఉన్నత విద్యామండలి
- కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో ర్యాగింగ్, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఉన్నత విద్యామండలి ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి ఇప్పటికే ఈ అంశంపై అన్ని స్థాయిల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఈ నెల 17న హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసవుతున్న ఉదంతాలు కొంతకాలంగా పెరుగుతున్నాయి. రాష్ట్రంలో పలు యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇవి వెలుగు చూశాయి. వీటి వెనుక మాదకద్రవ్యాల మాఫియా ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. తొలి దశలో విద్యార్థుల్లో అవగాహన పెంచాలని ప్రభుత్వ నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇలాంటి ఘటనలు బయటపడకుండా యాజమాన్యాలు జాగ్రత్త పడుతున్నాయి. ధనిక విద్యార్థులు చదివే కాలేజీల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు ఆశించినంతగా లేవని నిఘా వర్గాలు ప్రభుత్వానికి చెప్పాయి. మాదక ద్రవ్యాలతో సంబంధం ఉన్న వారిని గుర్తించి, కౌన్సెలింగ్ ఇవ్వడానికి గల ఏర్పాట్లపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. కౌన్సెలింగ్ తర్వాత కూడా ఈ దిశగా అడుగులేసే విద్యార్థులపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించాలని అధికారులు భావిస్తున్నారు. దీనికి సంబంధించిన చట్టాలను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు తెలియజేసేందుకు కాలేజీలు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఉన్నత విద్యామండలి ఆదేశించింది.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ తీవ్రంగా ఉందని అధికారులు భావిస్తున్నారు. గ్రామీణ విద్యార్థులు ఎక్కువగా ర్యాగింగ్‌కు గురవుతున్నట్లు గుర్తించారు. కొన్ని విద్యాసంస్థల్లో కుల వివక్షతో కూడిన ర్యాగింగ్ జరుగుతోందని చెబుతున్నారు. ఇలాంటి ఉదంతాలపై కొరడా ఝుళిపించాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఇటీవల రాష్ట్రాలకు ఆదేశాలు పంపింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను కూడా వెల్లడించింది. ప్రతి కాలేజీలోనూ ర్యాగింగ్, మాదక ద్రవ్యాల కట్టడికి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పింది. ఇందులో ఫ్యాకల్టీతోపాటు, సీనియర్ విద్యార్థులు, ఉన్నత అధికారులను భాగస్వాములను చేయాలని పేర్కొంది. అయితే, ఏఐసీటీఈ మార్గదర్శకాలు ఎక్కడా అమలవ్వడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విద్యా సంవత్సరం నుంచి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

17న ఉన్నతస్థాయి సదస్సు

విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల నిరోధం, ర్యాగింగ్ అంశాలపై ఈ నెల 17న జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీలో ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి డీజీపీ జితేందర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, కాలేజియేట్ కమిషనర్ దేవసేన, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య హాజరవుతున్నారు. యాంటీ ర్యాగింగ్, మాదక ద్రవ్యాల నియంత్రణపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

ఉపేక్షించేది లేదు



మాదక ద్రవ్యాల వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం. ఈ విషయంలో ఎంతటివారున్నా కఠినంగా చర్యలు తప్పవు. ఈ దిశగా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయి. మాదక ద్రవ్యాల వినియోగంపై సమాచారం ఉంటే విద్యార్థులు స్వేచ్ఛగా మా దృష్టికి తేవాలి.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మన్

ర్యాగింగ్ భూతాన్ని పారదోలాలి



కాలేజీల్లో ర్యాగింగ్ వ్యతిరేక కమిటీలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే సూచించాం. ఇక నుంచి దీన్ని మరింత విస్తృతం చేస్తాం. కొత్తగా కాలేజీలకు వచ్చే వారిలో మనోనిబ్బరం కల్పించడం, ర్యాగింగ్‌ను ఎదుర్కొనే ధైర్యాన్ని ఇవ్వడానికి కృషి చేస్తాం.

– ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి



స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ఆవరణలోని మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాసనసభ ఆవరణలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. శాసనమండలి ప్రాంగణంలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో బీజేపీ పాత్ర లేదని, కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్నదని, పలువురు పోరాటయోధులను కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎర్రకోట వేడుకల్లో తెలంగాణ విద్యార్థి

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో గురువారం జరిగిన స్వాతంత్య్రదిన వేడుకల్లో తెలంగాణ విద్యార్థి రాంటెంకి విష్ణువర్ధన్ పాల్గొన్నాడు. వికసిత్ భారత్ ప్రేరణ కార్యక్రమంలో భాగంగా గత ఏప్రిల్ 10న కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కిష్టాపూర్‌లోని జడ్పీ హైస్కూల్ విద్యార్థి విష్ణువర్ధన్ ఈ పోటీల్లో పాల్గొని విజయం సాధించాడు. దీంతో విష్ణువర్ధన్ ఎర్రకోట పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశాక ప్రధాని మోదీ దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు.



దేశాన్ని విడగొట్టేందుకు కుట్రలు

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: భారత్‌ను కులాలు, మతాల పేరుతో విడగొట్టాలని కొన్ని విదేశీ శక్తులతో పాటు, ఇక్కడి కాంగ్రెస్ వంటి కొన్ని రాజకీయ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్ ఆరోపించారు. కొన్ని పశ్చిమ దేశాలతో పాటు అరబ్బు దేశాలు భారత్‌ను బలహీన పర్చాలని చూస్తున్నాయన్నారు. ఈ విచ్ఛిన్నకర శక్తుల సవాళ్లను ప్రతి భారతీయుడు కులాలు, మతాలకు అతీతంగా ఎదుర్కోవడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా గురువారం బీజేపీ కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ శక్తులన్నీ కలసి స్వాతంత్య్ర సమరయోధుల చరిత్రను కనుమరుగు చేసేలా ప్రయత్నిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయలబ్ధి కోసమే దేశ మహనీయుల త్యాగాలను కనుమరుగు చేసే కుట్రలు చేస్తోందన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల వెనుక పాకిస్తాన్, చైనా కుట్రలున్నాయని ఆరోపించారు. హిందువులపై దాడుల విషయంలో రాహుల్ గాంధీ కనీసం నోరు మెదపకపోవడం దారుణమన్నారు. మమతా బెనర్జీ ప్రభుత్వం ఓట్ల కోసం రోహింగ్యాలకు సకల సదుపాయాలు కల్పిస్తూ దేశ సంపదను దోచిపెడుతోందని ఆయన మండిపడ్డారు.



సచివాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



కోఠి ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో..

హైదరాబాద్‌లోని కోఠి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ రష్మీ సిన్హా, ప్రకాశ్ చంద్ర బారోర్, (జనరల్ మేనేజర్ ఎన్‌డబ్ల్యూ-2), రవి కుమార్ వర్మ, (జనరల్ మేనేజర్ ఎన్‌డబ్ల్యూ-1) పాల్గొన్నారు.



హైకోర్టు నూతన వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న సీజే జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ శామ్ కోషి, జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ శరత్ కాజా తదితరులు

త్వరలో నూతన హైకోర్టు నిర్మాణ పనులు

- న్యాయవాదుల భద్రత చట్టానికి ప్రభుత్వం సుముఖత
- 78వ స్వాతంత్య్ర దినోత్సవంలో హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే
- హైకోర్టు కొత్త వెబ్‌సైట్, ఈ–టీహెచ్‌సీఆర్, డిజి టీహెచ్‌సీఆర్ పోర్టళ్లను ప్రారంభించిన సీజే

సాక్షి, హైదరాబాద్: నగరంలోని రాజేంద్రనగర్‌లో నూతన హైకోర్టు భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే చెప్పారు. హైకోర్టులో గురువారం ఘనంగా నిర్వహించిన 78వ స్వాతంత్య్ర దిన వేడుకల్లో జస్టిస్ అలోక్ అరాధే జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'కొత్త హైకోర్టు నిర్మాణానికి భారత ప్రధాన న్యాయమూర్తి శంకుస్థాపన చేశారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్మాణానికి బడ్జెట్ కేటాయించింది. గత ఏడాది కాలంలో నాలుగు లోక్ అదాలత్‌ల్లో 73,786 కేసులను పరిష్కరించాం. రూ.4.94 కోట్లు బాధితులకు అందించాం. ఎంతోమంది యువతీ యువకులు న్యాయవ్యవస్థ వైపు ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణ న్యాయవాదుల భద్రత చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాం. త్వరలోనే ఆ చట్టం వస్తుందని ఆశిస్తున్నాం. రాజ్యాంగాన్ని నడిపించడంలో న్యాయవ్యవస్థ పాత్ర అత్యంత కీలకం. ఇందులో న్యాయమూర్తులు, న్యాయవాదులది సమ ప్రాధాన్యత. ఏడాదిలో 9,810 పెండింగ్ కేసులు పరిష్కరించాం. కోర్ట్ రికార్డ్స్ డిజిటలైజేషన్‌లో భాగంగా హనుమకొండ, నల్లగొండ కోర్టులను మోడల్ కోర్టులుగా గుర్తించాం' అని అన్నారు.

సరికొత్తగా హైకోర్టు వెబ్‌సైట్

హైకోర్టు కొత్త వెబ్‌సైట్, ఎల్రక్టానిక్ తెలంగాణ హైకోర్టు రిపోర్ట్స్ (ఈ–టీహెచ్‌సీఆర్), డిజిటల్ తెలంగాణ హైకోర్టు రిపోర్ట్స్ (డిజి టీహెచ్‌సీఆర్) పోర్టళ్లను సీజే జస్టిస్ అరాధే ప్రారంభించారు. ఈ పోర్టళ్లలో తీర్పులు ఆంగ్లంతోపాటు తెలుగులోనూ అందుబాటులో ఉంటాయని ఆయన వెల్లడించారు. ఇకపై హైకోర్టు ఆవరణలో వైఫై ఉచితంగా అందుబాటులోకి రానుందని, ఇది కక్షిదారులకు, న్యాయవాదులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సామాన్యులు కూడా వివరాలు తెలుసుకునేలా ఈ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు చెప్పారు. డిజిటలైజేషన్‌కు కూడా చర్యలు తీసుకుంటున్నామని, రెండు ద్విసభ్య ధర్మాసనాలు కాగితరహితంగా పనిచేస్తున్నాయని సీజే పేర్కొన్నారు. హనుమకొండ, నల్లగొండ కోర్టులను తొలిదశ డిజిటలైజేషన్‌కు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) అధ్యక్షుడు ఎ.రవీందర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తితోనే వర్గీకరణ ఉద్యమం

మంద కృష్ణమాదిగ



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తితోనే ఎస్సీ వర్గీకరణ ఉద్యమం కొనసాగిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. గురువారం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన తర్వాత ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం జరిగిన స్వాతంత్య్ర ఉద్యమం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని అంతిమంగా విజయం సాధించిందని అన్నారు. దేశ సంపద అన్ని వర్గాలకు పంపిణీ జరిగి, ప్రజల సామాజిక జీవన స్థితిగతుల్లో మార్పులు రావాలని అన్నారు. తమ ఉద్యమంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ముందుకు సాగడం వెనుక డాక్టర్ అంబేడ్కర్ స్ఫూర్తి ఉందని తెలిపారు. స్వాతంత్య్ర పోరాటంలో ధర్మం ఉంది కనుక విజయం సాధించిందని, అలాగే ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో కూడా ధర్మం ఉంది కనుకనే విజయం సాధించామని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రగతిలో అటవీశాఖ భాగస్వామి

పీసీసీఎఫ్ డోబ్రియాల్



సాక్షి, హైదరాబాద్: దేశంలో అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణకు దక్కుతున్న ఘనత, గుర్తింపులో అటవీ శాఖ కూడా భాగస్వామి కావడం గొప్ప విషయమని పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్ పేర్కొన్నారు. అరణ్య భవన్‌లో గురువారం నిర్వహించిన స్వాతంత్య్రదిన వేడుకల్లో డోబ్రియాల్ జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ ఏడాది వజ్రోత్సవ వనమహోత్సవం కార్యక్రమం ద్వారా 20 కోట్ల మొక్కలను నాటాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు.



భయపడేవాటి విషయంలోనేమో చావు ఉన్నవాళ్లుగానూ,
కోరుకునేవాటి విషయంలోనేమో ఎప్పటికీ చావులేనివాళ్లుగానూ
జనం వ్యవహరిస్తుంటారు.
– సెనెకా

సాక్షి
శుక్రవారం, 16 ఆగస్టు 2024

మళ్లీ తెరపైకి పౌరస్మృతి

వరసగా మూడోసారి గద్దెనెక్కిన తర్వాత ఎర్రకోట బురుజులపై నుంచి చేసిన తొలి ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలకమైన అంశాలు ప్రస్తావించారు. అందులో ప్రధానమైనది ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ). ఇప్పుడున్న 'మతతత్వ పౌరస్మృతి' స్థానంలో 'సెక్యులర్ పౌరస్మృతి' రావాల్సిన అవసరం ఉందన్నది మోదీ నిశ్చితాభిప్రాయం. నిజానికి ఇదేమీ కొత్త కాదు. ఇంతక్రితం సైతం పలు సందర్భాల్లో యూసీసీ గురించి ఆయన మాట్లాడారు. నిరుడు జూన్‌లో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన బీజేపీ కార్యకర్తల సదస్సులో దీనిపై ఆయన గొంతెత్తారు. ఆ మాటకొస్తే పూర్వపు జనసంఘ్ నుంచీ బీజేపీ దీన్ని తరచూ చెబుతోంది. కనుక ఇందులో కొత్త ఏమున్నదని అనిపించవచ్చు. అయితే గతంలో ప్రస్తావించటానికీ, ఇప్పుడు మాట్లాడటానికీ మధ్య మౌలికంగా వ్యత్యాసముంది. గత పదేళ్ల నుంచి ఆయన ఎన్డీయే ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్నా బీజేపీకి సొంతంగానే పాలించగల సత్తా ఉండేది. ఇప్పుడు కూటమి పక్షాలపై ఆధారపడక తప్పనిస్థితి వచ్చింది. ప్రధాని తాజా ప్రసంగంలో ఇంకా అవినీతి, మహిళల భద్రత, ఒకే దేశం–ఒకేసారి ఎన్నికలు వంటివి కూడా చోటుచేసుకున్నాయి. నిజానికి ఎర్రకోట బురుజు ప్రసంగం లాంఛనమైన అర్థంలో విధాన ప్రకటనేమీ కాదు. కానీ రాగల అయిదేళ్ల కాలంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం చేయదల్చుకున్నదేమిటన్న విషయంలో ఆయన స్పష్టతతో ఉన్నారని అర్థం చేసుకోవచ్చు.

మనం పూర్తి స్థాయి సెక్యులర్ దేశంగా మనుగడ సాగించాలని తొలి ప్రధాని నెహ్రూ మొదలుకొని స్వాతంత్ర్యోద్యమ నాయకులందరూ భావించారు. యూసీసీ గురించి రాజ్యాంగ నిర్ణాయక సభలో లోతైన చర్చే జరిగింది. రాజ్యాంగసభ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సైతం యూసీసీ ఉండితీరాలని కోరుకున్నారు. సభ్యుల్లో కొందరు వ్యతిరేకిస్తే... అనుకూలంగా మాట్లాడినవారిలో సైతం కొందరు ఇది అనువైన సమయం కాదన్నారు. ఎందుకంటే అప్పుడున్న పరిస్థితులు భిన్నమైనవి. దేశ విభజన సమయంలో ఇరుపక్కలా మతోన్మాదులు చెలరేగిపోయారు. నెత్తురుటేర్లు పారించారు. పరస్పర అవిశ్వాసం, అపనమ్మకం ప్రబలటంతో ఇళ్లూ, వాకిళ్లూ, ఆస్తులూ అన్నీ వదిలి లక్షల కుటుంబాలు ఇటునుంచి అటు... అటునుంచి ఇటూ వలసబాట పట్టారు. అదే సమయంలో పాకిస్తాన్ ఆవిర్భావానికి కారకుడైన మహమ్మద్ అలీ జిన్నా మరింత రెచ్చగొట్టే ప్రకటన చేశారు. భారత్‌లో ముస్లింలకు మనుగడ ఉండబోదని, వారిని అన్ని విధాలా అణిచేస్తారని దాని సారాంశం. అలాంటి సమయంలో యూసీసీని తీసుకొస్తే అనవసర అపోహలు బయల్దేరి పరిస్థితి మరింత జటిలమవుతుందని అందరూ అనుకున్నారు. అందువల్లే హక్కుల్లో భాగం కావాల్సిన యూసీసీ కాస్తా 44వ అధికరణ కింద ఆదేశిక సూత్రాల్లో చేరింది. ఆ సూత్రాలన్నీ ప్రభుత్వాలు నెరవేర్చాల్సిన అంశాలు. అయినా ఇతర అధికరణాల అమలు కోసం వెళ్లినట్టుగా కోర్టుకు పోయి వాటి అమలుకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరటం సాధ్యం కాదు. అందువల్లే సుప్రీంకోర్టు వివిధ తీర్పుల్లో యూసీసీని తీసుకురావలసిన అవసరాన్ని పాలకులకు గుర్తుచేసి ఊరుకుంది. చిత్రమేమంటే పరస్పర పూరకాలు కావలసిన హక్కులూ, ఆదేశిక సూత్రాలూ కొన్ని సందర్భాల్లో విభేదించుకుంటాయి. ఉదాహరణకు 25 నుంచి 28వ అధికరణ వరకూ పౌరులకుండే మత స్వేచ్ఛ గురించి మాట్లాడతాయి. ఆదేశిక సూత్రాల్లో ఒకటైన యూసీసీపై చట్టం తెస్తే సహజంగానే అది మత స్వేచ్ఛను హరించినట్టవుతుంది. కనుక ఈ రెండింటి మధ్యా సమన్వయం సాధించాలి. గతంలో చాలా సందర్భాల్లో ఇలా చేయకతప్పలేదు. 'రాజ్యాంగ మౌలిక స్వరూపం' ప్రభావితం కాని రీతిలో ఆ పని చేయాలి.

ఆ సంగతలా ఉంచి యూసీసీ తీసుకురాదల్చుకుంటే ఇస్లామ్‌ను అనుసరించేవారికి మాత్రమే కాదు... హిందూ, క్రైస్తవ, పార్సీ మతస్థులపైనా ప్రభావం పడుతుంది. కొంత హెచ్చుతగ్గులు ఉండొచ్చుగానీ దాదాపు అన్ని మతాలూ స్త్రీల విషయంలో వివక్షాపూరితంగానే ఉన్నాయి. ముఖ్యంగా వ్యక్తిగత (పర్సనల్) చట్టాలకొచ్చేసరికి ఇది బాహాటంగా కనబడుతుంది. వీటి మూలాలు వందలు, వేల ఏళ్ల నుంచి పరంపరగా వస్తూవున్న సంప్రదాయాల్లో ఉండటం, మారుతున్న కాలానికి అనుగుణంగా సవరించుకోవటానికి సిద్ధపడకపోవటం సమస్య. వివాహం, విడాకులు, పునర్వివాహం, వారసత్వం, ఆస్తి హక్కు, బహుభార్యాత్వం వంటి అంశాల్లో స్త్రీలకు వివక్ష ఎదురవుతోంది. అయితే రాజ్యాంగం హామీ ఇచ్చిన లింగసమానత్వం లేని పక్షంలో అలాంటి చట్టాలను సుప్రీంకోర్టు కొట్టివేసిన సందర్భాలున్నాయి. పార్సీల్లో అన్య మతస్థుణ్ణి పెళ్లాడిన మహిళలకు వారసత్వ ఆస్తిలో భాగం ఇవ్వరు. పార్సీ పురుషుడికి అది వర్తించదు. అన్ని అంశాలనూ సవివరంగా చర్చించేందుకూ... అన్ని మతాచారాల వివక్షను తొలగించటానికీ సిద్ధపడుతున్నారన్న అభిప్రాయం కలిగిస్తే యూసీసీ రూపకల్పన సమస్యేమీ కాదు. దానికి ముందు మైనారిటీల విశ్వాసం పొందాలి.

కోల్‌కతాలో ఇటీవల మహిళా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య నేపథ్యంలో మహిళల భద్రత అంశాన్ని మోదీ ప్రస్తావించారు. ఇక భారత్‌లో అవినీతి పెచ్చుమీరిందని గణాంకాలు వెల్లడిస్తున్న నేపథ్యంలో కఠినంగా ఉంటామన్న సంకేతాలిచ్చారు. కానీ అలాంటి ఆరోపణలున్న నేతలు బీజేపీలోనో, దాని మిత్రపక్షంగానో ఉన్నప్పుడూ... వారిపై కేసుల దర్యాప్తు మందగిస్తున్నప్పుడూ దీన్ని జనం ఎంతవరకూ విశ్వసించగలరన్నది ఆలోచించుకోవాలి. మొత్తానికి యూసీసీ అంశాన్ని ప్రధాని మరోసారి తెరపైకి తెచ్చారు. ఈ విషయంలో దేశవ్యాప్తంగా ఎటువంటి స్పందన వస్తుందో, ఎన్డీయే కూటమిలోని ఇతర పక్షాల వైఖరి ఏ విధంగా ఉంటుందో ముందు తెలుస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు. ఏకాదశి ఉ. 5.50 వరకు, తదుపరి ద్వాదశి తె.5.20 వరకు (తెల్లవారితే శనివారం), **నక్షత్రం:** మూల ఉ.10.21 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.8.45 నుండి 10.21 వరకు, తదుపరి రా.7.57 నుండి 9.29 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.06 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.19 వరకు, **అమృతఘడియలు:** తె.5.34 నుండి 7.10 వరకు వరలక్ష్మీ వ్రతం.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

అనుకోని అతిథికి అభ్యంతరాలు

విశ్లేషణ



హర్ష కక్కడ్

బంగ్లాదేశ్ అంతర్గత పరిణామాల ఫలితంగా ప్రధాని పదవికి రాజీనామా చేసి షేక్ హసీనా ఆశ్రయం కోరుతూ భారత్‌కు వచ్చారు. అయితే భారత్ ఆమెకు శాశ్వత ఆశ్రయాన్ని ఇవ్వడానికి సిద్ధంగా లేకపోయినా... అత్యవసరంగా ఆమెను అక్కున చేర్చుకొంది. ఆ విధంగా ఆమె ప్రాణాలను కాపాడగలిగింది. ఇటీవలి కాలంలో భారత విధానంలో చోటు చేసుకున్న మార్పులు, బంగ్లాదేశ్‌తో భవిష్యత్తులో ఎదురవ్వగల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని భారత్ శాశ్వత ఆశ్రయాన్ని నిరాకరిస్తోంది. ఇదే సమయంలో హసీనా బ్రిటన్‌లో ఆశ్రయం పొందాలని ఆశిస్తున్నా అక్కడ ఆమెకు ద్వారాలు మూసుకొన్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్ ఆమె కోసం తగిన నివాసప్రాంతాన్ని వెదకడంలో తన దౌత్య పరపతిని ఉపయోగించే అవకాశం ఉంది.

బంగ్లాదేశ్ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. పాకిస్తాన్ కబంధ హస్తాల నుండి స్వాతంత్ర్యం కోసం పోరాటానికి నాయకత్వం వహించిన, ఆ దేశ ప్రజాస్వామ్య దశ ప్రక్రియలో ఎక్కువ భాగం నాయకత్వం వహించిన కుటుంబం ఇకపై దేశ భవిష్యత్తులో ఎటువంటి పాత్రనూ కలిగి ఉండదు. పెరుగుతున్న హింసాకాండ మధ్య షేక్ హసీనా ఢాకా నుండి నిష్క్రమించడం అనేది బంగ్లాదేశ్‌లో ఆమె కుటుంబ ఉనికి ముగింపును సూచిస్తుంది. ముజిబుర్ రెహ్మాన్ విగ్రహంపై మూత్ర విసర్జన చేస్తున్న నిరసనకారుడి చిత్రాలూ, మాజీ ప్రధాని లోదుస్తులను ప్రదర్శిస్తున్న ఇతరుల చిత్రాలూ ఆ కుటుంబం పట్ల ప్రజల్లో పెరిగిన ద్వేషాన్ని తెలియజేస్తున్నాయి.

హింసాత్మక మార్గాల ద్వారా ప్రజల నిరసనలను అరికట్టేందుకు బంగ్లా సైన్యం నిరాకరించడంతో, షేక్ హసీనా ఆశ్రయం కోరుతూ భారత్‌కు వచ్చారు. ఆమె భారత్‌లో ఆశ్రయం పొందడం ఇదే మొదటిసారి కాదు. 1975లో ఆమె తండ్రి ముజిబుర్ రెహ్మాన్ హత్యకు గురైనప్పుడు హసీనా, ఆమె కుటుంబం భారతదేశంలో నివసించారు. ఆరేళ్లపాటు న్యూఢిల్లీలో ఉన్న హసీనా, ఆ ఉపకారాన్ని మరచిపోలేదు. ఆమె అప్పుడు ప్రధాని కుమార్తె. తన తండ్రి ఢాకాలో ఘోర హత్యకు గురైనప్పుడు ఆమె జర్మనీలో ఉన్నారు. అందువల్లే ఆమె ప్రాణం నిలబడింది.

ఈసారి మాత్రం ఆమె పదవి నుంచి వైదొలిగిన ప్రధానమంత్రిగా ఉన్నారు. భారత్ తనను నిరాశపరచదన్న ఆమె విశ్వాసం చెల్లుబాటైంది. ఆమెకు జాతీయ భద్రతా సలహాదారు స్వాగతం పలికారు, అనంతరం విదేశాంగ మంత్రి ఆమెను కలిశారు. ఆమె ప్రస్తుతం న్యూఢిల్లీలోని సురక్షిత గృహంలో ఉన్నారు, ఆమె ఎక్కడికి వెళ్లాలో నిర్ణయించుకుంటారు. ఆమె ఇకపై దౌత్యపరమైన పాస్‌పోర్ట్‌ను కలిగి ఉండరు కాబట్టి ఆమె ఆశ్రయం పొందాలనుకునే దేశం నుండి వీసా అవసరం. ఆమె భవిష్యత్ గమనంలో భారత్ తనదైన పాత్ర పోషిస్తుంది.

ఆమె భారతదేశానికి చేరుకున్న సందర్భంలో, డాక్టర్ జైశంకర్ మాట్లాడుతూ, 'చాలా తక్కువ సమయంలో, భారతదేశానికి రావడానికి ఆమె అనుమతిని కోరారు' అని పేర్కొన్నారు. తన భవిష్యత్తును నిర్ణయించుకోవడానికి ప్రభుత్వం ఆమెకు సమయం ఇస్తుందని ఆయన అన్నారు. ఆమె షాక్‌లో ఉన్నారనీ, కోలుకోవడానికి తగినంత సమయం కావాలనీ భారత ప్రభుత్వం పేర్కొంది. ఆమె భారతదేశంలో ఉన్న సమయంలో సంబంధిత ప్రోటోకాల్, రక్షణతో పాటు ఆమెను ప్రభుత్వ అతిథిగా భావించి వ్యవహరించడం కొనసాగుతుంది. ఆమెకు ఇద్దరు బిడ్డలు. కుమారుడు సజీబ్ అహ్మద్ వాజెద్ అమెరికాలో ఉంటూండగా, కుమార్తె సైమా వాజెద్ ఢిల్లీలో ఉన్నారు. ఢిల్లీలోని ప్రపంచ ఆరోగ్య సంస్థకు సౌత్ ఈస్ట్ ఏషియన్ రీజినల్ డైరెక్టర్‌గా సైమా వాజెద్ వ్యవహరిస్తున్నారు. అయితే హసీనా అమెరికాకు వెళ్లడం కుదరదని, ఆమె వీసాను అమెరికా రద్దు చేసిందని వార్తలు వచ్చాయి. బ్రిటన్‌లో నివసించడం హసీనాకు ఇష్టమైన మొదటి ఎంపిక. ఆమెతోపాటు ఢాకా నుండి పారిపోయి వచ్చిన ఆమె సోదరి షేక్ రెహానా బ్రిటిష్ పౌరురాలు. కాబట్టి అక్కడికి హసీనా వెళ్లడం అర్థవంతంగానే ఉంటుంది. షేక్ రెహానా కుమార్తె తులిప్ సిద్ధిక్ పార్లమెంటులో లేబర్ పార్టీ సభ్యురాలు. పైగా ట్రెజరీ, నగరాభివృద్ధి మంత్రికి ఆమె ఆర్థిక కార్యదర్శి కూడా!



తమ ఇమ్మిగ్రేషన్ చట్టం ప్రకారం బ్రిటన్ వెలుపల ఉన్న వారికి ఆశ్రయం లేదా తాత్కాలిక ఆశ్రయం పొందేందుకు ఎటువంటి నిబంధనా లేదని బ్రిటన్ అధికారులు సూచిస్తున్నట్లు మీడియా నివేదికలు పేర్కొన్నాయి. 'అంతర్జాతీయ రక్షణ అవసరమయ్యే వారు తాము చేరుకునే మొదటి సురక్షిత దేశంలో (ఈ సందర్భంలో భారత్) ఆశ్రయం పొందాలి – అదే భద్రతకు వేగవంతమైన మార్గం' అని కూడా వారు పేర్కొన్నారు. 'బంగ్లాదేశ్‌లో గత కొన్ని వారాల సంఘటనలపై ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో దర్యాప్తు' కోసం డిమాండ్ చేయడం ద్వారా బ్రిటిష్ విదేశాంగ కార్యదర్శి బంగ్లాదేశ్ సంక్షోభానికి ఆజ్యం పోశారు. షేక్ హసీనాను పదవీచ్యుతురాలిని చేయడాన్ని సమర్థిస్తున్నట్లు ఈ ప్రకటన సూచిస్తుంది.

ఆమెకూ, భారత ప్రభుత్వానికీ మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ, ఆమెకు భారత్ ఆశ్రయమివ్వడం సరి కాదు. ఆమెకున్న భద్రతాపరమైన ఆందోళనలు ఆమె కదలికలను తీవ్రంగా పరిమితం చేస్తాయి. పైగా ఎన్నికల అనంతరం, అధికారంలో ఉన్న చివరి రోజులలో ఆమె తీసుకున్న నిర్ణయాలపై అభియోగాలను ఎదుర్కొనేందుకు ఆమెను రప్పించాలనే డిమాండ్లు పెద్ద సంఖ్యలో వస్తున్నాయి. కొన్ని ఆరోపణలు కల్పితం కావచ్చు. కానీ దేశంలో సాగుతున్న రాజకీయ క్రీడలో ఆమె పావుగా మారతారు.

జనరల్ ముషారఫ్‌ను విచారించకుండా పాక్ సైన్యం అక్కడి ప్రభుత్వాన్ని నిరోధించింది. తద్వారా ఆయన దుబాయ్‌లో జీవించగలిగారు. ఇది బంగ్లాదేశ్‌లోనూ పునరావృతం కావచ్చు. భవిష్యత్తులో బంగ్లాలో సైనిక నాయ కత్వం ఎలా రూపొందుతుంది అనే దానిపై ఇది ఆధారపడి ఉంటుంది. హసీనా భారతదేశంలోనే కొనసాగడం సరికాదని, బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న మహ్మద్ యూనస్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్ సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇప్పటికే షేక్ హసీనాను, ఆమె సోదరిని అరెస్టు చేయాలని, అభియోగాలను ఎదుర్కొనేందుకు వారు దేశానికి తిరిగి రావాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆమె భారత్‌లోనే ఉండిపోయినట్లయితే, ఆమెను అప్పగించేందుకు న్యూఢిల్లీ అనుమతి నిరాకరిస్తుంది. ఇది ఇండో–బంగ్లా సంబంధాలను దెబ్బ తీస్తుంది. భారత్, బంగ్లాదేశ్ 2016 జూలైలో 'రెండు దేశాల మధ్య పారిపోయిన నేరస్థులను త్వరితగతిన అప్పగించడం' లక్ష్యంగా ఒక అప్పగింత ఒప్పందంపై సంతకం చేశాయి. ఒప్పందానికి కట్టుబడి ఉండేందుకు నిరాకరిస్తే భారత్ ఒకే పక్షంవైపు మొగ్గు చూపుతోందనే మాట వస్తుంది.

ఆమె తిరిగి రావాలనే డిమాండ్‌ను తిరస్కరించడం వల్ల బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక భావాలు కూడా ఏర్పడవచ్చు, ఇది భారతదేశం కోరుకోదు. హసీనాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న జమాతే ఇస్లామీ ఈ నిరసనలకు నాయకత్వం వహించి ఇరు దేశాల సంబంధాల సాధారణీకరణపై ప్రభావం చూపుతుంది.

1962 యుద్ధం జరిగి, దలైలామాను తమకు అప్పగించాలని చైనా క్రమం తప్పకుండా డిమాండ్ చేసినప్పటికీ, న్యూఢిల్లీ దశాబ్దాలుగా ఆయనకు దేశంలో ఆతిథ్యం ఇచ్చింది. 1992 నుండి దివంగత ఆఫ్ఘన్ అధ్యక్షుడు మొహమ్మద్ నజీబుల్లా కుటుంబానికి భారత్ ఆతిథ్యం ఇస్తోంది. కుటుంబానికి సురక్షితమైన ఇల్లు, నెలవారీ స్టైపండ్ అందించడం జరిగింది. అయితే ఇటీవల భారత్ తన విధానాలను మార్చుకోవడం ప్రారంభించింది. 2022 జూలైలో దేశం విడిచి పారిపోయిన శ్రీలంక మాజీ అధ్యక్షుడు గొటబయ రాజపక్సేకు ఆశ్రయం ఇవ్వడానికి న్యూఢిల్లీ నిరాకరించింది. 2021 ఆగస్టులో అమెరికా సైన్యాల ఉపసంహరణ తర్వాత తాలిబాన్ దేశాన్ని స్వాధీనం చేసుకు న్నప్పుడు, ఆఫ్ఘనిస్తాన్‌లోని అష్రఫ్ ఘనీ ప్రభుత్వ సభ్యులకు సురక్షిత మైన స్వర్గధామాలను కల్పించడానికి భారత్ నిరాకరించింది.

ఇవి ఇంకా ప్రారంభ రోజులే. బంగ్లాదేశ్ స్థిరపడటానికి, అక్కడి తాత్కాలిక ప్రభుత్వం హసీనాను తమకు అప్పగించాలని డిమాండ్ చేయడానికి కాస్త సమయం పడుతుంది. షేక్ హసీనాకు ఆశ్రయం కల్పించే అవకాశాల గురించి ఆలోచిస్తున్నట్లు భారత ప్రభుత్వం అధికారికంగా చెప్పకపోయినప్పటికీ, ఆమె కోసం తగిన నివాసప్రాంతాన్ని వెదకడంలో మాత్రం అది తన దౌత్య పరపతిని ఉపయోగించుకుంటుంది. ఈ పని ఎంత వేగంగా చేస్తే అంత మంచిది.

వ్యాసకర్త భారత సైన్యంలో విశ్రాంత మేజర్ జనరల్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అందమైన దేశం



బ్రిటిష్‌వాళ్లు మన మూడున్నర కోట్లమందిని చంపేశారు. పన్నెండు దుర్భరమైన క్షామాలను కృత్రిమంగా సృష్టించారు. 45 ట్రిలియన్ డాలర్లను దోచుకున్నారు. ఇండియాను నల్లమందు ఆర్థిక వ్యవస్థకు కుదించారు. రెండు దేశాలుగా దివాళా తీయించారు. 32 ఏళ్ల ఆయుర్దాయంతో వదిలేశారు. అయినా మనం బతికి బట్టకట్టాం. భారతీయులు అందమైనవాళ్లు కాబట్టి భారత్ అందమైనది. అందరికీ హృదయ పూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.

– ఆనంద్ రంగనాథన్, రచయిత

జాగ్రత్త



ఎక్కువగా నిరసిస్తూ, తక్కువగా పరిష్కారాలు చూపేవారి పట్ల జాగ్రత్తగా ఉండండి. జై హింద్!

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

వర్ణించాల్సిన పదాలు



నా భారత సోదర సోదరీమణులకు హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు! శాంతి, ప్రేమ, ఐక్యత, ఆరోగ్యం, న్యాయం, విద్య, స్వేచ్ఛ, సృజన, సంపద పదాలు త్వరలోనే మనల్నీ, మన దేశాన్నీ వర్ణించడానికి ఉపయోగిస్తారని ఆశిద్దాం.

– జావేద్ అఖ్తర్, కవి

ఇప్పటికీనా?



భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయింది. అయినా నేను ఇప్పటికీ బెంగళూరులో అర్ధరాత్రి పన్నెండింటికి బయటికి పోవాలంటే భయపడతాను.

– మనస్వీ శర్మ, వ్యాఖ్యాత

ఎత్తున నిలబడింది!



జనానికి స్వేచ్ఛ, జీవితం, వైవిధ్యం ప్రసాదించే విషయంలో, తన పొరుగు దేశాలైన అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, చైనా, మయన్మార్, నేపాల్ కన్నా ఇండియా ఎంతో ఎత్తున నిలబడింది. ప్రపంచ స్థాయిలో మాత్రం అదింకా చాలాదూరం ప్రయాణించాల్సే ఉంది.

– ఖాలిద్ బేగ్, యూట్యూబర్

ఇక్కడ కూడానా?



స్పెయిన్‌లోని ఒక బీచ్‌లో కొంతమంది భారత మగవాళ్లు నన్ను 'దేశీ మాల్' (దేశీ సరుకు) అన్నారు. భారత మగవాళ్లు ఆఖరికి స్పెయిన్‌లో కూడా మనల్ని అసౌకర్యానికి గురిచేయగలిగినప్పుడు, ఇంక ఇండియాలోని మహిళల పరిస్థితి ఏమిటో ఊహించండి!

– జాహ్నవీ జైన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్

సగంలో వదిలేశారు



'సగంలో వదిలేయొద్దు. శత్రువును పూర్తిగా నిర్వీర్యం చేయాలి' కౌటిల్యుడు, సన్ ట్జు ఇద్దరూ దీన్నే నొక్కి చెప్పారు. మావో జెడాంగ్, ఆయన అనుచరులు ఈ సూత్రాన్ని కచ్చితంగా పాటించారు. కానీ దేశ భద్రత విషయంలో స్వాతంత్ర్య కాలం నుంచి ప్రతి భారతీయ ప్రధాని కూడా శత్రువును పూర్తిగా నిర్వీర్యం చేయకుండా సగంలో వదిలేసినవారే! ఏమిటి వాళ్లను మానసికంగా అడ్డుకున్నది?

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

ఇన్ బాక్స్

వైద్యుల దుఃస్థితికి ప్రతీక!

కోల్‌కతా నగరంలో ఆర్‌జీ కార్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిలో విధుల్లో ఉన్న మహిళా వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్య చేసిన దారుణ సంఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి, తీవ్ర ఆందోళనకు గురి చేసింది. దేశంలో ఎలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో, రక్షణ కొరవడిన స్థితిలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ముఖ్యంగా మహిళలు విధుల్ని నిర్వహించాల్సి వస్తోందో ఇంకోసారి తేటతెల్లం చేసిన ఘటన ఇది. ఆ పీజీ వైద్య విద్యార్థి 36 గంటలుగా విధుల్లో ఉన్నారు. అర్ధరాత్రి దాటాక కాసేపు సెమినార్ రూమ్‌లో విశ్రమించిన సమయంలో దారుణానికి బలయ్యారు. అక్కడ సీసీ కెమెరాలు పని చెయ్యడం లేదట. ఆగంతకులు రాకుండా సరిపడా భద్రత, సరియైన వెలుతురు లేని క్యాంపస్... ఇవన్నీ ఆ కిరాతక చర్యకు దోహద పడ్డాయి.

ఇది వ్యవ స్థాగత లోపం. మహిళా ఉద్యోగులకు పూర్తి స్థాయి భద్రత కల్పించలేని నిర్వాకం. ముఖ్యంగా వైద్య రంగంలో పనిచేస్తున్న వారు ఆరోగ్య సేవలు అందించడంలో తీవ్రంగా శ్రమ పడుతున్నారు. అయినా రోగి బంధువుల నుండి భౌతిక దాడులకు గురవ్వడం లాంటి సంఘటనలు పెరుగుతూ వస్తున్నాయి. వాటిని అరికట్టే కఠిన చట్టాలు, చట్ట ప్రకారం సత్వరం శిక్ష పడేలా ఏర్పాట్లు వ్యవస్థలో అవసరం. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవాలి. ప్రాణాలు నిలిపే డాక్టరు, తానే ప్రాణభయంతో చికిత్స అందించాల్సి వస్తే అది రోగికి మాత్రమే కాదు ప్రజారోగ్య వ్యవస్థకే ప్రమాదం. ఇక హత్యోదంతం విషయంలో ఆ వైద్య కళాశాల పెద్దలే కాకుండా, ప్రభుత్వం కూడా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించింది.

హత్యాచారం జరిగిన పిమ్మట ఆ కళాశాల ప్రిన్సిపాల్ రిపోర్ట్ ఇవ్వడానికి కూడా ఆలస్యం చేస్తే, ఆయనపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ప్రభుత్వం ఆయనకు వేరే చోట బాధ్యతలు అప్పగించడం ద్వారా గౌరవించింది. సమయానికి హైకోర్టు స్పందించి ఆయన్ని సెలవుపై పంపమని ఆదేశించడం ద్వారా, కేసుని సీబీఐకి అప్పగించడం ద్వారా కొంత న్యాయం చేసింది. ఇలాంటి హీన నేరం జరిగిన తర్వాత కూడా అక్కడి ప్రభుత్వం కోర్టు చెబితే గానీ సరైన విధంగా స్పందించక పోవడం దారుణం. ఈ హత్యోదంతం నుండి పాఠాలు నేర్చుకుని ప్రభుత్వాలు వైద్యుల, ఆరోగ్య సిబ్బంది... రక్షణకు, భద్రతకు పూర్తి బాధ్యత వహించాలి. వారు పనిచేసే స్థలం పూర్తి సేఫ్ జోన్‌గా ఉండాలి.

– డా॥ డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

పాత, కొత్తల గందరగోళం

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

భారతదేశంలో నేరాల దర్యాప్తులో సుదీర్ఘమైన ఆలస్యం ఒక మహమ్మారిలా పరిణమించింది. ఇందువల్ల నిందితులైన అనేకమంది అమాయకులు అనవసరంగా జైళ్లలో విచారణ ఖైదీలుగా మగ్గవలసి వస్తోంది. కొందరైతే పది పదిహేనేళ్ల జైల్లో ఉండి చివరకు నిర్దోషిగా విడుదలయినవారూ ఉన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలు ఇలాంటి అమాయకుల సంఖ్య పెరగడానికి దోహదపడతాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఎందుకంటే ఈ చట్టాలు పోలీసులకు అరెస్ట్ చేసి నిర్బంధించేందుకు అపరిమిత అధికారాలను కట్టబెడుతున్నాయి.

నేర విచారణ అత్యంత ఆలస్యంగా జరగడం వల్ల కొందరు డబ్బున్న పెద్దవాళ్లు బెయిలుపై బయటికి వచ్చి ఎన్నికల్లో పోటీచేసి గెలుస్తున్నారు. అదేసమయంలో అమాయకులు ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. ఆ విధంగా కొత్త చట్టాలు ఉన్నవారికి చుట్టాలు కాబోతున్నాయి. చట్టాలలో మార్పులు తెస్తే మంచిదే. ఈనాటి అవసరాలకు అనుగుణంగా వాటిని సవరించాలనే లక్ష్యం ఉంటే సంతోషం. చట్టాల మరింత ఆధునికీకరణ, సరళీకరణ నేటి సమాజానికి అవసరం. కానీ కొత్త నేరాల చట్టాల వల్ల మేలు కంటే కీడే ఎక్కువ జరిగేలా ఉంది. ఈ చట్టాల ద్వారా జరిమానాలను చాలా పెంచారు. ఇది సరికాదు. పోనీ కనీసం కొత్త చట్టాల అమలు ద్వారా అయినా సత్వర తీర్పులు వచ్చే అవకాశం కలిగితే కొంత సంతోషం కలిగేది. కానీ కనుచూపు మేర అది సాధ్యమయ్యేలా కనిపించడంలేదు. ఎందుకంటే కొత్తగా నమోదయ్యే కేసులను కొత్త చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుంది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న లక్షలాది కేసులను పాత క్రిమినల్ చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుంది. ఒకే సమయంలో పాత, కొత్త చట్టాల కింద విచారించడానికి తగిన సిబ్బంది, వసతులూ భారతీయ న్యాయ వ్యవస్థకు లేకపోవడం ఇక్కడ గమనార్హం.

ఇవీ మన కొత్త చట్టాలు-4



కొత్త మూడు చట్టాల్లో రెండింటిలో కొంచెం మార్పులు చేసినట్లు కనిపించినా మూడోదైన సాక్ష్య చట్టం మక్కీకి మక్కీ పాతదే. ఇండియన్ శిక్షాస్మృతి అనే 1860 నాటి పరమ పాత (లేదా సనాతన) చట్టం... 'భారతీయ న్యాయ సంహిత–2023' పేరుతో మళ్లీ తీసుకురావడం విడ్డూరం. ఏం సాధించడానికి ఎన్డీఏ ప్రభుత్వం ఈ చట్టాలను కొత్తగా తీసుకువచ్చిందో అర్థం కావడం లేదు. పార్లమెంట్‌లో స్వయంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగిన స్థితిలో లేని బీజేపీపై... భాగస్వామ్య పక్షాల్లో బలమైన టీడీపీ, జేడీయూ వంటివైనా ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేయకపోవడం విచారకరం. ఇందువల్ల ఈ కొత్త చట్టాలు నిరాఘాటంగా కొనసాగేందుకు అడ్డంకీ లేకుండా పోయింది.

ఇప్పటికే పౌర హక్కుల కోసం ఉద్యమిస్తున్న కార్యకర్తలను దారుణ నిర్బంధానికి గురి చేస్తున్నారు. రాజకీయ కక్ష సాధింపులకు పాత నేరచట్టాలను ఉపయోగించే ఎన్నో దారుణాలకు పాల్పడింది బీజేపీ సర్కార్. ఇప్పుడు కొత్త చట్టాలను ఉపయోగించి మరెంత అన్యాయంగా వ్యవహరిస్తుందో అనే భయం ఎల్లెడలా కనిపిస్తోంది. వీటిని అడ్డుపెట్టుకొని రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూల్చడానికి మరింతగా ప్రయత్నించవచ్చు. ఇప్పటికే అనేక కేసులు బనాయించిన ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులు తమ పార్టీలో చేరిన తరువాత వారిపై కేసులు ఎత్తివేయడమో, లేక విచారణను వాయిదా వేసేలా చూడడమో బీజేపీ చేస్తూనే ఉంది. ఈ పరిస్థితుల్లో అమలులోకి వచ్చిన కొత్త చట్టాలు కేంద్ర పాలకులకు ఇంకెంత మేలు చేకూర్చనున్నాయో! అంతిమంగా సాధారణ పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారనేది సుస్పష్టం.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

పరహితమే పరమ ధర్మం!

సొంత లాభం కొంత మానుకుని పొరుగు వారికి తోడు పడవోయ్' అన్నారు మహాకవి. 'పరోపకారార్థ మిదం శరీరం' అని సంస్కృత సుభాషితం. పరహితమే పరమ ధర్మం. ఇతరులకు హితం చేస్తే శ్రీహరి సంతోషిస్తాడు. హరి మనస్సు ఆనందిస్తే లోకాలన్నీ ఆనందిస్తాయి అని భాగవతం చెబుతుంది. ముల్లోకాలను దహింపబోతున్న హాలాహల జ్వాలలను లోక కల్యాణం కోసం, జీవరాశుల రక్షణ కోసం పరమ శివుడు స్వీకరించి గరళ కంఠుడయ్యాడు. 'పెట్టి పొయ్యలేని వట్టి నరులు భూమి పుట్టనేమి? వారు గిట్టనేమి?' అన్నాడు వేమన. ఇతరులకు సాయం చెయ్యని, పెట్టుపోతల గురించి, దాన ధర్మాల గురించి ఆలోచించని మనుషుల వల్ల సమాజానికి ఎటువంటి ప్రయోజనమూ లేదని దీని అర్థం.



నిజానికి పూజలన్నింటి సారాంశం ఒకటే. నిర్మలమైన మనసుతో ఉండటం, ఇతరులకు మంచి చెయ్యటం. ఎవరైతే పేదవారిలో, బలహీనులలో, అవసరార్థులలో దైవాన్ని చూడగలుగుతారో వారే భగవంతుని పూజించగలరు. ఇతరుల కోసం ఏ మంచి పని చేసినా అది మనలో ఒక కొత్త శక్తిని నింపుతుంది. అంతులేని ఆత్మతృప్తిని ఇస్తుంది. ప్రసిద్ధి పొందిన దాతలు, ప్రజారంజకులైన పాలకులు ఇతరుల మేలు కొరకే జీవించారు.

జీవితం క్షణ భంగురం. సంపాదించిన ధనం, నగలు, ఆస్తిపాస్తులు ఇవేవీ వెంట రావు. జీవితం ఉన్నంత వరకు భౌతిక అవసరాలకు ఉపయోగపడేవి ఇవి. ఎవరైతే పరుల కోసం జీవిస్తారో వారే ప్రజల మనస్సుల్లో శాశ్వతంగా జీవిస్తారు. పరులకు మేలు చేయటానికి ధనమే ఉండనక్కరలేదు. ఏ ఇతర సహాయాలనైనా అవసరంలో ఉన్నవారికి అందించి ఆదుకోవచ్చు. కావలసింది మంచి మనస్సు. ఈ సమాజంలో తగిన సహాయం చేసేవారు లేక అలమటించే వారు ఎందరో ఉన్నారు. సమర్థులైనవారు అటువంటివారికి సహాయం అందించవలసి ఉంది. బహుజన హితంలోనే సమాజ శ్రేయస్సు ఉంది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

అధ్యక్షుడు, నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు..

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కూడా మార్పు... కొత్తవారికి ఇచ్చే యోచనలో అధిష్టానం

- పరిశీలనలో సరితా తిరుపతయ్య, పారిజాతా నర్సింహారెడ్డి, భవానీరెడ్డిల పేర్లు
- కార్పొరేషన్ చైర్మన్ పదవులు వచ్చిన అనుబంధ సంఘాల అధ్యక్షులు సైతం మార్పు?
- అధికార పార్టీలో సంస్థాగత సందడి..

సాక్షి, హైదరాబాద్

నామినేటెడ్ పోస్టుల భర్తీ, మంత్రివర్గ విస్తరణ త్వరలోనే జరుగుతుందన్న వార్తలకు తోడు టీపీసీసీ అధ్యక్షుడి ఎంపిక, అనుబంధ సంఘాల అధ్యక్షుల మార్పు కూడా ఉంటుందన్న చర్చ జరుగుతోంది. అమెరికా పర్యటనను ముగించుకొని వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం రాత్రి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. దీంతో అధికార కాంగ్రెస్‌పార్టీలో సంస్థాగత మార్పులపై చర్చ జోరందుకుంది. ముఖ్యంగా టీపీసీసీ అధ్యక్షుడి నియామకంతోపాటు అనుబంధ సంఘాల విషయంలో అధిష్టానం ఏం నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.

బీసీ లేదా లంబాడానేనా?

టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి స్థానంలో ఎవరిని నియమించాలన్న అంశం చాలా రోజులుగా కొలిక్కి రావడం లేదు. ముఖ్యంగా సామాజిక సమీకరణల లెక్కలు అధ్యక్షుడి విషయంలో కుదరడం లేదు. సీఎంగా అగ్రవర్ణాలకు చెందిన నేత ఉండటంతో బీసీ లేదా ఇతర సామాజికవర్గాలకు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇస్తారనే అభిప్రాయం పార్టీవర్గాల్లో ఉంది. కాంగ్రెస్ అధిష్టానం వద్ద కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకుల పేర్లపై చర్చ జరిగింది. బీసీల నుంచి మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీగౌడ్, ఎస్సీల నుంచి సంపత్‌కుమార్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎస్టీల నుంచి బలరాంనాయక్‌ల పేర్లు బలంగా వినిపించాయి. వీరిలో ఒకరికి అధ్యక్షుడి అవకాశం దక్కుతుందని అనుకోగా, తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గానికే పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తారనే చర్చ ఊపందుకుంది. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తోన్న అగ్రవర్ణాలకే చెందిన ఒక మంత్రిని కూడా నియమిస్తారనే చర్చ కూడా తెరపైకి వచ్చింది. టీపీసీసీ అధ్యక్షు డితోపాటు నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, ప్రచార కమిటీ చైర్మన్ పదవులు కూడా కొత్త వారికి ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీపీసీ సీ అధ్యక్ష వ్యవహారం ఈసారి ఢిల్లీ చర్చల్లో పూర్తవు తుందనే అభిప్రాయం గాంధీభవన్‌వర్గాల్లో వ్యక్తమవుతోంది. పార్టీ పెద్దలను కలిసి వరంగల్‌లో నిర్వహించతలపెట్టిన రైతు రుణమాఫీ సభకు ఆహ్వానిస్తారు. శుక్రవారం ఢిల్లీలో రేవంత్ మంత్రి శ్రీధ ర్‌బాబుతో కలిసి అక్కడే ఫాక్స్‌కాన్, యాపిల్ ప్రతిని ధులతో సమావేశం అవుతారని సమాచారం.



టీపీసీసీ అనుబంధ విభాగాల్లోనూ త్వరలో మార్పులు జరగనున్నాయి. ఇప్పటికే ఎన్ఎస్‌యూఐ, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుల మార్పు ప్రక్రియ మొదలైంది. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా బల్మూరి వెంకట్ స్థానంలో యడవల్లి వెంకటస్వామిని నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇక, శివసేనారెడ్డి స్థానంలో

అనుబంధ సంఘాల్లో మార్పులు

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోంది. వీటికితోడు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిని మారుస్తారని తెలుస్తోంది. మూడేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న ప్రస్తుత అధ్యక్షురాలు సునీతారావు స్థానంలో గద్వాల నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన సరితా తిరుపతయ్యయాదవ్, మహేశ్వరం టికెట్ ఆశించిన పారిజాతానర్సింహారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, రవళిరెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి. సరితా తిరుపతయ్యకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుతూ టీపీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి కూడా మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబాకు లేఖ రాసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే మహిళాకాంగ్రెస్‌కు కూడా కొత్త అధ్యక్షురాలు రానున్నారు. వీరితోపాటు ఇటీవల పలువురు అనుబంధ సంఘాల అధ్యక్షులకు కార్పొరేషన్ల చైర్మన్ పదవులు అప్పగించారు. కార్పొరేషన్ చైర్మన్‌గిరీ వచ్చిన అనుబంధ సంఘాల అధ్యక్షుల స్థానంలో కొత్త వారిని నియమిస్తారని తెలుస్తోంది. త్వరలోనే ఈ మార్పు మొదలవుతుందని సమాచారం. మొత్తం మీద అటు టీపీసీసీ అధ్యక్షుడి ఎంపిక, కొత్త కార్యవర్గం, అనుబంధ సంఘాల్లో మార్పుల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత పదవుల సందడి నెలకొంది,

---

కేటీఆర్ వ్యాఖ్యలపై మహిళా కమిషన్ విచారణ

- కమిషన్ చైర్‌పర్సన్ శారద



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలనుద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ మహిళా కమిషన్ సుమోటో విచారణకు స్వీకరించింది. ఈ మేరకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద గురువారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'మహిళలనుద్దేశించి సిరిసిల్ల ఎమ్మెల్యే కె.టి.రామారావు చేసిన అవమానకర వ్యాఖ్యలు బాధ కలిగించాయి. ఇలాంటి వ్యాఖ్యలు సమంజసం కావు. ఈ వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చట్టంలోని అధికారాల మేరకు సుమోటో విచారణ జరుపుతాం'.. అని తన ట్వీట్‌లో శారద పేర్కొన్నారు

'కేటీఆర్‌పై కేసులు పెట్టాలి'



పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్‌పై కేంద్ర, రాష్ట్ర మహిళా కమిషన్‌లు కేసులు నమోదు చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడాన్ని జీర్ణించుకోలేని కేటీఆర్.. గతంలో ఫేక్ వీడియోలు పెట్టి వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడేమో బ్రేక్‌డ్యాన్సులు చేసుకోవాలని వ్యాఖ్యానించడం దారుణమని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించే మహిళలను అవమానపరిచేలా మాట్లాడడం మానుకోవాలని పొన్నం హితవు పలికారు.

బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే చట్టం చేయాలి: గజ్జెల



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే అమలుభారాన్ని రాష్ట్రాలపై నెట్టకుండా..పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్టం చేయాలని కాంగ్రెస్‌నేత గజ్జెల కాంతం డిమాండ్ చేశారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మందకృష్ణ వాస్తవాలను పక్కనపెట్టి బీజేపీకి అనుకూలంగా మాట్లాడడం సరైంది కాదన్నారు. ప్రధాని మోదీ, అమిత్‌షాల వల్లనే ఎస్సీల వర్గీకరణ జరిగిందని ఆయన చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఎస్సీల వర్గీకరణ కోసం యూపీఏ హయాంలో జరగాల్సిందంతా జరిగిపోయిందని, అటు ఉమ్మడి రాష్ట్రంలో, ఇటు తెలంగాణలో అనేకసార్లు అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సుప్రీంకోర్టులో అడ్వకేట్‌ను పెట్టామని, వర్గీకరణపై సుప్రీం తీర్పు వచ్చిన తర్వాత కూడా అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ హామీ ఇచ్చారని చెప్పారు.

రెండు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

- ఔటర్‌పై ముగ్గురు..
- ఉండవల్లి వద్ద ఇద్దరు కూలీలు



ప్రమాదానికి గురైన తుఫాన్ వాహనం

శంషాబాద్/ఆత్మకూర్: రంగారెడ్డి, గద్వాల జిల్లాల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ సమేతంగా దైవదర్శనం చేసుకొని తిరుగు ప్రయాణమైన వారిని కారు రూపంలో మృత్యువు వెంటాడింది. హైదరాబాద్‌లోని చిన్నగోల్కొండ ఫ్లైఓవర్‌పై గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌సహా ముగ్గురు దుర్మరణం చెందారు. స్థానికుల వివరాల మేరకు.. వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రానికి చెందిన తెలుగు రాజేష్ కుటుంబసభ్యులు ప్రతి ఏడాది శ్రావణమాసం రెండవ గురువారం యాదాద్రి దర్శనానికి వెళతారు. ఈ ఏడాది కూడా యాదాద్రి దర్శనానికి బుధవారం రాజేష్ కుటుంబసభ్యులతో పాటు కర్నూల్‌కు చెందిన అత్తమామలతో కలిపి మొత్తం 19 మంది రెండు వాహనాల్లో బయలుదేరారు. గురువారం ఉదయం 11 గంటలకు దైవదర్శనం చేసుకొని.. మధ్యాహ్నం 3 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రం 4 గంటల సమయంలో ఓ కారు ముందుగా ఓ కారును ఢీకొట్టి..ఆపై పక్కనే ఉన్న తుఫాన్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో పల్టీలు కొట్టింది. తుఫాన్ వాహనంలో మొత్తం 12 మంది ప్రయాణిస్తుండగా.. డ్రైవర్ తాజుద్దీన్ (40)తో పాటు రాజేష్ భార్య సోదరి వరలక్ష్మి (44), ఆమె మనవడు 2 నెలల బాబు అక్కడికక్కడే మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మరో బాలిక సాయిదీక్షిత (13) కోమాలోకి వెళ్లింది. చంద్రశేఖర్, మణెమ్మ, అర్చనలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరి మృతితో ఆత్మకూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

కరీంనగర్ నుంచి వచ్చిన ఆ కారుతోనే..

ప్రమాదానికి కారణమైన కారులో ఆరుగురు ఉన్నారు. విదేశాలకు వెళుతున్న వారికి సెండాఫ్ ఇవ్వడానికి ఆరుగురు ఆ కారులో కరీంనగర్‌కు వచ్చి వస్తున్నారు. వారిలో ముగ్గురు మద్యం సేవించినట్టు పోలీసుల పరీక్షలో తేలింది. కారులో ఉన్న వారిలో నలుగురికి స్వల్పగాయాలు అయ్యాయి. వీరంతా ప్రస్తుతం పోలీసుల అదుపులోనే ఉన్నారు. శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ కారులో ఉన్న వారిని విచారిస్తున్నట్టు తెలిపారు.

కళ్ల ముందే..



మా జీపును కారు ఒక్కసారిగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. లోపల అందరం చిందరవందర అయ్యాం. కొందరు బయటపడ్డారు. నా కూతురు దీక్షిత తలకు పెద్దదెబ్బ తగిలింది. ఆరు నెలల క్రితమే నా భర్త చనిపోయాడు. ఇప్పుడు బిడ్డ పరిస్థితి ఏమవుతోందో.

– నవనీత

ఒక్కసారి భయమేసింది



ప్రమాదంతో జీపులోపల అందరం ఒకరినొకరం గుద్దుకున్నాం. నాకు తలకు దెబ్బ తగిలింది. చిన్నోడు చనిపోయాడు. మా చెల్లికి దీక్షిత తలకు గాయమైంది. దీంతో నాకు ఒక్కసారిగా భయమేసింది.

– సాయిహర్షిత



సుజాత



లక్ష్మీదేవి



ప్రమాదంలో గాయపడిన వారిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

కూలీలను కబళించిన మృత్యుశకటం

అలంపూర్/ఉండవెల్లి: పొట్టకూటి కోసం పనులకు వస్తున్న ఓ ఆటోను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా.. 17 మంది గాయపడ్డారు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. ఏపీలోని కర్నూలు జిల్లా తాండ్రపాడుకు చెందిన 20 మంది కూలీలు వ్యవసాయ పనుల నిమిత్తం ఉండవెల్లి మండలం కంచుపాడుకు ఆటోలో బయలుదేరారు. ఉండవెల్లి స్టేజీ సమీపంలో 20 టైర్లు గల భారీ లారీ ఢీకొట్టడంతో ఆటోలో ఉన్నవారు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డారు. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవి (58) అక్కడికక్కడే మృతిచెందగా.. మరో కూలీ రమాదేవి అలియాస్ సుజాత (40) కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆటో డ్రైవర్ నర్సింహతో పాటు మరో 16 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

బీఆర్ఎస్‌కు ఉప ఎన్నికల పిచ్చి పట్టింది

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నప్పుడు ఫాంహౌజ్ నుంచి కేసీఆర్ బయటకు రాలేదని, అందుకే ప్రజలు బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించి ఇంట్లో కూర్చోబెట్టిన ప్రజలు, పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీని సున్నాకు పరిమితం చేశారని, దీంతో ఇప్పుడు ఉప ఎన్నికలు గుర్తొస్తున్నాయని ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గత పదేళ్లుగా కేసీఆర్ ఏనాడూ ప్రజల మధ్య లేడని, 8 నెలలుగా తమ ప్రభుత్వం ప్రజలతోనే ఉందని అన్నారు. ఈ రోజుతో రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తయిందని, ఎవరైనా కొందరు రైతులు మిగిలితే వారందరికీ కూడా రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇస్తోందన్నారు. అధికారం లేకపోయేసరికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు పిచ్చిలేస్తోందని, అందుకే వారికి ఉప ఎన్నిక పిచ్చి పట్టినట్లుందని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో కేసీఆర్ సొంత ఇలాకాలోనే బీఆర్ఎస్ ఓడిపోయిందని, మెదక్‌లో ఆ పార్టీ మూడోస్థానం అన్న విషయం కేటీఆర్ మర్చిపోయారా అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులకు బాటలు వేసిందే కేసీఆర్ అని విమర్శించారు. కేసీఆర్ అధికారంలో ఉంటే ప్రగతి భవన్, ఫాంహౌస్.. ప్రతిపక్షంలో ఉంటే ఉప ఎన్నికలు అని, ఇదే బీఆర్ఎస్ స్టాండ్ అని అన్నారు.

రేవంత్‌కు తెలంగాణ సోయి లేదు

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ సోయి లేదని, ఆయన వలసవాద పుత్రుడు అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ స్వాభిమానంపై దాడి చేస్తోందన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకే సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలనుకున్న ప్రదేశంలో రాజీవ్ విగ్రహం పెడుతుండటం.. ముమ్మాటికీ తెలంగాణ అస్తిత్వంపై దాడిగానే చూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. పార్టీ నేతలు దేవీప్రసాద్, పల్లె రవికుమార్‌గౌడ్‌తో కలసి గురువారం దేశపతి శ్రీనివాస్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం కావాలో లేక రాజీవ్ విగ్రహం కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. అనేక చర్చల తర్వాతే తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన జరిగిందని దేశపతి శ్రీనివాస్ అన్నారు. రాజీవ్ విగ్రహం ఏర్పాటు అంశంపై కోదండరాం, హరగోపాల్, అందెశ్రీ తమ అభిప్రాయాలను చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పట్ల రేవంత్ తన వ్యతిరేక వైఖరిని అనేక సందర్భాల్లో బయట పెట్టుకుంటున్నారని దేవీప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడిని సహించేది లేదని పల్లె రవికుమార్ హెచ్చరించారు.

కేటీఆర్ 'రికార్డింగ్ డ్యాన్స్' వ్యాఖ్యలు జుగుప్సాకరం



- మహిళలకు బీఆర్ఎస్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలి: మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళలపై చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమశాఖ మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు చేసుకోవచ్చు' అని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని గురువారం ఓ ప్రకటనలో ఆమె ఖండించారు. 'మీ తండ్రి మీకు నేర్పిన సంస్కారం ఇదేనా కేటీఆర్? మీ ఆడపడుచులు అంతా బ్రేక్ డ్యాన్సులు చేస్తున్నారా? ఆడవాళ్లంటే మీకు గౌరవం లేదు. మహిళలను కించపరిచే విధంగా బ్రేక్ డ్యాన్సులు చేసుకోండి అనడం మీ బుర్రలో ఉన్న బురదకు నిదర్శనం. పదేళ్లుగా హైదరాబాద్‌లో క్లబ్బులు, పబ్బులు, బ్రేక్ డాన్సులు ఎంకరేజ్ చేసిన చరిత్ర మీది' అని సీతక్క మండిపడ్డారు. 'మహిళలు ఆర్థికంగా ఎదగాలనే వారి కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. అందులో భాగంగా పేద మహిళలకు రవాణా భారాన్ని తగ్గించేందుకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించాం' అని స్పష్టం చేశారు. శ్రమజీవులు, గ్రామీణ మహిళలు ప్రయాణ సమయంలో సమయం వృథా చేయకుండా ఏదో పని చేసుకుంటే తప్పేంటి? అని ఆమె కేటీఆర్‌ను ప్రశ్నించారు. 'ప్రజలకు ఉపయోగపడే పథకాలు మీకు నచ్చవు.ఉచిత బస్సు ప్రయాణం ఆలోచన మీకు రాలేదు. పదేళ్లు మీరు చేయలేదు. మేము చేస్తే దాని మీద సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు 'అని సీతక్క ధ్వజమెత్తారు.

పౌర సేవల శిక్షణలో 'నిమ్స్‌మి'కు త్రీ స్టార్ రేటింగ్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్‌మి) సంస్థకు జాతీయ పౌరసేవల శిక్షణలో నాణ్యమైన ప్రమాణాలు కలిగిన సంస్థగా గుర్తింపు దక్కింది. కేంద్ర సామర్థ్య నిర్మాణ కమిషన్ ద్వారా సంస్థ పనితీరును మదింపు చేసి నిమ్స్‌మిను అత్యున్నత ప్రమాణాలు కలిగిన 'ఉత్కృష్ట్' స్థాయి సంస్థగా ధ్రువీకరిస్తూ 'త్రీ స్టార్' రేటింగ్ సర్టిఫికెట్‌ను ఇచ్చింది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన జాతీయ పౌరసేవల సంస్థల సమ్మేళన కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ చేతుల మీదుగా నిమ్స్‌మి డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ స్వరూప సర్టిఫికెట్‌ను అందుకున్నారు. గడిచిన 62 ఏళ్లుగా నిమ్స్‌మి సంస్థ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి విస్తరణలో భాగంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ అధికారులు, సాంకేతిక విద్యా సంస్థలు, పారిశ్రామికవేత్తలు, ఇతర పౌర సేవకులకు శిక్షణ ఇస్తోంది. శిక్షణలో నాణ్యతా ప్రమాణాలు పాటించినందువల్లనే తమకు గుర్తింపు దక్కిందని గ్లోరీ స్వరూప ఒక ప్రకటనలో తెలిపారు.

అలాగైతే.. మా ఆడబిడ్డ జైల్లో ఉండేదా?

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజల ముందుకు తీసుకెళ్లాలి. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నేతలు ప్రజల్లో తిరిగే పరిస్థితి ఉండదు. కొందరు సీనియర్ నాయకులకు పార్టీ మేలు చేసినా వెళ్లిపోయారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో స్పీకర్ కావాలనే జాప్యం చేస్తున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ ఉప ఎన్నిక రావడం ఖాయం..'అని కేటీఆర్ అన్నారు.

పాలనలో రేవంత్ సోదరుల జోక్యం

'ప్రజలు ఎన్నుకుంటే పదవుల్లోకి వచ్చిన మాపై కుటుంబ పాలన అని నిందలు వేశారు. తప్పుడు ప్రచారం చేశారు. కానీ రేవంత్ సోదరులు ఏ హోదాలో పాలనలో జోక్యం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నిండా ఆయన సోదరులే కనిపిస్తున్నారు. ఓ తమ్మునితో రేవంత్ అమెరికాలో ఒప్పందం చేసుకుంటే, మరో తమ్ముడు ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నాడు. రేవంత్ బావమరిది సృజన్ కంపెనీకి రూ.1,000 కోట్ల టెండరు పనులు అప్పగించారు..' అని కేటీఆర్ ఆరోపించారు.

కేసీఆర్ పాలనలో బస్సుల్లో తన్నుకున్నారా?

'బస్సులో ఎల్లిపాయలు ఏరితే తప్పా అని మంత్రి సీతక్క అంటోంది. తప్పని మేం అనలే.. కుట్లు, అల్లికలు కూడా తప్పుకాదు. అందుకే బస్సులు పెట్టారని మాకు తెలియదు. ఎక్కువ బస్సులు లేక తన్నుకుంటున్నారని అన్నాం. మనిషికో బస్సు పెట్టండి. అందులో కుట్లు, అల్లికలు అవసరమైతే బ్రేక్ డ్యాన్సులు చేయండి. కేసీఆర్ పాలనలో బస్సుల్లో తన్నుకున్నారా?.'అని మాజీమంత్రి ప్రశ్నించారు.



తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే

మహోన్నత వ్యక్తుల పోరాటం, త్యాగాలు, పట్టుదల ఫలితంగా దేశానికి వచ్చిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని కేటీఆర్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. భారత స్వాతంత్ర్య పోరాటం కుల, మత, వర్గాలన్నింటికీ అతీతంగా జాతి యావత్తును ఒక్క తాటిపై నిలిపిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.





లౌకిక పౌరస్మృతి!

దేశానికి తక్షణావసరం: మోదీ

న్యూఢిల్లీ: దేశంలో ప్రస్తుతం మతపరమైన పౌరస్మృతి అమల్లో ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ''దాన్ని 75 ఏళ్లుగా భరిస్తున్నాం. ఆ స్మృతికి చరమగీతం పాడి దాని స్థానంలో దేశ ప్రజలందరికీ సమానంగా వర్తించే 'లౌకిక' పౌరస్మృతిని రూపొందించుకోవాల్సిన సమయం వచ్చింది'' అని కుండబద్దలు కొట్టారు. ''రాజ్యాంగ స్ఫూర్తి కూడా అదే. దేశమంతటికీ ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) ఉండాలని ఆదేశిక సూత్రాలు కూడా స్పష్టంగా చెబుతున్నాయి. దాని ఆవశ్యకతను సుప్రీంకోర్టు కూడా పలుమార్లు నొక్కిచెప్పింది. ఆ మేరకు తీర్పులు వెలువరించింది'' అని గుర్తు చేశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం మోదీ ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేయడం ఆయనకిది వరుసగా పదకొండోసారి కావడం విశేషం. బీజేపీ ఎజెండా అంశాల్లో, ప్రధాన ఎన్నికల ప్రచార నినాదాల్లో ఒకటైన యూసీసీని వీలైనంత త్వరగా అమల్లోకి తెస్తామని ఈ సందర్భంగా ప్రధాని స్పష్టమైన సంకేతాలిచ్చారు. ''ప్రస్తుత పౌరస్మృతి ఒకవిధంగా మతపరమైనదన్న అభిప్రాయం సమాజంలోని మెజారిటీ వర్గంలో ఉంది. అందులో వాస్తవముంది. ఎందుకంటే అది మతవివక్షతో కూడినది. అందుకే దాన్నుంచి లౌకిక స్మృతివైపు సాగాల్సి ఉంది. తద్వారా రాజ్యాంగ నిర్మాతల కలను నిజం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. అది తక్షణావసరం కూడా'' అని పేర్కొన్నారు. 'ఒక దేశం–ఒకే ఎన్నిక' కూడా దేశానికి చాలా అవసరమని మోదీ అన్నారు. ''2047 కల్లా అభివృద్ధి చెందిన భారత్ కలను సాకారం చేసుకుందాం. అందుకు 140 కోట్ల పై చిలుకు భారతీయులంతా భుజం భుజం కలిపి కలసికట్టుగా సాగుదాం'' అని పిలుపునిచ్చారు. రంగాలవారీగా తమ పాలనలో దేశం సాధించిన ప్రగతిని 98 నిమిషాల పాటు వివరించారు. తద్వారా అత్యంత ఎక్కువ సమయం పాటు పంద్రాగస్టు ప్రసంగం చేసిన ప్రధానిగా సొంత రికార్డు (94 నిమిషాల)నే అధిగమించారు.

కొత్తగా 75,000 వైద్య సీట్లు

''వైద్య విద్య కోసం మన యువత విదేశీ బాట పడుతోంది. ఇందుకోసం మధ్యతరగతి తల్లిదండ్రులు లక్షలు, కోట్లు వెచ్చించాల్సి వస్తోంది. అనామక దేశాలకు కూడా వెళ్తున్నారు'' అని మోదీ ఆవేదన వెలిబుచ్చారు. వచ్చే ఐదేళ్లలో 75 వేల వైద్య సీట్లను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. ''ఉన్నత విద్య కోసం యువత భారీగా విదేశాలకు వెళ్తోంది. దీన్ని సమూలంగా మార్చేస్తాం. విదేశాల నుంచే విద్యార్థులు మన దగ్గరికొచ్చే స్థాయిలో విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తాం. అలనాటి నలంద విశ్వవిద్యాలయ స్ఫూర్తితో 21వ శతాబ్దపు అవసరాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దుతాం. నూతన విద్యా విధానానిది ఇందులో కీలక పాత్ర కానుంది.

కిరాతకులకు వణుకు పుట్టాలి

మహిళలపై హింసకు తక్షణం అడ్డుకట్ట వేయాల్సిందేనని మోదీ అన్నారు. ''మహిళలపై అకృత్యాలకు తెగించేవారికి కఠినాతి కఠినమైన శిక్షలు విధించాలి. ఉరి తప్పదన్న భయం రావాలి. మహిళలను ముట్టుకోవాలంటేనే వణుకు పుట్టే పరిస్థితి కల్పించడం చాలా ముఖ్యం. ఇలాంటి కేసుల్లో పడ్డ శిక్షల గురించి అందరికీ తెలిసేలా మీడియాలో విస్తృత ప్రాచుర్యం కల్పించాలి. అప్పుడే ప్రజల్లో తిరిగి విశ్వాసం పాదుగొల్పగలం'' అన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై దారుణ హత్యాచారం దేశమంతటినీ కుదిపేస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ''మహిళల భద్రత బాధ్యత కేంద్రంపై, రాష్ట్రాలపై, ప్రజలందరిపై ఉంది. కోల్‌కతా ఘోరంపై దేశమంతా తీవ్రంగా ఆక్రోశిస్తున్న తీరును అర్థం చేసుకోగలను. నాదీ అదే మనఃస్థితి. నేనెంత బాధ పడుతున్నానో మాటల్లో చెప్పలేను. ఆ కేసు విచారణను సత్వరం ముగించి దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి నీచకృత్యాలు పదేపదే జరుగుతుండటం బాధాకరం'' అన్నారు.

బంగ్లాలో పరిస్థితులు ఆందోళనకరం

కల్లోల బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడుల పట్ల 140 కోట్ల పై చిలుకు భారతీయుల్లో ఆందోళన నెలకొందని మోదీ అన్నారు. అక్కడ త్వరలో శాంతియుత పరిస్థితులు నెలకొంటాయని ఆశాభావం వెలిబుచ్చారు. అందుకు భారత్ అన్నివిధాలా సహకారం అందిస్తుందని చెప్పారు.

లక్ష మంది యువత రాజకీయాల్లోకి

రాజకీయ రంగంలో కుల, కుటుంబవాదాలకు అడ్డుకట్ట వేయాలని మోదీ అన్నారు. అందుకోసం ఏ రాజకీయ నేపథ్యమూ లేని లక్ష మంది యువతీ యువకులు ప్రజా జీవితంలోకి రావాలని పిలుపునిచ్చారు. ''వారికి నచ్చిన పార్టీలో చేరి అన్ని స్థాయిల్లోనూ ప్రజాప్రతినిధులుగా మారాలి. కొత్త ఆలోచనలతో కూడిన ఆ కొత్త రక్తం మన ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయగలదు'' అన్నారు.

ప్రతికూల శక్తులతో జాగ్రత్త

దేశ ప్రగతిని కొందరు ఓర్వలేకపోతున్నారని విపక్షాలనుద్దేశించి మోదీ విమర్శించారు. ''ప్రతిదాన్నీ ధ్వంసం చేయాలని వాళ్లు కలలు గంటున్నారు. అవినీతిని ఘనకార్యంగా ప్రచారం చేసుకుంటున్నారు. దీన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి. అలాంటి ప్రతికూల శక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి'' అన్నారు. అంతర్గతంగా, బయటి నుంచి భారత్ లెక్కలేనన్ని సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు.

రాజస్తానీ రంగుల తలపాగా

ఎప్పట్లాగే ఈ పంద్రాగస్టు సందర్భంగా కూడా మోదీ ప్రత్యేక తలపాగాతో మెరిసిపోయారు. పసుపు, ఆకుపచ్చ, కాషాయ రంగులతో కూడిన రాజస్తానీ సంప్రదాయ లెహరియా తలపాగాతో ఆకట్టుకున్నారు. తెల్ల కుర్తా, చుడీదార్, నీలిరంగు బంద్‌గలా ధరించారు.

ఐదో వరుసలో రాహుల్

- మోదీ అల్పబుద్ధికి నిదర్శనమంటూ కాంగ్రెస్ ధ్వజం
- పదేళ్ల తర్వాత పంద్రాగస్టు వేడుకల్లో విపక్ష నేత

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దిన వేడుకల్లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ప్రతిపక్ష నేత పాల్గొనడం పదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. అయితే ఆయనకు ఐదో వరుసలో సీటు కేటాయించడం వివాదాస్పదంగా మారింది. రాహుల్ ముందు వరుసలో పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత హాకీ క్రీడాకారులు కూర్చున్నారు. ఈ ఉదంతం ప్రధాని నరేంద్ర మోదీ అల్పబుద్ధికి నిదర్శనమంటూ కాంగ్రెస్ మండిపడింది. ''లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేతలైన రాహుల్, మల్లికార్జున ఖర్గేలకు ప్రొటోకాల్ ప్రకారం తొలి వరుసలో సీటు కేటాయించాలి. కానీ వారిని ఐదో వరుసలో కూర్చోబెట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మోదీలో అహంకారం తగ్గలేదు'' అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ దుయ్యబట్టారు. ముందు వరుసలను ఒలింపిక్ విజేతలకు కేటాయించినందున రాహుల్‌ను వెనక వరుసకు మార్చామన్న రక్షణ శాఖ వివరణపై ఆయన తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చారు. ''క్రీడాకారులకు గౌరవమివ్వాల్సిందే. కానీ అందుకోసం కొందరినే వెనక్కు జరిపారెందుకు? అమిత్ షా, జేపీ నడ్డా, ఎస్.జైశంకర్, నిర్మలా సీతారామన్ తదితర కేంద్ర మంత్రులను మొదటి వరుసలోనే ఎలా కూర్చోబెట్టారు?'' అని ప్రశ్నించారు. దీనిపై సోషల్ మీడియాలోనూ బాగా చర్చ జరిగింది. లోక్‌సభలో విపక్ష నేతకు కేబినెట్ హోదా ఉంటుంది. కేంద్ర మంత్రులతో పాటు ఆయనకు కూడా ముందు వరుసలో సీటు కేటాయిస్తారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కకపోవడంతో విపక్ష నేత పదవి పదేళ్లు ఖాళీగా ఉంది.



పంద్రాగస్టు వేడుకల్లో ఒలింపిక్స్ క్రీడాకారుల తర్వాతి వరుసలో కూర్చున్న రాహుల్ గాంధీ

సెప్టెంబర్‌లో అమెరికాకు మోదీ

న్యూయార్క్: అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ న్యూయార్క్ నగర పరిధిలోని లాంగ్ ద్వీపంలో భారతీయ అమెరికన్లనుద్దేశించి భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. 16వేల సీటింగ్ సామర్థ్యమున్న నసావ్ కొలీసియం ఇండోర్ స్టేడియంలో సెప్టెంబర్ 22వ తేదీన మోదీ ప్రసంగించనున్నారు. న్యూయార్క్‌లో ఐరాస ప్రధాన కార్యాలయంలో సర్వ ప్రతినిధి సభ సమావేశంలో పాల్గొనేందుకు మోదీ అమెరికా వెళ్తున్నారు. భారతీయ అమెరికన్లతో ఆయన భేటీ అవుతారని తెలుస్తోంది. 2014లో తొలిసారిగా ఆయన ప్రధాని అయ్యాక ఐరాసలో వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. న్యూయార్క్ మేడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో వేలాది మంది భారతీయులనుద్దేశించి ప్రసంగించారు. దానికి పదేళ్లు పూర్తవుతున్న వేళ మళ్లీ భారతీయులనుద్దేశించి ప్రసంగించనున్నారు.

సుద్జా ఉక్రెయిన్ స్వాధీనం

కీవ్: రష్యా పట్టణం సుద్జాను పూర్తిగా స్వాధీనం చేసుకున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ గురువారం ప్రకటించారు. సుద్జా జనాభా ఐదు వేలుంటుంది. చిన్నదే అయినా సుద్జా సరిహద్దులో రష్యాకు పాలనాకేంద్రంగా ఉంది. పశ్చిమ సైబీరియా గ్యాస్ నిక్షేపాల నుంచి సుద్జా మీదుగానే ఉక్రెయిన్‌కు పైపుల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుంది. యూరోప్‌కు రష్యా గ్యాస్ ఎగుమతుల్లో మూడు శాతం సుద్జా మీదుగానే వెళతాయి. అక్కడ ఉక్రెయిన్ మిలటరీ కమాండర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు జెలెన్‌స్కీ వెల్లడించారు. కర్స్క్‌లో వెయ్యి చదరపు కిలోమీటర్ల ప్రాంతం తమ నియంత్రణలో ఉందని, 74 జనావాసాలు, వందలకొద్దీ రష్యా యుద్ధఖైదీలు తమ ఆధీనంలో ఉన్నారని ఉక్రెయిన్ బుధవారం ప్రకటించింది. 100 మంది రష్యా సైనికులను బందీలుగా పట్టుకున్నామని ఉక్రెయిన్ చెబుతోంది.

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఎంతో విలువైనవి: సీజేఐ



న్యూఢిల్లీ: స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ప్రతి ఒక్కరికీ చాలా ముఖ్యమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను గమనిస్తే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం విలువ ఏమిటో అర్థం చేసుకోవచ్చని అన్నారు. గురువారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో జస్టిస్ చంద్రచూడ్ జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. గత చరిత్రను పరికిస్తే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎంత విలువైనవో అవగతమవుతుందని పేర్కొన్నారు. ఇవి సులువుగా లభిస్తాయని అనుకోవద్దని సూచించారు. దేశంలో సాటి పౌరుల పట్ల మన బాధ్యతలను స్వాతంత్ర్య దినోత్సవం గుర్తుచేస్తుందని తెలిపారు. రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవడానికి స్వాతంత్ర్య దినోత్సవం దోహదపడుతుందని అన్నారు. మన దేశంలో న్యాయవాదులు ఎన్నో త్యాగాలు చేశారని, వృత్తిని తృణప్రాయంగా వదిలేసి దేశ సేవ కోసం అంకితమయ్యారని కొనియాడారు. పౌరులుగా దేశం పట్ల, సాటి మనుషుల పట్ల నిర్వర్తించాల్సిన బాధ్యతలను అందరూ చక్కగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

జమ్మూకశ్మీర్ స్పెషల్ డీజీపీగా నళిన్ ప్రభాత్



న్యూఢిల్లీ: సీనియర్ ఐపీఎస్ అధికారి నళిన్ ప్రభాత్‌కు కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్‌లో కీలక బాధ్యతలు అప్పగిస్తోంది. తరచూ ఉగ్రదాడులతో అత్యంత ఉద్రిక్తంగా మారిన జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులను చక్కదిద్దడమే లక్ష్యంగా ఆయనను జమ్మూకశ్మీర్ స్పెషల్ డీజీపీగా ఎంపికచేసింది. వచ్చే నెల 30న ప్రస్తుత పోలీస్‌బాస్ ఆర్ఆర్ స్వాయిన్ రిటైరైన వెంటనే అక్టోబర్ ఒకటిన ప్రభాత్ డీజీపీగా బాధ్యతలు స్వీకరిస్తారని కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొంది. 1992 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ప్రభాత్ ఇప్పటికే పలు విభాగాల్లో పనిచేసి అద్భుత ప్రతిభ కనబరిచి విశేష అనుభవం గడించారు. మూడు పోలీస్ గ్యాలంట్రీ మెడళ్లు, ఒక పరాక్రమ్ పతకం సాధించారు. 55 ఏళ్ల ప్రభాత్‌కు వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో నక్సలిజాన్ని అణిచివేసేందుకు ఉద్దేశించిన గ్రేహౌండ్స్ దళాలకూ ఆయన సారథ్యం వహించారు. గతంలో సీఆర్‌పీఎఫ్‌లో ఐజీగా, కశ్మీర్ ప్రాంతంలో అదనపు డీజీగా సేవలందించారు.


థాయ్‌లాండ్ ప్రధానిగా పేటోంగ్‌టార్న్ ఖరారు!



బ్యాంకాక్: థాయిలాండ్ నూతన ప్రధాని ఎన్నిక కోసం పార్లమెంటరీ ఓటింగ్‌లో అధికార ఫ్యూ థాయ్ పార్టీ తమ అభ్యర్థిగా నాయకురాలు పేటోంగ్‌టార్న్ షినవత్ర పేరును నామినేట్ చేసింది. కూటమి పార్టీలతో కలిసి ఉమ్మడిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు గురువారం పత్రికా సమావేశంలో ఫ్యూ థాయ్ ప్రకటించింది. శుక్రవారం జరగబోయే పార్లమెంటరీ ఓటింగ్‌లో ఆమె గెలిస్తే షినవత్ర కుటుంబం నుంచి ప్రధానమంత్రి అవుతున్న మూడో వ్యక్తిగా పేటోంగ్‌టార్న్ పేరు చరిత్రలో నిలిచిపోతుంది. గతంలో పేటోంగ్‌టార్న్ తండ్రి తక్షిన్ షినవత్ర, మేనత్త ఇంగ్లక్ షినవత్ర దేశ ప్రధాన మంత్రులుగా చేశారు. పేటోంగ్‌టార్న్‌ను ఏకగ్రీవంగా నామినేట్ చేశామని ఫ్యూ పార్టీ ప్రధాన కార్యదర్శి సొరవాంగ్ థియేన్‌థాంగ్ చెప్పారు. నైతిక ఉల్లంఘనకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ప్రధాని స్రెట్టా థావిసిన్‌ను ఆ పదవి నుంచి థాయిలాండ్ రాజ్యాంగ ధర్మాసనం తప్పించడం విదితమే.

ఆఫ్రికా దేశాల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితి

వేగంగా వ్యాప్తి చెందుతున్న మంకీపాక్స్ వైరస్ ● స్వీడన్‌లోనూ వెలుగు చూసిన కేసు



సిడ్నీ: ప్రాణాంతక మంకీపాక్స్ (ఎంపాక్స్) ఆఫ్రికా దేశాలను వణికిస్తోంది. కాంగోలో 450 మందిని పొట్టనబెట్టుకున్న ఈ వ్యాధి ఇతర దేశాలకు వేగంగా వ్యాప్తి చెందుతోంది. మధ్య, తూర్పు ఆఫ్రికా దేశాల్లో ఎంపాక్స్ విస్తరణ పెరుగుతున్నట్లు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. ఆయా దేశాల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు ప్రకటించింది. యూరప్ దేశమైన స్వీడన్‌లోనూ ఒక ఎంపాక్స్ కేసు వెలుగులోకి వచ్చింది! దీని వ్యాప్తిని అడ్డుకోవడానికి ప్రపంచ దేశాలన్నీ కలిసి పనిచేయాలని డబ్ల్యూహెచ్ఓ పిలుపునిచ్చింది. ఎంపాక్స్‌లో క్లేడ్–2 కంటే క్లేడ్–1 ప్రమాదకరం. గత సెప్టెంబర్‌లో క్లేడ్–2బీ వేరియంట్ పుట్టుకొచ్చింది. ఎంపాక్స్ సోకితే ఫ్లూ తరహా లక్షణాలు కనిపిస్తాయి. కాళ్లు, చేతులపై కురుపులు, పుండ్లు ఏర్పడతాయి. బాధితులతో లైంగిక సంబంధాలు, దగ్గరగా వెళ్లడం, శ్వాస పీల్చడం వల్ల వైరస్ సోకుతుంది. ప్రతి 100 కేసుల్లో కనీసం నలుగురు మరణించే ప్రమాదముంది. ఎంపాక్స్ నియంత్రణకు వ్యాక్సిన్ వచ్చినా అది పరిమితంగానే లభిస్తోంది. కాంగో, బురుండి, కెన్యా, రువాండాలకు వ్యాపించింది. ఎంపాక్స్‌ను ఇంకా మహమ్మారిగా ప్రకటించలేదు.



బుధవారం అర్ధరాత్రి కోల్‌కతాలో కాగడాలతో మహిళల ర్యాలీ



ఆర్‌జీ కార్ ఆస్పత్రి ప్రాంగణంలో దుండగుల వీరంగం



దుండగుల దాడిలో ధ్వంసమైన ఆస్పత్రిలోని వార్డు

కార్ ఆసుపత్రిలో విధ్వంసం

అర్ధరాత్రి వేళ లోపలికి చొరబడి రెచ్చిపోయిన దుండగులు

- కర్రలు, ఇటుకలు, ఇనుప రాడ్లతో దాడి
- సీసీటీవీ కెమెరాలు, వైద్య పరికరాలు ధ్వంసం
- పోలీసుల్ని వెంటాడి వారిపైకి రాళ్లు రువ్విన వైనం
- హత్య కేసు ఆధారాల మాయానికి ప్రయత్నం
- ఇప్పటిదాకా 12 మందిని అరెస్టు చేసిన పోలీసులు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య వ్యవహారం మరో మలుపు తిరిగింది. యువ వైద్యురాలు శవమై కనిపించిన ప్రభుత్వ ఆర్.జి.కార్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో దుండగులు వీరంగం సృష్టించారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఆసుపత్రి ప్రాంగణంలోకి చొరబడ్డారు. అడ్డొచ్చిన నర్సులను నెట్టేశారు. కర్రలు, ఇటుకలు, ఇనుప రాడ్లతో వార్డుల్లో విధ్వంసానికి దిగారు. ఎమర్జెన్సీ, ఔట్ పేషెంట్స్ వార్డులు, నర్సింగ్ స్టేషన్, మెడిసిన్ స్టోర్‌లో పరికరాలు, ఔషధాలను చిందరవందర చేశారు. హత్య కేసు ఆధారాలు చెరిపేసేందుకు ప్రయత్నించారు. సీసీటీవీ కెమెరాలను పగులగొట్టారు. జూనియర్ డాక్టర్లు నిరసన వ్యక్తం చేస్తున్న వేదికను సైతం ధ్వంసం చేశారు. ఆ సమయంలో అక్కడ పోలీసులు పరిమిత సంఖ్యలోనే ఉండడంతో విధ్వంసాన్ని అడ్డుకోలేకపోయారు. పై అధికారులకు సమాచారం చేరవేయడంతో అదనపు బలగాలు రంగంలోకి దిగాయి. పోలీసుల రాకను గమనించిన దుండగులు రాళ్లు విసిరారు. దాంతో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడంతో అక్కడి నుంచి పరారయ్యారు. 40 మందికిపైగా దుండగులు నిరసనకారుల రూపంలో ఆసుపత్రిలోకి ప్రవేశించారని పోలీసు అధికారులు చెప్పారు. రాళ్ల దాడిలో పోలీసు వాహనంతోపాటు మరో రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయని తెలిపారు. కొందరు పోలీసులు గాయపడ్డారని వెల్లడించారు. ఇప్పటిదాకా 12 మంది దుండగులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

రోగుల హాహాకారాలు

ఆసుపత్రి వార్డుల్లో దుండగులు వీరవిహారం చేస్తుండడంతో రోగులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బయటకు పరుగులు తీశారు. చికిత్స పొందకుండానే కొందరు సొంత ఊళ్లకు వెళ్లిపోయారు. విలువైన వైద్య పరికరాలు, ఔషధాలను దండుగులు ఎత్తుకుపోయినట్లు తెలిసింది. విధ్వంసం జరుగుతున్న సమయంలో ఆసుపత్రిలో విధుల్లో ఉన్న పోలీసులు చేతులెత్తేశారు. ప్రాణభయంతో పరుగులు తీశారు. నర్సులకు కేటాయించిన వార్డుల్లో ఆశ్రయం పొందారు. తమను దాచిపెట్టండి అంటూ ఇద్దరు పోలీసులు వేడుకున్నారని ఓ నర్సు చెప్పారు.

నిరసన వ్యక్తం చేసిన డాక్టర్లు, నర్సులు

ప్రభుత్వ ఆసుపత్రిలో దుండగుల వీరంగం పట్ల డాక్టర్లు, నర్సులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో బైఠాయించారు. తమకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమపై దాడులను సహించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పోలీసుల సమక్షంలోనే దుండగులు రెచ్చిపోయారని, తమపై చెయ్యి చేసుకున్నారని ఆరోపించారు. తమ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి, ఉద్యమాన్ని విరమించుకొనేలా చేయాలన్నదే వారి ప్రయత్నమని చెప్పారు. ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

దుమ్మెత్తిపోసుకున్న మమత, బీజేపీ

ఆస్పత్రి విధ్వంసంపై మమత, బెంగాల్ బీజేపీ నేతలు పరస్పరం దుమ్మెత్తిపోసుకున్నారు. సీపీఎం, బీజేపీ కార్యకర్తలే విధ్వంసానికి పాల్పడ్డారని మమత ఆరోపించగా, అది ఆమె పంపిన తృణమూల్ గూండాల పనేనని బీజేపీ తిప్పికొట్టింది. ఆమె రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఆస్పత్రి విధ్వంస ఘటన పౌర సమాజానికి సిగ్గుచేటని బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద బోసు అన్నారు. దాన్ని తీవ్రంగా ఖండించారు.

రేపు వైద్యుల దేశవ్యాప్త సమ్మె

వైద్యురాలి హత్యకు నిరసనగా శనివారం వైద్యుల దేశవ్యాప్త సమ్మెకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. అత్యవసర సేవలకు మినహాయింపు ఉంటుందని తెలిపింది. మరోవైపు దీనిపై నిరసనలు కొనసాగించాలని ఫోర్డా నిర్ణయించింది. తమ డిమాండ్లను పరిష్కారంపై కేంద్ర మంత్రి నుంచి జేపీ నడ్డా లిఖితపూర్వక హామీ ఇవ్వనందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది.

సీబీఐ దర్యాప్తు వేగవంతం

వైద్యురాలి కేసులో సీబీఐ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. గురువారం బాధితురాలి తల్లిదండ్రులతో మాట్లాడి హత్యపై వివరాలు సేకరించారు. ఆమె స్నేహితుల గురించి ఆరా తీశారు. కార్ ఆసుపత్రి వైద్యులతోనూ మాట్లాడారు. మాజీ మెడికల్ సూపరింటెండెంట్, వైస్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్, ఛెస్ట్ డిపార్టుమెంట్ చీఫ్‌ను విచారించారు.



ట్రంప్, మస్క్ స్టేయింగ్ అలైవ్ ఫీవర్

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ యమా ఉత్సాహంగా స్టెప్పులేస్తున్న ఈ ఫొటో వాస్తవానికి ఏఐ సృష్టి. 1970ల చివర్లో 'శాటర్‌డే నైట్ ఫీవర్' సినిమాలో ఓ ఊపు ఊపిన బీజీస్ పాట 'స్టేయింగ్ అలైవ్'కు వారు లయబద్ధంగా డ్యాన్స్ చేస్తున్నట్టుగా రూపొందించిన 36 సెకన్ల ఏఐ వీడియో ఇంటర్నెట్‌ను షేక్ చేసింది. ఏకంగా 8 కోట్ల పై చిలుకు వ్యూస్ సొంతం చేసుకుంది!

ఒడిశాలో నెలసరి సెలవు

భువనేశ్వర్: ఒడిశాలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగినులకు ఒక రోజు రుతుస్రావ సెలవును ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది వేతనంతో కూడిన సెలవు. మహిళా ఉద్యోగినులు రుతుక్రమ మొదటి లేదా రెండోరోజు సెలవు తీసుకోవచ్చని తెలిపింది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరీదా గురువారం కటక్‌లో ఈ మేరకు ప్రకటించారు. నెలసరి సెలవు తక్షణం అమలులోకి వస్తుందని ప్రకటించారు. రుతుస్రావ సెలవులపై దేశమంతటికీ వర్తించే విధంగా ఒక విధానాన్ని రూపొందించాల్సిందిగా సుప్రీంకోర్టు గత జూలై 8న కేంద్ర ప్రభుత్వానికి సూచించడం తెలిసిందే.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



ట్రాఫిక్ విధుల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

నగర ట్రాఫిక్ విభాగానికి విద్యాశాఖ సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లను ట్రాఫిక్ విధులకు వినియోగించాలని నిర్ణయించింది. -8లో



శ్రావణ శోభ.. లక్ష్మీ పూజ..

తెలుగింటి ఆడపడుచులు శ్రావణ మాసంలో వరలక్ష్మీ పూజను భక్తి శ్రద్ధలతో చేస్తారు. పచ్చని తోరణాలు, పుష్పాలతో అమ్మవారిని అందంగా అలంకరించి తమదైన సృజనకు మెరుగులు దిద్దుతారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
33.0/25.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలిక పాటి వర్షం కురిసే అవకాశం ఉంది. గరిష్టంగా 33, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.


గోల్కొండ కోటలో సాంస్కృతిక ప్రదర్శన


కోటలో మహిళల ఆటాపాటా


బోనాలు.. పోతరాజుల వేషధారణలో


నృత్య విలాసం..


గిరిజన మహిళల సందడి


ట్యాంక్‌బండ్‌పై జాతీయ పతాకాల అలంకరణతో కనిపించిన ఆటో

తిరంగా.. వైభవంగా

నగరంలో మువ్వన్నెల శోభ ఆవిష్కృతమైంది. జాతీయ జెండా రెపరెపలాడింది. గురువారం 78వ స్వాతంత్ర్య దిన వేడుకలు వైభవంగా జరిగాయి. గోల్కొండ కోటలో సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండాను ప్రతిబింబించే వస్త్రధారణలతో వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. నగర యువత భారీ త్రివర్ణ పతాకాలను చేబూని ద్విచక్ర వాహనాలు, కార్లతో ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్, ట్యాంక్ బండ్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో యువకులు దేశభక్తిని చాటారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ తదితర యాప్స్ దేశభక్తిని చాటే పోస్టులతో నిండిపోయాయి. నెక్లెస్ రోడ్‌లోని అతిపెద్ద జాతీయ జెండా వద్ద తీసుకున్న సెల్ఫీలు, ఫొటోలు అత్యధికంగా చక్కర్లు కొట్టాయి.


గోల్కొండ కోటలో ఆదివాసీల నృత్య హేల.. డప్పుల దరువు




ఒగ్గు కథ కళాకారులు..


జాతీయ జెండాతో చిన్నారులు




గోల్కొండ కోటలో పోలీసుల కవాతు


విద్యార్థినులకు షేక్‌హ్యాండ్ ఇస్తున్న సీఎం రేవంత్ రెడ్డి


ట్యాంక్‌బండ్‌పై బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ

సిటీ బ్యూటీ‘ఫుల్’

జంక్షన్లు తదితర ప్రాంతాల్లో సుందరీకరణకు ప్రణాళికలు

- ఆకట్టుకునేలా వివిధ థీమ్‌లతో ఆకృతులు, శిల్పాలు
- డిజైన్లు, పనుల పర్యవేక్షణ కోసం నిపుణుల సహకారం




సిటీలో ఇప్పటికే ఇలాంటి ఆకృతులెన్నో..

సాక్షి, సిటీబ్యూరో: భాగ్య నగరం మరిన్ని సొబగులు అద్దుకోనుంది. సిటీ బ్యూటీఫుల్‌గా మారనుంది. హైదరాబాద్‌ను అందంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జీహెచ్ఎంసీ చర్యలకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పలు రాష్ట్రాలు, విదేశాల నుంచి సైతం ఎందరో నగరానికి వస్తున్నందున వారిని ఆకట్టుకునేలా ఆయా ప్రాంతాలు కనిపించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో జంక్షన్లతో పాటు అవకాశమున్న అన్ని ప్రాంతాలను అందంగా, కనువిందు చేసేలా తీర్చిదిద్దాలనీ జీహెచ్ఎంసీ భావిస్తోంది.

టెండర్ల నుంచి పనులు పూర్తయ్యే దాకా..

ఇప్పటికే నగరంలోని పలు జంక్షన్లు, ఆయా విగ్రహాలు, కళాకృతులతో పలువురిని ఆకట్టుకుంటుండటం తెలిసిందే. మరిన్ని జంక్షన్లతో పాటు ఫ్లై ఓవర్లు, ఆర్‌యూబీలు, అండర్‌పాస్‌లు తదితర ప్రాంతాలను బ్యూటీఫుల్‌గా మార్చేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందుకోసం నిపుణులైన, తగిన అర్హతలున్న ఆర్కిటెక్టుల జాబితాను సైతం తయారు చేయనున్నారు. ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు సుందరీకరించేందుకు వారి ఆలోచనలు, ప్రణాళికలు తదితరాలను పరిగణనలోకి తీసుకుంటారు. అంతేకాదు.. టెండర్లను ఆహ్వానించడం నుంచి పనులు పూర్తయ్యేంతదాకా కూడా వారి సహకారం తీసుకుంటారు. తద్వారా పనులు త్వరితంగా పూర్తయ్యేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ల్యాండ్‌స్కేపింగ్ నుంచి మొదలుపెడితే ప్రత్యేక థీమ్‌లతో ఆయా ప్రాంతాలను సుందరీకరించేందుకు వారి సేవలు పొందనున్నారు. కళాకృతులు తయా రు చేసేందుకు అవసరమైన మెటీరియల్, రంగులు నాణ్యమైనవి, మన్నికతో కూడినవి ఎంపిక చేసేందుకూ వారి సహకారం తీసుకోనున్నారు.

ఈ ప్రాంతాల్లో సుందరీకరణ..

సుందరీకరణ పనుల కోసం ఇప్పటికే కొన్ని ప్రాంతాలను ఎంపిక చేశారు. మరిన్ని ప్రాంతాలను త్వరలోనే ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన ప్రాంతాల్లో శేరిలింగంపల్లి జోన్‌లోని జేఆర్‌సీ రోడ్ ఎంట్రెన్స్, కిడ్నీ ఐలాండ్ జంక్షన్, శిల్పారామం, బయో డైవర్సిటీ, గచ్చిబౌలి ఫ్లై ఓవర్, నల్లగండ్ల- గోపన్‌పల్లి రోటరీ గచ్చిబౌలి స్టేడియం, ఖాజాగూడ కారిడార్ జంక్షన్లు ఉన్నాయి. మిగతా జోన్లలోనూ ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, ఆర్‌యూబీలు, చౌరస్తాలు తదితర ప్రాంతాల్లోనూ సుందరీకరణ పనులు చేపట్టనున్నారు.

పరిస్థితులకనుగుణంగా..

నగరంలోని ఆయా జంక్షన్ల సమీపంలో క్షేత్ర స్థాయి పరిస్థితులకనుగుణంగా కళాత్మకత ఉట్టిపడేలా, తగిన డిజైన్లతో, వివిధ థీమ్‌లతో సుందరీకరణ పనులు చేయనున్నారు. కళాత్మకంగా కనిపించే చెక్కలు, శిల్పాలు, ఇటాలియన్ డిజైన్ విద్యుత్ స్తంభాలు, ఫౌంటెన్లు, వాటర్ ఫాల్స్ వంటి వాటితో అందమైన, ఆకట్టుకునే ప్రాంతాలుగా తీర్చిదిద్దనున్నారు.


ఉప్పల్ జంక్షన్‌లో..


ఆరాంఘర్‌లో..

అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు: మేయర్



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమిషనర్ ఆమ్రపాలి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డిలతో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో బల్దియాకు రూ.3,065 కోట్లు కేటాయించడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్, ఎల్బీనగర్, కూకట్ పల్లి జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ్ అగర్వాల్, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరిష్, కె. శ్రీనివాసరావు, శివకుమార్ నాయుడు, యాదగిరి రావు, సత్యనారాయణ, నళిని పద్మావతి, గీతా రాధిక, సరోజ, పంకజ, మంగతాయారు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లకు సదుపాయాలు

టెండర్లు ఆహ్వానించిన జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలోని వివిధ కాలనీల్లో లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో సదుపాయాలు కల్పించకపోవడంతో వారు వాటిలో ఉండటంలేదు. గత సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలోనూ కొన్ని ప్రాంతాల ప్రజలు సదుపాయాల లేమిపై ఫిర్యాదు చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ సమయంలోనే తాగునీరు, శానిటరీ, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించినప్పటికీ, చాలా కాలం వరకు లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించనందున కొన్ని ప్రాంతాల్లో పైపులు, విద్యుత్ తీగలు, శానిటరీ పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. కొన్ని ప్రాంతాల్లో దెబ్బతిని మరమ్మతులకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులతో తిరిగి వాటిని సమకూర్చేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ప్రస్తుతం శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో కొత్తవి ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీ టెండర్లు ఆహ్వానించింది. టెండర్లు పూర్తి చేసి పరికరాలు సమకూర్చుకొని, అమర్చనుంది.

హైదరాబాద్‌ను ఆదర్శంగా నిలుపుదాం: కలెక్టర్ అనుదీప్



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోనే హైదరాబాద్ ఆదర్శంగా నిలిచేలా అందరం కృషి చేద్దామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు, సమగ్రాభివృద్ధికి కంకణబద్ధులం కావాలన్నారు. జిల్లాలో సంక్షేమ పథకాల అమలుపై వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు అవార్డులను ఆయన అందజేశారు.

బస్ భవన్‌లో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు


ప్రశంస పత్రాలు అందుకున్న సిబ్బందితో సజ్జనార్

ముషీరాబాద్: నగరంలోని బస్ భవన్‌లో గురువారం పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన 30 మంది ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, మెడికల్ అడ్వైజర్ సైదిరెడ్డి, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, వెంకన్న, ఉషాదేవి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దొంగిలించిన క్రెడిట్ కార్డులతో విమాన టికెట్లు

సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్ కేంద్రంగా పని చేసే ఎయిర్ టికెటింగ్ సంస్థ ఉద్యోగిని ట్రాప్ చేసిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగ క్రెడిట్ కార్డులతో విమాన టికెట్లు ఖరీదు చేశారు. ఇలా రూ.1.59 కోట్ల విలువైన 118 టికెట్లు బుక్ చేసుకున్న తర్వాత విషయం సదరు సంస్థ గుర్తించింది. నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) అధికారులను ఆశ్రయించడంతో కేసు నమోదైంది. బంజారాహిల్స్ కేంద్రంగా పని చేసే ట్రావెల్ కంపెనీ ఇండియన్ ఈగల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వివిధ విమానయాన సంస్థలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ విమాన టికెట్లను ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. గత మే నెలలో ఆన్‌లైన్ చాట్‌లో ఈ సంస్థను సంప్రదించిన గుర్తుతెలియని వ్యక్తులు విమాన టికెట్ల వివరాలపై ఆరా తీశారు. ఆ సమయంలో వారితో నితీష్ అనే ఉద్యోగి సంప్రదింపులు జరిపారు. ఆ సందర్భంలో అతడి వ్యక్తిగత ఫోన్ నంబర్‌ను దుండగులు తీసుకున్నారు. మే 28 నుంచి వివిధ క్రెడిట్ కార్డులు వినియోగించి బడే అభిషేక్, పర్వేజ్ అహ్మద్ నూర్ మహ్మద్ హోర, గుండు రాణి సహా మరికొంత మంది పేర్లతో 118 విమాన టికెట్లు బుక్ చేశారు. దీనికి సంబంధించి నితీష్‌కు రూ.82,500 కమీషన్ రూపంలో అతడి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. వీరు వినియోగించినవి వివిధ ప్రాంతాల్లో చోరీ అయిన క్రెడిట్ కార్డుల అని వరుసగా వచ్చిన ఫిర్యాదులతో ట్రావెల్ కంపెనీ యాజమాన్యం గుర్తించింది. పక్కా పథకం ప్రకారం వ్యవహరించి తమ సంస్థను మోసం చేశారని రూ.1,59,18,900 నష్టం జరిగిందంటూ సంస్థ ఆపరేషన్ డైరెక్టర్ రమేష్ కంద్రకోట సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు.


మన్సూరాబాద్‌లో మహిళల కష్టాలు..


చింతలకుంట ప్రధాన రహదారిపై వరద దృశ్యం..


బంజారాహిల్స్‌లో..


హయత్‌నగర్ సమీపంలో..



నగరాన జడివాన

గురువారం సాయంత్రం నగరంలో భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన వానకు నగరం అతలాకుతలం అయింది. ఏకధాటిగా దాదాపు రెండు గంటలపాటు దాదాపు 8 సెం.మీ జడివాన కురవడంతో జనజీవనం స్తంభించింది. రోడ్లు చెరువులను తలపించాయి. ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. వాహనదారులు బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిక జారీ చేశారు.

– సాక్షి, సిటీబ్యూరో




కవాడిగూడలో వాహనదారుల ఇబ్బందులు


శ్రీనగర్ కాలనీలో రహదారులను ముంచెత్తిన వరద


మన్సూరాబాద్ ప్రెస్‌కాలనీలో..

వర్షాల నేపథ్యంలో జలమండలి అప్రమత్తం

రంగంలోకి ఈఆర్టీ, ఎస్పీటీ బృందాలు

సాక్షి, సిటీబ్యూరో: వర్షాల నేపథ్యంలో జలమండలి అప్రమత్తమైంది. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీనికోసం ఇప్పటికే క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు (ఈఆర్టీ), ఎస్పీటీ వాహనాలను సైతం సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తరచూ సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్‌హోల్స్‌ను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జీహెచ్‌ఎంసీ గుర్తించిన మొత్తం 140 నీరు నిలిచే ప్రాంతాలపైన ఈ బృందాలు ప్రత్యేక దృష్టి పెడతాయని వివరించారు. వర్షాల నేపథ్యంలో ఇప్పటికే నగరంలో దాదాపు 16 ఈఆర్టీ బృందాలను జలమండలి ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో అయిదుగురు సిబ్బందితో పాటు ఇతర అత్యవసర సామగ్రి ఉంటుంది. వర్షపు నీరు నిలిచిన ప్రాంతంలో వాటిని తొలగించేందుకు వీరికి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. ఈ వాహనాల్లో జనరేటర్‌తో కూడిన డీ వాటర్ మోటర్ ఉంటుంది. అంతేకాకుండా 6 ఎస్పీటి వాహనాలు, 16 మినీ ఎయిర్‌టెక్ వాహనాలను సైతం 24 గంటలు అందుబాటులో ఉంచారు.

ఫామ్‌హౌస్ పార్టీలపై నిఘా!

- వీకెండ్స్‌లో రేవ్, డ్రగ్స్ పార్టీలతో హంగామా
- ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు
- కేసుల నమోదుతో పాటు ఆస్తులు సీజ్
- సైబరాబాద్ పోలీసుల కార్యాచరణ

సాక్షి, సిటీబ్యూరో: వీకెండ్స్ వస్తే చాలు ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లలో రేవ్, డ్రగ్స్ పార్టీల్లో మునిగితేలుతున్నారు. విదేశాల నుంచి మాదక ద్రవ్యాలను తీసుకొచ్చి మత్తు పార్టీలను నిర్వహిస్తున్నారు. విదేశీ అమ్మాయిలతో అశ్లీల నృత్యాలు చేయిస్తూ..మరో లోకంలో విహరిస్తున్నారు. పోలీసులు నిరంతరం రేవ్, డ్రగ్స్ పార్టీల భరతం పడుతున్నా.. ఏమాత్రం బెదరడం లేదు. దీంతో సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక కార్యాచరణతో ఈ పార్టీలకు చెక్ పెడుతున్నారు. వీకెండ్స్, సెలవు దినాలలో ప్రత్యేక బృందాలతో శివారు ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్, రిసార్ట్‌లపై ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. పార్టీ నిర్వాహకులు, వినియోగదారులు, డ్రగ్స్ పెడ్లర్లపై కేసులు నమోదు చేయడంతో పాటు పార్టీలు నిర్వహిస్తున్న ప్రాపర్టీలను సైతం సీజ్ చేస్తున్నారు. దీంతో ఈ తరహా పార్టీలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

వ్యవస్థీకృత నేరాలపై నిఘా..

సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలో జరిగే చిన్న చిన్న నేరాలు పోలీసు స్టేషన్ వరకు రానివ్వరు. గ్రామ పెద్దలు, స్థానిక నేతలే మధ్యవర్తిత్వం వహించి రాజీ చేస్తుంటారు. అయితే గ్రామాల్లో సైతం స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) పోలీసులు దృష్టి సారించడంతో.. ప్రతి చిన్న నేరం కూడా పోలీసుల దృష్టికి వస్తుంది. స్థానిక యువతతో నిరంతరం సత్సంబంధాలు నెరపుతూ..నేర సమాచారాన్ని సేకరిస్తున్నామని బాలానగర్ ఎస్ఓటీ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లలో ఇబ్బందులు, రాజకీయ ఒత్తిళ్లు ఎస్ఓటీ దృష్టికి వస్తున్నాయి. ఇప్పటివరకు మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా వంటి వ్యవస్థీకృత నేరాలపై మాత్రమే దష్టిపెట్టిన ఎస్ఓటీ పోలీసులు.. ఇక నుంచి చిన్న చిన్న నేరాలపై కూడా ఫోకస్ పెడుతున్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండానే..

గ్రామాలు, శివారు ప్రాంతాలలో చాలా వరకు చిన్న కంపెనీలు ట్రేడ్ లైసెన్స్ లేకుండానే ఇష్టానుసారంగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. దీంతో ప్రభుత్వానికి నష్టం జరుగుతుంది. స్థానిక పోలీసులకు సైతం వీటిపై అవగాహన ఉండదు. ఇటీవల రూ.4 లక్షలు విలువ చేసే వీడ్ ఆయిల్‌ను సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. కల్తీ ఆహార ఉత్పత్తులు, అక్రమ గ్యాస్ దందా, అక్రమ గోదాంలపై దృష్టిసారించి.. నేరస్తులను పట్టుకుంటున్నారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపు ఎక్కువగా జరుగుతుంటుంది.

స్పై కెమెరాలపై అవగాహన

పంజగుట్ట: షీ టీమ్స్ హైదరాబాద్, హయ్యర్ ఎడ్యుకేషన్, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా ఒక కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. షాపింగ్ మాల్స్‌లోని దుస్తుల షాపుల్లో, టాయిలెట్లలో ఎవరైనా స్పై కెమెరాలు పెట్టారో లేదో పూర్తిగా తనిఖీ చేసి అక్కడ కెమెరాలు లేవని సర్టిఫై చేసి స్టిక్కర్లు అంటిస్తున్నారు. గురువారం సాయంత్రం పంజగుట్ట జీవీకే మాల్‌లో నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ బుర్రా వెంకటేశం, షీ టీమ్స్ డీసీపీ కవిత తనిఖీలు చేశారు. అక్కడ ఎలాంటి స్పై కెమెరాలు లేవని నిర్ధారించి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా అక్కడి వినియోగదారులకు అవగాహన కల్పించారు.


అవగాహన స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ట్రాఫిక్ విధుల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

అధికారికంగా పని ప్రారంభం

- నియంత్రణతో పాటు అవగాహన కోసం వీరి కృషి
- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో 225 మంది విధులు
- జూబ్లీహిల్స్ నుంచి గోల్కొండ కోట వరకు మోహరింపు

సాక్షి, సిటీబ్యూరో: ఓపక్క నగరంలో వాహనాలు, ఉల్లంఘనుల సంఖ్య నానాటికీ పెరుగుతూ పోతోంది...ట్రాఫిక్ విభాగంలో సిబ్బంది సంఖ్య మాత్రం అవసరమైన స్థాయిలో ఉండట్లేదు. ఈ కారణంగా నగర జీవి రోడ్డుపై నిత్యం నరకం చవిచూస్తున్నాడు. దీన్ని పరిగణలోకి తీసుకున్న విద్యా శాఖ పోలీసు విభాగానికి సహకరించడానికి ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్‌ఎస్‌ఎస్)వలంటీర్లను ట్రాఫిక్ విధులకు వినియోగించాలని నిర్ణయించారు. దీంతో ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లలో 225 మంది గురువారం నుంచి అధికారికంగా విధులు నిర్వర్తించడం ప్రారంభించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఆయా మార్గాల్లో వీరిని మోహరించారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు ట్రైనింగ్ ఫర్ ట్రైనర్స్ విధానంలో కొందరిని తీర్చిదిద్దారు. తొలి బ్యాచ్ శిక్షణను ఈ ఏడాది జూన్ 24న నాటి డీజీపీ రవి గుప్తా ప్రారంభించారు. ఈ శిక్షణలో భాగంగా ఒక్కో బ్యాచ్‌లో 100 మంది చొప్పున మొత్తం 600 మందికి శిక్షణ ఇచ్చారు. గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో (టీటీఐ) ఒక రోజు, ఆరు గంటల పాటు ఈ ట్రైనింగ్ జరిగింది. ఇందులో భాగంగా ఇండోర్ విభాగంలో నిబంధనలు, చట్టంలోని ప్రాథమిక అంశాలు బోధిస్తారు. ఔట్‌డోర్ విభాగంలో రహదారులపై విధులు నిర్వర్తించే విధానం, ట్రాఫిక్ నిర్వహణలో కీలకాంశాలు నేర్పారు. భవిష్యత్తులో నగరంలో ఒక్కో కూడలి వద్ద 20 నుంచి 30 మంది వలంటీర్లు విధుల్లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ట్రాఫిక్ పోలీసులు వీరి భద్రతకు కీలక ప్రాధాన్యం ఇస్తూనే విధులు కేటాయిస్తారు. ప్రధానంగా ఫ్రీ లెఫ్ట్ అమలు, పాదచారుల భద్రత తదితర అవగాహన కార్యక్రమాలు వీరి ద్వారా చేయిస్తున్నారు.


గోల్కొండ కోటలో విధుల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు


నానల్‌నగర్ వద్ద విద్యార్థులతో కలిసి ట్రాఫిక్ డ్యూటీలో ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్

గురువారం వలంటీర్ల మోహరింపు ఇలా...

స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో గోల్కొండ కోటలో జరిగే అధికారిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. అధికారికంగా ఆయనే జెండా వందనం చేశారు. దీనికి ముందు ఆయన గాంధీభవన్, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని వార్ మెమోరియల్‌కు వెళ్లారు. ఈ మార్గాల్లోని జంక్షన్లలో 225 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు విడుదల వారిగా ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు విధులు నిర్వర్తించారు. వారి మోహరింపు ఇలా...

- జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసం గాంధీ భవన్ మధ్య ఉన్న 14 జంక్షన్లలో 99 మంది.
- గాంధీభవన్–వార్ మెమోరియల్ మధ్య ఉన్న ఆరు జంక్షన్లలో 36 మంది.
- వార్ మెమోరియల్ నుంచి గోల్కొండ కోట మధ్య ఉన్న 13 జంక్షన్లలో 90 మంది.

ఎవ్రీడే ఇండియా ఫొటో ఎగ్జిబిషన్

మాదాపూర్: కళాకారులు తీసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ యం కోదండరాం అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఎవ్రీడే ఇండియా పేరిట ఫొటో ఎగ్జిబిషన్‌ను గురువారం ప్రారంభించారు. ఒక ఫొటో ఎన్నో భావాలను పలికిస్తుందన్నారు. పల్లెటూరి వాతావరణంలో సహజ సిద్ధ జీవన శైలిని తెలిపే చిత్రాలు ఉన్నాయని కొనియాడారు. ప్రదర్శనలో 63 ఫొటోలు అందుబాటులో ఉన్నాయని, ఈనెల 19 వరకూ ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకూ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



రాష్ట్ర పోలీస్ శాఖ ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఐజీ ఎం.రమేష్. కార్యక్రమంలో అసిస్టెంట్ ఐజీ రమణకుమార్, లీగల్ ఎస్పీ సతీశ్, సీఎస్‌వో యోగేశ్వర్ తదితరులు.



ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో ప్రజాస్వామిక హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ కవి, మంజీర రచయితల సంఘం వ్యవస్థాపకులు నందిని సిధారెడ్డి అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్వీకే, తెలంగాణ సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రజాస్వామిక విలువలు' అనే అంశంపై కవితా గోష్ఠి జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిధారెడ్డి మాట్లాడుతూ నేడు ప్రజాస్వామిక విలువలు అడుగంటుతున్నాయన్నారు. ప్రజల్లో వెలుగులు నింపేదానికి బదులు చీకటిని నింపడానికే సిద్ధాంతాలు ముందుకు వస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, టీపీఎస్‌కే కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ సాహితి ప్రధాన కార్యదర్శి ఆనందచారి, అనంతోజు మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వావ్.. ఫండ్ రైజింగ్ ఫీస్ట్



సాక్షి, సిటీబ్యూరో: ప్రీ మెచ్యూర్ బేబీస్ ఆరోగ్యం కోసం అకాన్ రెస్టో బార్, ఎక్స్ ట్రా మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన బంతి భోజనం కార్యక్రమం విశేషంగా అలరించింది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజం పట్ల మన బాధ్యతను గుర్తు చేసేలా ఏర్పాటు చేసిన అరుదైన కార్యక్రమం అభినందనీయమని ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మిసెసఇండియా శిల్పా రెడ్డి తెలిపారు. ఈ ఫండ్ రైజింగ్ కార్యక్రమంలో వీరాంజనేయులు విహారయాత్ర నటీనటులు రాగ్ మయూర్, ప్రియా వడ్లమణి తదితరులు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగ వచ్చిన ఆదాయాన్ని ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్‌కు అందించనున్నారు.

తెలంగాణ బుక్ ట్రస్ట్ పుస్తక ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: స్వాతంత్య్రదినోత్సవం సందర్భంగా గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని తెలంగాణ బుక్ ట్రస్ట్ కార్యాలయంలో పుస్తక ప్రదర్శనను గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ ప్రారంభించారు. ప్రగతిశీల సాహిత్యంతో పాటు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ఉద్యమాలకు సంబంధించిన సాహిత్యాన్ని విస్తృతంగా తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని భిన్న కులాలను, మతాలను సమైక్యపరిచేది సాహిత్యమన్నారు. రచయిత సామిడి జగన్ రచించిన భారత దేశ విప్లవ కవి గద్దర్ గ్రంథాన్ని డాక్టర్ రియాజ్ కు బహూకరించారు. తెలంగాణ బుక్ ట్రస్ట్ కార్యదర్శి కోయ చంద్రమోహన్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రాజు, డిప్యూటీ డైరెక్టర్ హరిశంకర్, సామాజిక కార్యకర్త జి రాములు, సీనియర్ జర్నలిస్ట్ కొండూరు వీరయ్య, కవి తంగిరాల చక్రవర్తి, నరసింహ, గురుమూర్తి పాల్గొన్నారు.

తిరంగ్.. తరంగ్..

భారత స్వాతంత్ర్య దినోత్సవాలు గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మువ్వన్నెల పతాకాలు రెపరెపలాడాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో పలు చోట్ల ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జాతీయజెండాను ఆవిష్కరించారు. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బి.రవీంద్రనాథ్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కిలారి రాజేశ్వర్‌రావు జెండా ఎగురవేశారు. జూబ్లీహిల్స్‌రోడ్ నెం.10లోని గాయత్రిహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా జెండా ఎగురవేసిన అనంతరం దేశ భక్తిని చాటేలా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

– బంజారాహిల్స్


జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవాల దృశ్యం


ఫిలింనగర్‌లో విభిన్న వేషధారణలతో బీఎస్‌ఆర్ బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు


బంజారాహిల్స్ సరస్వతి స్కూల్ ఆధ్వర్యంలో జాతీయ దినోత్సవాలు


ఫిలింనగర్‌లో స్వాన్ మోడల్ విద్యార్థుల విన్యాసాలు


ఎన్టీటీ నగర్‌లో జెండా ఎగురవేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


ఫిలింనగర్‌లో జాతీయ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్


సోమాజిగూడలోని బీఎస్ మక్తాలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


జూబ్లీహిల్స్‌లో..


ఫిలింనగర్ క్లబ్‌లో జాతీయ దినోత్సవాల్లో కాజా సూర్యనారాయణ


ఫిలింనగర్‌లో విద్యార్థులతో కలిసి జాతీయ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం


లిటిల్ స్టార్ హైస్కూల్ విద్యార్థినులతో ప్రిన్సిపాల్ అస్మతున్నీసా


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్


జూబ్లీహిల్స్ క్లబ్‌లో జెండా ఎగురవేస్తున్న కార్యదర్శి కిలారు రాజేశ్వర్‌రావు


సైఫాబాద్ సైన్స్ కాలేజీలో జెండావిష్కరణలో పాల్గొన్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్


బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఏసీపీ సామల వెంకటరెడ్డి

ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవాలు


హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయజెండాకు వందనం చేస్తున్న కార్యవర్గం

పంజగుట్ట: 78వ స్వాతంత్ర్య దినోత్సవాలు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్.వేణుగోపాల నాయుడు జాతీయ జెండాను ఎగరవేశారు. ఉపాధ్యక్షుడు శ్రీకాంత రావు, సంయుక్త కార్యదర్శులు రమేష్ వైట్ల, చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి ఎ.రాజేష్, కార్యవర్గ సభ్యులు బాపురావు,వసంత్, ఎం.రమాదేవి, టి.శ్రీనివాస్‌లు హాజరై జాతీయగీతాన్ని ఆలపించారు. సోమాజిగూడ డివిజన్ పరిధిలోని బీఎస్ మక్తాలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి జాతీయ జెండాను ఎగరవేశారు. రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు జాతీయజెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు సి.హెచ్.ఉపేంద్ర, శుభప్రద్ పటేల్, కె.కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.


బీఎస్ మక్తాలో జాతీయ జెండా ఎగరవేస్తున్న విజయారెడ్డి

గోడపత్రిక ఆవిష్కరణ


గోడ పత్రికను విడుదల చేసిన టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధులు

బంజారాహిల్స్: టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శ్రావణమాస కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమాల వివరాలతో కూడిన గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 16న (నేడు) హిమాయత్‌నగర్ టీటీడీ కళ్యాణమండపంతోపాటు సరూర్‌నగర్ మండలం అంబేద్కర్‌నగర్‌లో విజయ గణపతి దేవస్థానం, ఐడీపీఎల్ ఆదర్శనగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం, వికారాబాద్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రత కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ గూడూరు హరినాథ్, ధర్మప్రచార మండలి సభ్యులు సురేందర్, అర్చకులు రంగాచార్యులు, నరసింహాచార్యులు, ఏఈఓ చతుర్వేదల సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ సతీష్ పాల్గొన్నారు.

ఎన్‌బీటీనగర్‌లో 'వాట్సాప్' చిచ్చు

బంజారాహిల్స్ పీఎస్‌లో పరస్పరం ఫిర్యాదులు

బంజారాహిల్స్: మహిళ అనే గౌరవం లేకుండా గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కొందరు దూషిస్తున్నారని, ఇది చాలా బాధాకరమైన విషయమని, వారిపై చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్‌కు చెందిన కొంతమంది మహిళలు గురువారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్‌బీటీనగర్ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ అనే వాట్సాప్ గ్రూపును బస్తీలోని సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశారని, బస్తీ సమస్యలు మేయర్ కార్యాలయం సహాయంతో పరిష్కరించుకుంటున్నామని తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు ఆ అభివృద్ధి పనులను తామే చేస్తున్నట్లు చిత్రీకరించి వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేస్తున్నారని, దీంతో గ్రూపులో మూడు నాలుగు వర్గాలు తయారై విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌బీటీనగర్‌ను మరో బంగ్లాదేశ్‌గా మారుస్తున్నారంటూ మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో తాము విసిగిపోయి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. కాగా, హౌస్ ఓనర్స్ గ్రూప్ సభ్యులను దుర్భాషలాడుతూ సమీపంలో ఉన్న ఓ గ్రూపు మెంబర్ ఇంటిపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఆమె అనుచరులు దాడికి యత్నించారని, చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 ఎన్‌బీటీనగర్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా బస్తీలో ఎలా తిరుగుతారంటూ మేయర్ పలువురిని దుర్భాషలాడారని, అంతుచూస్తా అని బెదిరించారని, జీహెచ్‌ఎంసీ ద్వారా కూల్చివేయిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పాత కస్టమర్ పేరిట రూ.లక్ష దోపిడీ

వెంగళరావునగర్: పాత క్లయింట్ పేరుతో ఫోన్ చేసి న్యూమరాలజిస్ట్ నుంచి నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వెంగళరావు నగర్‌లో నివాసం ఉండే అప్పారావు సంఖ్యాశాస్త్రం చెబుతుంటాడు. ఈ నెల 6వ తేదీన అమెరికాలో నివసించే దేవిరెడ్డి కార్తికేయ అనే తన పాత క్లయింట్ పేరుతో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. తనకు అర్జంటుగా రూ.50 వేలు కావాలని అడిగాడు. దాంతో అప్పారావు వాటిని పంపాడు. మరో గంటలో ఇంకో రూ.50 వేలు పంపాలని కోరగా వాటిని కూడా పంపించాడు. 8వ తేదీ మరోసారి నగదు పంపాలని అడగటంతో అప్పారావుకు అనుమానం వచ్చి అది సైబర్ మోసమని గ్రహించాడు. దాంతో బాధితుడు ఎన్‌సీఆర్‌పీకి తెలియజేసి గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్లను అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

వెంగళరావునగర్ : గ్యాస్ సిలిండర్లు అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. స్థానిక యాదగిరినగర్‌లో అక్రమంగా గ్యాస్ నింపుతూ సిలెండర్లు విక్రయిస్తున్నారని పోలీసులకు గుర్తుతెలియని వ్యక్తి సమాచారం అందించాడు. దాంతో పోలీసులు ఆ ప్రాంతంలో మాటువేశారు. గురువారం పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లగా ఎ.బాలాజీ అనే వ్యక్తి వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతనిని పట్టుకుని విచారించగా వివరాలు తెలియజేశాడు. గుట్టుచప్పుడు కాకుండా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుంటానని తెలిపాడు. కాగా, అతని వద్ద ఉన్న 3 హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లు, 4 చిన్న ఫుల్ సిలిండర్లు, 7 ఖాళీ చిన్న సిలిండర్లు, వెయింగ్ మిషన్, రీఫిల్లింగ్ కిట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న సూత్ర లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్


సూత్ర ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నటి శుభశ్రీ రాయగురు, మోడల్స్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో సూత్ర లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. గురువారం ఈ ఎగ్జిబిషన్‌ను నటి శుభశ్రీ రాయగురుతోపాటు పలువురు మోడల్స్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రాఖీ పండుగతోపాటు తీజ్ పండుగ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక కలెక్షన్స్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన పేరుగాంచిన డిజైనర్లు రూపొందించిన దుస్తులు, ఆభరణాలు ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.

డబ్బు లేదని చదువు ఆపొద్దు: ప్రతాప్‌రెడ్డి


నిరుపేద విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

వెంగళరావునగర్: చదువుపట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు కేవలం డబ్బు లేదని అర్ధాంతరంగా విద్యను నిలిపివేయవద్దని, అలాంటి వారిని ఆదుకోవడంలో మధురానగర్ ముందుంటుందని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.ప్రతాప్‌రెడ్డి అన్నారు. మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్‌లో కాలనీకి చెందిన నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు, ప్రొఫెసర్ జయశంకర్ పేర్ల మీద వారి జ్ఞాపకార్థం దాదాపు 149 మంది విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి విజయవాణి, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ హనుమంతరావు, కోశాధికారి సుగుణ, సభ్యులు, జీవితకాల సభ్యులు, మాజీ నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై ఎన్‌ఎస్‌ఎస్ అవగాహన


కేబీఆర్ పార్కు సిగ్నల్ వద్ద సుల్తాన్ ఉలూం ఫార్మసీ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

బంజారాహిల్స్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగర పోలీసులతో కలిసి బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉలూం కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గురువారం ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తాజ్‌కృష్ణా, కేబీఆర్ పార్కు, జూబ్లిహిల్స్ చెక్‌పోస్టు, బంజారాహిల్స్ రోడ్ నెం. 1/10 సిగ్నళ్ల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాహనదారులకు పలు సూచనలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని, ప్రతీ ఒక్కరూ స్టాప్‌లైన్‌కు ముందే ఆగాలని, హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

ఖైరతాబాద్ మండలానికి కలెక్టర్ అవార్డు


కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్

బంజారాహిల్స్: పచ్చదనం-పరిశుభ్రత, పౌరులకు మంచినీటితోపాటు కనీస సౌకర్యాలు అందిస్తున్నందుకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ తహసీల్దార్ ఎండీ నయీముద్దీన్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. క్లీనింగ్, పౌరులకు సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో వివిధ మండలాలకు మార్కులు కేటాయించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో ఖైరతాబాద్ మండలానికి 85 మార్కులు వచ్చాయి. మండలానికి వచ్చే పౌరుల సంతృప్తిని పరిగణలోనికి తీసుకుని ఈ అవార్డు అందజేశారు.

గణేష్ ఉత్సవ సమితి జూబ్లీహిల్స్ కన్వీనర్‌గా లక్ష్మణ్


లక్ష్మణ్

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా రహమత్‌నగర్ డివిజన్ బీజేపీ నాయకుడు తంగెళ్లపెల్లి లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ మేరకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి బి.రాజవర్ధన్‌రెడ్డి గురువారం నియామక పత్రాన్ని లక్ష్మణ్‌కు అందజేశారు. త్వరలోనే జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేస్తానని లక్ష్మణ్ తెలిపారు.

దాడి చేశారంటూ బీజేపీ నాయకురాలి ఫిర్యాదు


ఫిర్యాదు చేయడానికి బంజారాహిల్స్ ఠాణాకు వచ్చిన బస్తీవాసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ బస్తీలో ఓ వాట్సాప్ గ్రూప్‌లో తాను ఏదో పోస్టు చేశానంటూ గురువారం ఉదయం కొంతమంది మహిళలు తన ఇంటికి వచ్చి దాడి చేశారని బీజేపీ నాయకురాలు పావని గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను తిట్టడమే కాకుండా కొట్టారని, వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా తన ఇంటి పైకి వచ్చి దాడి చేశారని మనస్తాపానికి గురైన పావని నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించారు. దీంతో ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం మహావీర్ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా 'స్వాతంత్ర్య' వేడుకలు


జవహర్‌నగర్‌లో కార్పొరేటర్ దేదీప్య విజయ్...

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీసాయి సరస్వతీ విద్యానికేతన్ స్కూల్‌లో చైర్‌పర్సన్ శిరీష భవానీ శంకర్ జాతీయ జెండా ఎగురవేశారు. జవహర్‌నగర్‌లో కార్పొరేటర్ దేదీప్య విజయ్, వెంగళరావునగర్ కాలనీలో డాక్టర్ పి.వి.రవిశేఖర్ రెడ్డి, వెంకటగిరిలో బీఆర్‌ఎస్ సీనియర్ నేతలతో మాజీ ఎమ్మెల్యే విష్ణు తదితరులు జాతీయ జెండాలను ఎగురవేశారు.

హిమాయత్‌నగర్‌లో...

కాచిగూడ: భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కె.నర్సింగ్ ముదిరాజ్, ఇంద్రసేనారెడ్డి, పి.ప్రసాద్, శ్రీధర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో పంద్రాగస్టు వేడుకలు



లక్డీకాపూల్: నిమ్స్ ఆసుపత్రిలో స్వాతంత్ర్య దినోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. నిమ్స్ సంచాలకుడు నగరి బీరప్ప జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. నిమ్స్ సాధించిన ప్రగతి, నిమ్స్‌కు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును వివరించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, డీన్ లిజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతి వీర్, ప్రొ.సాయిసతీష్, ప్రొ.గంగాధర్, వైద్యులు కృష్ణారెడ్డి, లక్ష్మీ భాస్కర్, మార్తా రమేష్, పారామెడికల్, వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉత్తమ సేవలందించిన వైద్యులు, సిబ్బందికి నిమ్స్ డైరెక్టర్ పురస్కారాలను ప్రదానం చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

రహమత్‌నగర్: పంద్రాగస్టు దినోత్సవాల్లో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఎస్పీఆర్ హిల్స్‌లో రెడ్‌రోజ్ హైస్కూల్ విద్యార్థులు భారతమాత, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ వేషధారణలలో అబ్బురపరిచారు. అనంతరం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన చిన్నారులకు పాఠశాల చైర్మన్ నీల రమేశ్‌గౌడ్ బహుమతులు అందజేశారు. ఇదే ప్రాంతంలోని సాయి దీను స్కూల్లో చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలు, నాటికలు ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ డాక్టర్ మల్లేశ్ యాదవ్, కరస్పాండెంట్ అదిల్ ఖాన్ తదితరులు విద్యార్థులను ప్రశంసించారు.

నేటి నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం

కాచిగూడ: హిమాయత్‌నగర్‌లోని వాసన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మెగా సూపర్ స్పెషాలిటీ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ చీఫ్ సర్జన్ డాక్టర్ ఖలీద్ లతీఫ్ తెలిపారు. ఉచిత కంటి పరీక్షలతోపాటు రోగులకు ఉచిత కన్సల్టేషన్ సర్వీసును అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ 040-45021763, సెల్: 9182906022లో సంప్రదించాలని సూచించారు.

రాచకొండ కమిషనరేట్‌లో..



నేరెడ్‌మెట్‌లోని రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ జి.సుధీర్‌బాబు జెండా ఆవిష్కరించారు. డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ క్రైం అరవింద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏలో..



ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో జరిగిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా అధికారులు, ఎంవీఐలు, కానిస్టేబుళ్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఉత్తమ సేవలు అందజేసిన హోంగార్డులకు జేటీసీ గోల్డ్‌మెడల్స్ అందజేశారు. –సాక్షి, సిటీబ్యూరో

సైబరాబాద్ కమిషనరేట్‌లో..



సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ అవినాష్ మహంతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాయింట్ సీపీ ట్రాఫిక్ డీ జోయల్ డేవిస్, డీసీపీ క్రైమ్స్ కే.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

జలమండలిలో..



జలమండలిలో స్వాతంత్య్ర దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. రెవెన్యూ డైరెక్టర్ వీఎల్.ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, సీజీఎంలు, యూనియన్ నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో

పవర్ గ్రిడ్‌లో..



సాక్షి, సిటీబ్యూరో: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సదరన్ రీజియన్‌లో స్వాతంత్య్ర దిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. సంస్థ సికింద్రాబాద్ రీజియన్ చీఫ్ జనరల్ మేనేజర్ ఇన్‌చార్జి అఖిలేష్ పాఠక్, హెచ్ఆర్ సీజీఎం అరుణ్‌కుమార్, అసెట్ మేనేజ్‌మెంట్ సీజీఎం ఎంవీ నానాజీ, ఫైనాన్స్ సీజీఎం వెంకట ఎస్‌వీ తదితరులు పాల్గొన్నారు.



ప్రగతి పథంలో దక్షిణమధ్య రైల్వే

జీఎం అరుణ్‌కుమార్ జైన్

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వేలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలో జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. వేడుకల్లో రైల్వే సీనియర్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, రైల్వే కుటుంబ సభ్యులతో పాటు రైల్వే పాఠశాల, రైల్వే కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. జీఎం మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం జూలై వరకు రూ.6,894 కోట్ల స్థూల ఆదాయాన్ని ఆర్జించినట్లు వెల్లడించారు.

హెచ్ఎండీఏలో..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రధాన కార్యాలయంలో గురువారం 78వ స్వాతంత్య్ర దిన వేడుకలు ఘనంగా జరిగాయి. కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ ఎస్‌వీ. ప్రదీప్ కుమార్ శెట్టి, సెక్రెటరీ చంద్రయ్య, చీఫ్ ఇంజినీర్ పరంజ్యోతి, ప్లానింగ్ డైరెక్టర్లు కె.విద్యాధర్, ఎం.రాజేంద్రప్రసాద్ నాయక్, ఎస్టేట్ ఆఫీసర్ జి.వీరారెడ్డి, ఓఎస్డీ కె.చంద్రారెడ్డి, హుమ్టా ఎండీ బి.జీవన్‌బాబు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఏసీబీ ప్రధాన కార్యాలయంలో..



ఏసీబీ ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం పతకాలు పొందిన అధికారులు, సిబ్బందితో ఏసీబీ డీజీ సీవీ ఆనంద్

'చిరంజీవి' బ్లడ్‌బ్యాంకులో..



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ అథారిటీ(హైడ్రా) కమిషనర్‌గా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు సమీపంలోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో గురువారం జరిగిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిరంజీవితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. హైడ్రా కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి రంగనాథ్ హాట్ టాపిక్‌గా మారారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలు, ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలు తదితర పరిణామాలతో ఆయన మరింత సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ అయ్యారు.

మంచి పని.. శెభాష్..: ఆకునూరి మురళి

మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి 'ఎక్స్' వేదికగా రంగనాథ్‌ను అభినందిస్తూ పోస్టు చేశారు. 'మంచి పని చేస్తున్నారు శెభాష్ రంగనాథ్ గారూ.. గో ఎహెడ్. మన ప్రజాప్రతినిధులు చాలా మంది టికెట్ ఫర్ గ్రాంటెడ్‌గా తీసుకుని ప్రభుత్వ, చెరువు శిఖం భూములను ఆక్రమిస్తున్నారు. గత పాలకులు మేము తింటాము.. మీరు తినండి అని అందరినీ దొంగలుగా మార్చారు. లక్షల కోట్ల విలువ చేసే భూములతో పాటు ప్రాణాలు రక్షించే చెరువులను కాపాడుకోవాలి. భవిష్యత్తు తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలి. సీఎం గారూ హైడ్రాను మరింత బలోపేతం చేసి రాష్ట్రం మొత్తానికి విస్తరించండి. ప్రభుత్వ భూములు, చెరువులను కాపాడండి. రంగనాథ్ గారూ మనం ట్రాన్స్పరెంట్‌గా ఉండటమే కాదు.. అలా ఉన్నట్లు చూపించాలి (దిల్ ఈజ్ ఏన్ అడ్మినిస్ట్రేటివ్ టిప్ టు యూ)' అంటూ ఆకునూరి 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.

కెనరీ దా స్కూల్‌లో..



మియాపూర్: మియాపూర్ మదీనాగూడలోని కెనరీ దా స్కూల్‌లో 78వ స్వాతంత్య్ర దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ప్రముఖ క్రీడాకారిణి నైనా జైస్వాల్, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ అరవింద్‌రెడ్డి, చైర్ పర్సన్ శ్వేతారెడ్డితో కలిసి హాజరై జెండాను ఆవిష్కరించారు. పాఠశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు.

బీఐఎస్‌లో..



సాక్షి, సిటీబ్యూరో: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హైదరాబాద్ శాఖ కార్యాలయంలో స్వాతంత్య్ర దిన వేడుకలు ఘనంగా జరిగాయి. మౌలాలిలోని శాఖ కార్యాలయంలో శాఖాధిపతి, డైరెక్టర్ పీవీ శ్రీకాంత్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

ఉన్నత విద్యా మండలిలో..

ఉన్నత విద్యా మండలి కార్యాలయ ప్రాంగణంలో మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కే మహమూద్, సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, జాయింట్ సెక్రటరీ సీఎస్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



నగర పోలీసుల ఆధ్వర్యంలో..



టీజీ సీసీసీ ప్రాంగణంలో..

సాక్షి, సిటీబ్యూరో: స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో గురువారం నగర పోలీసు అధికారులు జెండా ఆవిష్కరించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్–12లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్(టీజీ సీసీసీ) ప్రాంగణంలో సంయుక్త సీపీ(పరిపాలన) డాక్టర్ గజరావ్ భూపాల్ జాతీయ జెండా ఎగురవేశారు. నాంపల్లిలోని ట్రాఫిక్ కమిషనరేట్‌లో డీసీపీ రాహుల్ హెగ్డే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఇతర ఉన్నతాధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



నాంపల్లిలోని ట్రాఫిక్ కమిషనరేట్‌లో..

విద్యుత్‌సౌధలో..

విద్యుత్ సౌధలో జాతీయ పతాకాన్ని ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల ఇన్‌చార్జి సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు తదితరులు ఆవిష్కరించారు.



ఉత్తమ అవార్డులు



ఉత్తమ సేవలకు కలెక్టర్ అనుదీప్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న డీపీఆర్ఓ మహ్మద్ కలీమ్



కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ సీసీ వెంకట్రామ్‌రెడ్డి



కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న నిమ్స్ ఉద్యోగి సత్యగౌడ్

మెట్రో రెండో దశపై త్వరలో డీపీఆర్

హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండో దశపై రూపొందించిన డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక)ను త్వరలో ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ నివేదికపై ప్రభుత్వ ఆమోదం లభించిన అనంతరం కేంద్రానికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బేగంపేట్‌లోని మెట్రో భవన్‌లో 78వ స్వాతంత్య్ర దిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్వీఎస్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. హైదరాబాద్ మహానగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వివిధ మార్గాల్లో మెట్రో రెండో దశ ప్రాజెక్టును ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్, చాంద్రాయణగుట్ట మీదుగా ఎయిర్‌పోర్టు వరకు, ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి నుంచి హైకోర్టు నూతన భవనం, మియాపూర్ నుంచి బీహెచ్ఈఎల్, రాయదుర్గం నుంచి అమెరికన్ కాన్సులేట్, కోకాపేట్ తదితర మార్గాల్లో 78 కిలో మీటర్లకు పైగా మెట్రో రెండో దశకు ప్రణాళికలను రూపొందించిన సంగతి తెలిసిందే. నాలుగో సిటీగా ప్రతిపాదించిన ముచ్చర్ల వరకు కూడా మెట్రోను పొడిగించనున్నట్లు ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు రెండో దశ ప్రాజెక్టుపై రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను త్వరలో ప్రభుత్వానికి అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేడుకల్లో హెచ్ఎంఆర్ఎల్ సీనియర్ అధికారులు ఆనంద్‌మోహన్, విష్ణువర్ధన్ రెడ్డి, బీఎన్ రాజేశ్వర్, ఎ.బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎఫ్‌టీసీసీఐలో..

సాక్షి, సిటీబ్యూరో: వాణిజ్య పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తున్న ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణా ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ కేంద్ర కార్యాలయంలో సంఘం అధ్యక్షురాలు డాక్టర్ జి.నిర్మల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



సాక్షి ప్రధాన కార్యాలయంలో..



బంజారాహిల్స్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్లు ఏఎల్ఎన్ రెడ్డి, వైఈపీ రెడ్డి తదితరులు

మార్చి 7 నుంచి వరకు పెపెక్స్‌పో 2025

పేపరస్ ఎక్స్‌పో ఎల్ఎల్‌సీ ఇండియా సీఈఓ నిర్మల్ కుహాద్



పేపరస్ ఎక్స్‌పో ఎల్ఎల్‌సి ఇండియా సీఈఓ నిర్మల్ కుహాద్ తదితరులు

మాదాపూర్: దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ప్రదర్శన పేపర్ ఎక్స్‌పో అని పేపరస్ ఎక్స్‌పో ఎల్ఎల్‌సీ ఇండియా సీఈఓ నిర్మల్ కుహాద్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో గురువారం పేపరస్ ఎక్స్‌పో ఎల్ఎల్‌పీ ఇండియా సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో పెపెక్స్‌పో–2025కు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ వాడకం లేకుండా జీవన విధానాన్ని ఊహించలేమన్నారు. పేపర్ పరిశ్రమకు సంబంధించిన అన్ని విభాగాల నిర్వాహకులు పాల్గొననున్నట్లు తెలిపారు. ప్యాకేజింగ్, టెక్నాలజీ, ప్రాసెసింగ్ వంటి రంగాల స్టాల్స్ అందుబాటులో ఉంటాయన్నారు. పేపర్ రంగంలో వస్తున్న నూతన మార్పులు, టెక్నాలజీ విశేషాలను పరస్పరం పంచుకోనున్నట్లు చెప్పారు. పేపరస్ ఎక్స్‌పో ఎల్ఎల్‌పీ ఇండియా సీఓఓ దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చే ఆదాయంలో పేపర్ ఫౌండేషన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వివిధ సంస్థల నిర్వాహకులు అరవింద్‌శర్మ, బీ.ఆర్ రావు, హిరన్‌కారియా, రాజీవ్ అగర్వాల్, విమల్‌చంద్ జైన్, పి.రాజేశ్‌జైన్, రంజిత్‌జైన్, అంచల్ కొఠారి తదితరులు పాల్గొన్నారు.



పార్సీల నూతన సంవత్సర వేడుకలు సికింద్రాబాద్‌లో ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఎంజీ రోడ్డులోని ఫైర్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు చేశారు. ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని పార్సీలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన వింటేజ్ కార్ల ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది.
- రాంగోపాల్‌పేట్

పార్సీల నూతన సంవత్సర వేడుకలు





శ్రావణ శోభ

లక్ష్మీపూజ..

తెలుగింటి ఆడపడుచుల పండుగ

నగర జీవనంలో ఎక్కువగా పాశ్చాత్య సంస్కృతే కనిపిస్తుంటుంది. ఆధునిక పోకడలతో మనవైన సంప్రదాయాలను పక్కనపెట్టేస్తున్నారు అనుకునే వారి ఆలోచనలకు నగరవాసులు ఎప్పుడూ కొత్త అర్థాలను చెబుతూనే ఉన్నారు. తెలుగింటి ఆడపడుచులు అత్యంత భక్తి శ్రద్ధలతో, సాంప్రదాయ బద్ధంగా ఆచరించే వేడుకలలో మొట్టమొదటి వేడుక శ్రావణ మాసంలో నిర్వహించే వరలక్ష్మీ పూజ. నెల రోజుల పాటు ప్రతి శుక్రవారం సాంప్రదాయ వస్త్రధారణతో చూడముచ్చటగా అలంకరించుకుని.. తెలుగింటి వంటలు ప్రసాదాలుగా చేసి, పచ్చని తోరణాలతో, పుష్పాలతో అమ్మవారి అలంకరణలో వైభవంగా తమదైన సృజనకు మెరుగులు దిద్దుతున్నారు.
- సాక్షి సిటీబ్యూరో

వరి కంకుల తోరణాలతో ప్రత్యేకం

క్రియేటివిటీకి సోషల్ మీడియా గైడ్

ఆర్గానిక్ వస్తువులకే ప్రాధాన్యత

యువతలోనూ పెరిగిన ఆసక్తి

పర్యావరణ అలంకరణ..

మట్టి లేదా ఇత్తడి పాత్రలో నీళ్లు నింపి, పువ్వులతో అలంకరించి, వాటి మధ్యలో అమ్మవారిని ఏర్పాటు చేస్తున్నారు. లిల్లి, నందివర్థనం, మల్లెలు, తెల్ల చామంతి, తామర పువ్వులతో పాటు డెకార్ పువ్వులను కూడా వాడుతున్నారు. వాడిన ప్రతి వస్తువునూ రీ సైక్లింగ్ విధానంతో పర్యావరణ అనుకూలంగా మార్చుతున్నారు.

భక్తిని అలంకరిస్తే ఎంత అందంగా ఉంటుందో వరలక్ష్మీ వ్రతం రోజున ఇంటి కళను బట్టి తెలిసిపోతుంది. వారం పది రోజుల ముందు నుంచే అమ్మవారి అలంకరణకు కావాల్సిన వస్తువుల ఎంపిక మొదలవుతుంది. వీటిని పూజా స్టోర్స్, ఆన్‌లైన్, జనరల్ స్టోర్స్, బేగం బజార్, డెకార్ ప్లేస్‌లకు వెళ్లి నచ్చినవి ఎంపిక చేసుకోవడం ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. ఒక్కో డిజైన్ సెట్‌కి సాధారణంగా 2 నుంచి 10 వేల రూపాయల వరకూ ఖర్చు చేస్తున్నారు. పెళ్లి లాంటి వేడుకలకే కాదు పండగల్లోనూ కలర్‌ఫుల్ థీమ్‌తో చేసే అలంకరణలో మహిళలు తమదైన ప్రత్యేకతను చూపుతున్నారు.

తోరణపు కళ.. బ్యాక్ డ్రాప్స్..

నెగిటివ్ ఎనర్జీని తీసేసి ఇంటికి శోభని, శుభాన్ని కలుగజేసే వరి తోరణాలతో పాటు ఎంబ్రాయిడరీ చేసిన డిజైనర్ తోరణాలనూ అలంకరణకు ఉపయోగిస్తున్నారు. అమ్మవారి వెనకాల బ్యాక్ డ్రాప్‌లో వాడుకోవడానికి ఐదారు అడుగుల ఎత్తున్న ఫ్రేమ్‌లు రకరకాల మోడల్స్‌లో అందుబాటులోకి వచ్చాయి. పచ్చని కళ రావాలంటే విస్తరాకులు, కొబ్బరి ఆకులు, తమలపాకులు, ఇలా ఏదైనా ఆకులతో చేసే బ్యాక్ డ్రాప్‌ను వాడుతున్నారు. పట్టు చీరలు, ఇండోర్ మొక్కలు, రాగి, ఇత్తడి పాత్రలు అలంరకణలో చేరాయి.



ముందే అడిగి..



ఐదేళ్ల క్రితం అమ్మవారి అలంకరణ వస్తువులు ఎక్కడ దొరుకుతాయి, ఎవరు డెకరేట్ చేస్తారు అని వెదికేవారు. అలా మేం పది హేనేళ్లుగా వరలక్ష్మీ పూజలకు డెకరేట్ చేస్తున్నాం. ఇప్పుడు సోషల్‌మీడియాలోని వీడియోలు చూసి సొంతంగా ఎవరికి వారు క్రియేటివిటీకి పదును పెడుతున్నారు. వారి సొంతంగానే డిజైన్ చేసుకుంటున్నారు. ఈ ఆలోచన వల్ల ఆన్‌లైన్ మార్కెట్ కూడా బాగా పెరిగింది. యువత తమ భక్తిని చాలా అందంగా చూపుతున్నారు. ఎలాంటి డిజైన్స్ కావాలో ముందే అడిగి మరీ అలంకరణ చేయించుకుంటున్నారు. - కల్పనారాజేష్, డెకార్ బై కృష్ణ

ఆర్గానిక్ మెటీరియల్స్..



నా ఎంపిక ప్రతి వస్తువూ తిరిగి ఉపయోగించుకునేలా ఉంటుంది. బ్యాక్‌డ్రాప్‌కి తాజా పువ్వులు వాడతాం. అమ్మవారికి కట్టే చీర హ్యాండ్లూమ్‌దే ఎంచుకుంటాం. తిరంగా స్టైల్‌లో అమ్మవారి అలంకరణ చేశాను. అమ్మవారికి ముఖం, కాళ్లూ చేతులు కొని పెట్టి, వాటిని మొత్తం సెట్ చేసి, మేమే అలంకరిస్తాం. తాంబూలాన్ని వస్త్రంతో చేసిన బ్యాగ్‌లో/ తాటాకు బుట్టలలో పెట్టి ఇస్తుంటాం. ప్రతి వస్తువూ ఆర్గానిక్‌గా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటాం. - ప్రతిమ, వైష్ణవి రాపర్తి, వెస్ట్‌మారేడుపల్లి

పాజిటివ్ వైబ్రేషన్స్...



బిజీ జీవనంలోనూ అమ్మవారి పూజ ప్రత్యేకంగా అనిపిస్తుంది. కొన్ని రోజులు ముందునుంచే అమ్మవారి అలంకరణకు సంబంధించిన వస్తువులను ఎంపిక చేసుకోవడం, వీలైనంతగా ముందురోజే సిద్ధం చేసుకోవడం జరుగుతుంటుంది. ప్రతియేటా ఒక ప్రత్యేకమైన కళ తీసుకురావడానికి ప్రయత్నిస్తుంటాం. పిల్లలు కూడా ఈ పనిలో భాగం అవుతుంటారు. ఈ విధానం వల్ల వారిలో సృజన పెరుగుతుంది, భక్తి కూడా అలవడుతుంది. - డాక్టర్ శిరీషారెడ్డి, తార్నాక



పోలో, రైడింగ్ పోటీలు

సాక్షి, సిటీబ్యూరో: స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో హైదరాబాద్ పోలో, రైడింగ్ ఆధ్వర్యంలో క్లబ్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించారు. నగర శివార్లలోని అజీజ్ నగర్ వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలికల అండర్ 14 స్విమ్మింగ్ విభాగంలో పూర్వి కస్సాం, పురుషుల 21 ఏళ్ల విభాగంలో కున్వర్ కుషాల్ సింగ్ గోల్డ్ మెడల్స్ పొందారు. జూనియర్ హక్స్‌గా దీప్ కుక్రేటి, సీనియర్ హక్స్‌గా అభినవ్‌లు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు.



స్ట్రోమ్ వచ్చాక సంతోషం వచ్చింది..

- విజయ్ దేవరకొండ

బంజారాహిల్స్: స్ట్రోమ్ (విజయ్ దేవరకొండ పెంపుడు కుక్క పేరు) వచ్చాక మా ఇంట్లో ఎంతో ఆనందం వచ్చిందని సినీ హీరో విజయ్ దేవరకొండ అన్నారు. జూబ్లీహిల్స్‌లో నూతనంగా నెలకొల్పిన సెవన్ ఓక్స్ పెట్ హాస్పిటల్‌ను విజయ్ తన సోదరుడు ఆనంద్ దేవరకొండతో కలిసి ప్రారంభించారు. మా ఇంట్లో మొదట్లో పెట్స్ అంటే ఇష్టం ఉండేది కాదని, కానీ మా అమ్మా నాన్నకు నచ్చజెప్పి స్ట్రోమ్ గాడిని తెచ్చుకున్నామని, ఇప్పుడు మాకంటే మా పేరెంట్స్ స్ట్రోమ్ గాడితోనే ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారని విజయ్ అన్నారు. షూటింగులలో ఎంతో బిజీగా ఉండి, ఒత్తిడిలో ఇంటికి రాగానే స్ట్రోమ్ గాడి అల్లరితో అంతా మర్చిపోతామన్నారు. పెట్స్‌ను పెంచడమంటే మామూలు విషయం కాదని, ఇంట్లో ఒక చిన్న బేబీని చూసినంత పని ఉంటుందని, అంత కేర్ తీసుకునే ఓపిక ఉన్న వాళ్లు మాత్రమే పెట్స్‌ను పెంచుకోవాలని సూచించారు. సెవన్ ఓక్స్ పెట్ హాస్పిటల్ నిర్వాహకులు సంధ్య, శ్రీరెడ్డి పాల్గొన్నారు.



కింగ్స్ కలెక్షన్..



నిజాం కాలం నాటి కరెన్సీకి డిమాండ్

దగ్గరుంటే బర్కత్ ఉంటుందని ప్రజల విశ్వాసం

అప్పటి వెయ్యి రూపాయలకు..

రూ.5 లక్షల వరకు డిమాండ్

కొంత మందికి హాబీ.. మరికొంత మందికి ఉపాధి

అరుదైన కరెన్సీ, కాయిన్స్ ఎగ్జిబిషన్..

17 వరకూ ఉర్దూ ఘర్‌లో ప్రదర్శన



నిజాం కరెన్సీతో పాటు బ్రిటిష్ కరెన్సీకి ఇప్పటికీ డిమాండ్ ఉంది. అరుదైన కాయిన్స్, కరెన్సీ ఎగ్జిబిషన్ పాత బస్తీ మొఘల్‌పురాలోని ఉర్దూ ఘర్‌లో గురువారం ఉదయం ప్రారంభమైంది. ఈ నెల 17 వరకూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ కొనసాగనుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఏపీజే అబుల్ కలాం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతోంది. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రపంచ వ్యాప్తంగా 50 దేశాలకు సంబంధించిన పురాతన నాణేలు, నోట్లు అందుబాటులో ఉంచారు. మన వద్ద ఉన్న పురాతన కరెన్సీని ఇక్కడ విక్రయించ వచ్చు.. అలాగే తమకు నచ్చినవి కొనుక్కోవచ్చు. వాటికున్న చారిత్రక ప్రాధాన్యత, ప్రాముఖ్యతను బట్టి ధరలు ఉన్నాయి.

ఇప్పటి తరం విద్యార్థులకు ఒకప్పటి సిల్వర్(అల్యూమినియం)తో తయారైన ఒక్క పైసా, రెండు పైసలు, మూడు పైసలు, ఐదు పైసలు ఎలా ఉంటాయో తెలీదు. ఒకటి నుంచి ఐదు వరకూ.. మధ్యలో నాలుగో పైసా ఉండదనే విషయం కూడా తెలిసి ఉండదు. తూటు పైసతో పాటు వెండి, బంగారు నాణేలు సైతం చూడని వారున్నారు. వీరందరి సౌకర్యార్థం పాతబస్తీ మొగల్‌పురాలోని ఉర్దూ ఘర్‌లో పురాతన నాణేలు, కరెన్సీతో పాటు పురాతన వస్తువులతో కూడిన ప్రత్యేక ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంది. అల్ ఇండియా చార్మినార్ ఎగ్జిబిషన్ ఆఫ్ కాయిన్స్ అండ్ కరెన్సీ ఇన్ హైదరాబాద్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను బీఎస్ఎన్ఎల్ మాజీ సీటీఎస్ ముంతాజ్ హుస్సేన్ ప్రారంభించారు.
- చార్మినార్



నాటి కరెన్సీతోనే..

నాటి కరెన్సీతో నిజాం నవాబులు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులూ లేకుండా దాన, ధర్మాలతో పాటు భారీ భవనాలను నిర్మించారని పలువురి విశ్వాసం. అందుకే నాటి వెయ్యి రూపాయలకు రూ.5 లక్షల వరకూ డిమాండ్ ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇటీవల జర్మనీకి చెందిన ఓ వ్యక్తి రూ.5 లక్షలు పెట్టి ఖరీదు చేశాడని.. తిరిగి తమకు విక్రయిస్తే.. రూ.5లక్షల 50వేలు ఇస్తామంటున్నా.. ఇవ్వడానికి ఇష్టపడడం లేదని చెబుతున్నారు. ఇది అప్పట్లో లండన్‌లో ముద్రించారని, అందుకే డిమాండ్ అని చెబుతున్నారు.

తూటు పైసా నుంచి ఏక్ అణా వరకూ..

ఇప్పటి తరం వారు చూడని నోట్లు, కాయిన్స్ ఎన్నో ఈ ఎగ్జిబిషన్‌లో ఉన్నాయి. నిజాం కాలం నాటి ఏక్ అణా, దో అణా.. నయా పైసా, తూటు పైసా, సిల్వర్, గోల్డ్ కాయిన్స్ అందుబాటులో ఉన్నాయి. కేవలం కరెన్సీ మాత్రమే కాకుండా అప్పటి పోస్టల్ స్టాంప్స్, బ్యాంకుల్లో వినియోగించిన టెల్లర్ టోకెన్, సిల్వర్, మెటల్, బ్రాంజ్‌తో తయారైన కుళాయిలు, దీపాంతలు..ఇలా అన్ని రకాల పురాతన వస్తువులకూ ఉర్దూ ఘర్ వేదికైంది.

సేకరణకు చక్కటి వేదిక..

నగరంతో పాటు గుంటూరు, ముంబయి, ఢిల్లీ, అకోలా, బెంగళూర్, నాగ్‌పూర్, ఒడిస్సా, బీహార్, చెన్నై, కలకత్తా తదితర ప్రాంతాలకు చెందిన ఏజెన్సీలు పురాతన కరెన్సీ, కాయిన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తున్నారు. పురాతన వస్తువులు సేకరించే హాబీ ఉన్నవారికి ఇది చక్కటి వేదిక.

ఏడాదికోసారి..



ఇలాంటి అరుదైన పురాతన వస్తువుల ఎగ్జిబిషన్ చరిత్రను తెలుపుతుంది. దీని ద్వారా పిల్లలు జ్ఞానాన్ని పొందుతారు. పురాతన వస్తువుల సేకరణ చాలా ఇష్టం. నా దగ్గర ఉన్న పాత కాయిన్స్ విక్రయించడానికి వచ్చాను. ఏడాదికోసారైనా ఇలాంటి ఎగ్జిబిషన్ ఉండాలి. - మహ్మద్ తాహెర్, హసన్‌నగర్

చరిత్రను తెలిపేందుకు..



నాటి చరిత్రను తెలిపేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్ దోహదం చేస్తాయి. అందుకే దేశంలోని అనేక నగరాలకు చెందిన ఏజెన్సీలతో ఇటువంటి అరుదైన చారిత్రక సంపదను ఎగ్జిబిషన్‌లో ఉంచుతున్నాం.. ప్రజలకు చరిత్రను తెలపడంతోపాటు, పలువురు ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు తోడ్పడుతున్నాం. ఇది దేశ సంపద.
- సిరాజుద్దీన్,
ఏపీజే అబుల్ కలాం వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్



థ్రిల్లింగ్ ఇన్‌ఫ్లుయెన్సర్స్ ఛాలెంజ్

- విజేతలకు 3 లక్షల నగదు
- ప్రముఖ సినీనటుడు విశ్వక్‌సేన్

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం సోషల్ మీడియాపై ఆధారపడని వ్యవస్థ, వ్యాపారం ఏదీ లేదని, టాలెంట్ ఎవరి సొత్తూ కాదని ప్రముఖ సినీ నటుడు విశ్వక్‌సేన్ తెలిపారు. నెక్లెస్ రోడ్‌లోని అమ్యూజ్‌మెంట్ థీమ్ పార్క్ 'థ్రిల్ సిటీ' ఆధ్వర్యంలో థ్రిల్లింగ్ ఇన్‌ఫ్లుయెన్సర్స్ ఛాలెంజ్ నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను విశ్వక్‌సేన్ ఆవిష్కరించారు. క్రియేటివిటీ ఫీల్డ్‌లో కొత్తగా ప్రవేశించేవాళ్లు కూడా బ్రహ్మాండంగా రాణించవచ్చని అన్నారు. ఇందులో భాగంగా థ్రిల్‌సిటీ వీడియోలను ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ సోషల్ మీడియా పేజీలో పోస్ట్ చేయాలని కో-ఆర్డినేటర్ బందూక్ లక్ష్మణ్ తెలిపారు. మూడు విభాగాల్లో ఉత్తమ వీడియోలను ఎంపిక చేసి ఒక్కొక్కరికీ లక్ష చొప్పున 3 లక్షల నగదు బహుమతులను అందిస్తున్నామన్నారు.

భీమా కలెక్షన్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని భీమా జ్యువెల్స్ ఆధ్వర్యంలో శ్రావణమాసం ప్రత్యేక కలెక్షన్ ప్రారంభించింది. ఇందులో భాగంగా వినూత్నంగా రూపొందించిన హెరిటేజ్ కలెక్షన్ ను తమ కస్టమర్లతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీమా జ్యువెల్స్ తమ కస్టమర్లను ప్రత్యేకంగా సన్మానించింది.



‘అగ్ని’ తొలి డైరెక్టర్ రామ్ నరైన్ కన్నుమూత



హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచిన క్షిపణి శాస్త్రవేత్త
రేపు మధ్యాహ్నం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త, ‘అగ్ని’ క్షిపణి మిషన్ తొలి ప్రోగ్రామ్ డైరెక్టర్ రామ్ నరైన్ అగర్వాల్ (84) కన్నుమూశారు. వయో సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో ఉన్న స్వగృహంలో మృతి చెందారు. రాజస్తాన్‌లోని జైపూర్‌లో జన్మించిన రామ్ నరైన్.. 1983లో ప్రారంభమైన ‘అగ్ని క్షిపణి’ ప్రోగ్రామ్‌లో చేరారు. ఆ మిషన్‌కు తొలి ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పనిచేసి.. అగ్ని క్షిపణుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. ఆయనను ఫాదర్ ఆఫ్ అగ్ని మిస్సైల్స్‌గా పిలుస్తారు. రామ్ నరైన్ చేసిన సేవలకు 1990లో పద్మశ్రీ, 2000లో పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. శనివారం మధ్యాహ్నం సంతోష్‌నగర్‌లోని నివాసం నుంచి రామ్ నరైన్ అంతిమయాత్ర ప్రారంభం అవుతుందని.. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలను నిర్వహించనున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.

అగ్ని క్షిపణులకు ఆద్యుడు: డీఆర్డీవో మాజీ డైరెక్టర్ సతీశ్‌రెడ్డి

అగ్ని క్షిపణుల అభివృద్ధి, ప్రయోగాలలో రామ్ నరైన్ అగర్వాల్ కీలకపాత్ర పోషించారని డీఆర్డీవో మాజీ డైరెక్టర్ సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పలుచోట్ల క్షిపణి ప్రయోగాల లాంచ్ పాడ్స్ రూపకల్పనలోనూ కీలకంగా పనిచేశారని చెప్పారు. రామ్ కృషి వల్లే ఈరోజు భారతదేశం రక్షణరంగంలో చాలా ముందుందన్నారు. రామ్ నరైన్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని చెప్పారు.

క్లుప్తంగా...

నేడు ‘కన్హా’కు ఉపరాష్ట్రపతి



సాక్షి, న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రెండురోజులు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనాన్ని సందర్శిస్తారని గురువారం ఉపరాష్ట్రపతి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే శనివారం ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో అక్షర విద్యాలయ క్యాంపస్ అండ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్, స్వర్ణభారతి ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్‌లను సందర్శిస్తారు. ఈ సందర్భంగా వెంకటాచలంలో జరిగే స్వర్ణభారతి ట్రస్ట్ 23వ వార్షికోత్సవంలో ధన్‌ఖడ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన కార్యాలయం పేర్కొంది.

పేదరికాన్ని పీ 4తో తరిమేస్తాం

స్వాతంత్య్ర దిన వేడుకల్లో ఏపీ సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: ‘పేదరికం లేని సమాజం మా ప్రభుత్వ విధానం. ఆర్థికంగా ఉన్న వారు అట్టడుగునున్న వారికి చేయూత నివ్వడం ద్వారా పేదరికాన్ని తగ్గించవచ్చు. గతంలో పీ–3 (పబ్లిక్, ప్రైవేటు, పార్ట్‌నర్‌షిప్ విధానంతో సంపద సృష్టించాం. ఇప్పుడు పీ–4 (పీపుల్, పబ్లిక్, ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్)తో పేదరికాన్ని నిర్మూలిస్తాం. పేదరిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తాం’ అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గురు వారం విజయవాడలోని ఇందిరా ప్రియ దర్శిని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 78వ స్వాతంత్య్ర దిన వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు సాయుధ దళాల వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ‘ఇప్పటి వరకు జనాభా నియంత్రణపై దృష్టి పెట్టాం. ఇక నుంచి జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాలి. లేకుంటే వృద్ధుల సంఖ్య పెరిగి పనిచేసే వారి సంఖ్య తగ్గుతుంది. అది దేశ ప్రగతిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.

బాసర ఆలయంలో చోరీ


హుండీ పగలగొట్టిన దొంగలు



కెమెరాకు చిక్కిన అనుమానితుడు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి ఆలయ ఆవరణలో ఉన్న శ్రీదత్తాత్రేయ ఆల యంలో ఉన్న హుండీని దొంగలు పగులగొట్టారు. అంతటితో ఆగకుండా ఆలయానికి సమీపంలో ఉన్న భక్తులకు ప్రసాదం ఇచ్చే గది తలుపులు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. అయితే ఈ దృశ్యాలు రికార్డవుతాయని గుర్తించిన దొంగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఆలయం లోపల, బయట సెక్యూరిటీ సిబ్బంది విధుల్లో ఉన్నా, వారి కళ్లుగప్పి దొంగలు లోనికి ప్రవేశించడం భద్రతా లోపాలను ఎత్తిచూపింది. చోరీ జరిగిన విషయాన్ని ఉదయం గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా అనుమానితుడి ముఖం అందులో రికార్డు అయింది. దీని ఆధారంగా విచారణ జరుపుతున్నారు. అనుమానితుడు మహారాష్ట్ర వాసిగా భావిస్తున్నారు.

విషజ్వరంతో విద్యార్థి మృతి



ఊరడి రంజిత్ (ఫైల్)

సదాశివనగర్ (ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లిలో విషజ్వరంతో ఊరడి రంజిత్ (9) మృతి చెందాడు. రంజిత్ 4వ తరగతి చదువుతున్నాడు. రెండ్రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న బాలుడిని గురువారం మధ్యాహ్నం గాంధారి ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. గ్రామంలో వారం రోజులుగా విష జ్వరాలు సోకి అనేక మంది బాధపడుతున్నారని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదని గ్రామస్తులు వాపోయారు. బాధ్యులైన వైద్యాధికారులను, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయాలని బీజేపీ నేత రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు.

3 ప్రాజెక్టులను ఆదుకున్న ‘ఎల్లంపల్లి’



వరదకాల్వ ద్వారా తరలుతున్న ఎల్లంపల్లి జలాలు

ఎల్లంపల్లి టు రంగనాయకసాగర్ వయా మిడ్‌మానేరు • ఎత్తిపోతలతో తరలిన 20 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): నిన్నటిదాకా నీరు లేక వెలవెలబోయిన మిడ్‌మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్ ప్రాజెక్టులు ప్రస్తుతం జలకళ సంతరించుకున్నాయి. ఎల్లంపల్లి జలాలు ఎత్తిపోతల ద్వారా వస్తుండడంతో మూడు ప్రాజెక్టుల్లో నీటినిల్వలు పెరిగాయి. బోయినపల్లి మండలం మాన్వాడ శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టులోకి శ్రీపాద ఎల్లంపల్లి జలాలు గాయత్రీ పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతల ద్వారా చేరుతున్నాయి. మిడ్‌మానేరులో 17 టీఎంసీల మేర నీరు చేరిన తర్వాత ఇల్లంతకుంట మండలం అన్నపూర్ణ ప్రాజెక్టు ప్యాకేజీ–10లోకి.. అక్కడి నుంచి సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ప్రాజెక్టు–11లోకి నీరు విడుదల చేస్తున్నారు. ఎత్తిపోతలతో ఎల్లంపల్లి జలాలు నంది పంప్‌హౌస్ నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌కు చేరుకుంటున్నాయి. అక్కడి నుంచి వరదకాల్వ మీదుగా రాజన్నసిరిసిల్ల జిల్లా మిడ్‌మానేరుకు, అక్కడి నుంచి అన్నపూర్ణతోపాటు సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు తరలుతున్నాయి. కడెం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరదనీరు భారీగా చేరడంతో గత జూలై 27వ తేదీ నుంచి రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి వరదకాల్వ ద్వారా మిడ్‌మానేరుకు నీటి విడుదల కొనసాగుతోంది.

మిడ్‌మానేరు టు అన్నపూర్ణ.. రంగనాయకసాగర్

మిడ్‌మానేరు నుంచి ఇల్లంతకుంట మండలం అన్నపూర్ణ ప్రాజెక్టులోకి నీరు విడుదల చేస్తున్నారు. అన్నపూర్ణ పూర్తి నీటిమట్టం 3.50 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.60 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. మిడ్‌మానేరు అప్రోచ్ కెనాల్ నుంచి అన్నపూర్ణ ప్రాజెక్టుకు ఈనెల 5వ తేదీ నుంచి రోజుకు 6,400 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. అన్నపూర్ణ ప్రాజెక్టు నుంచి సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ప్యాకేజీ–11లోకి రోజుకు 3,300 క్యూసెక్కుల నీరు ఔట్‌ఫ్లోగా వెళుతోంది. ఇప్పటికే రెండు రెండు టీఎంసీల నీరు చేరింది. దీంతో ప్రస్తుతం రంగనాయకసాగర్ లో 2.75 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రంగనాయకసాగర్ నుంచి మల్లన్న సాగర్‌కు రోజుకు 3, 900 క్యూసెక్కుల నీరు మల్లన్నసాగర్ నుంచి కొండ పోచమ్మసాగర్‌లోకి 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఆదుకున్న ఎల్లంపల్లి జలాలు

మిడ్‌మానేరులో గత జూలై 27వ తేదీకి ముందు 5.90 టీఎంసీల మేర నీటి నిల్వలు మాత్రమే ఉండేవి. ఈక్రమంలో మిడ్‌మానేరుకు ఎల్లంపల్లి జలాలు ఎత్తిపోతల ద్వారా వదలడంతో 20 రోజులుగా వచ్చిన నీటితో ప్రస్తుతం 15.91 టీఎంసీలకు నీటినిల్వ చేరింది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం నిత్యం 3,150 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు ఇప్పటి వరకు సుమారు 20 టీఎంసీల నీరు చేరింది. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న వరదకాల్వలో నీరు నిండుగా ప్రవహిస్తుండడంతో ఆయా పరిధిలోని రైతులు 2వేల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు.



మిడ్‌మానేరు ప్రాజెక్టు

మిడ్‌మానేరుకు ఎల్లంపల్లి జలాలు



గత జూలై 27 నుంచి మిడ్‌మానేరులోకి ఎత్తిపోతల ద్వారా ఎల్లంపల్లి జలాలు తరలుతున్నాయి. ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో ప్రభుత్వ ఆదేశాలతో అన్నపూర్ణ ప్రాజెక్టులోకి రోజుకు 6,400 క్యూసెక్కులు, కుడికాల్వకు 100 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నాం.
– జగన్, మిడ్‌మానేరు, ఈఈ



వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఇక్కడ జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. – సాక్షి, అమరావతి



‘పతాక’ స్థాయి దేశభక్తి

యాదగిరిగుట్ట పట్టణంలోని ఆలయం కింద వైకుంఠ ద్వారం సర్కిల్ వద్ద గురువారం 2 వేల మీటర్ల జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు
– యాదగిరిగుట్ట

తుది దశలో ‘తుంగభద్ర’ గేట్ పనులు

- డ్యాంపైకి క్రేన్లు, గేట్ విడిభాగాలు
- డ్యాంలో 40 టీఎంసీలు ఖాళీ



డ్యాంపైన తీసుకెళ్తున్న నూతన క్రస్ట్ గేట్ పీసులు

సాక్షి, బళ్లారి: కర్ణాటకలో హొసపేటె వద్ద తుంగభద్ర జలాశయంలో 19వ క్రస్ట్ గేట్ కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఇప్పటికి 40 టీఎంసీలకు పైగా నీటిని వదిలేశారు. మూడు రోజుల నుంచి క్రస్ట్ గేట్ ఏర్పాటుకు డ్యాం అధికారులు, నిపుణులు తీవ్రంగా యత్నిస్తున్నారు. గురువారం ఉదయం జిందాల్ కంపెనీ తయారు చేసిన స్టాఫ్‌లాగ్ గేట్‌లోని హెలిమెట్స్‌ను తుంగభద్ర డ్యామ్ వద్దకు తీసుకొచ్చారు. డ్యామ్‌పైన భారీ క్రేన్ల సహాయంతో 80 మంది కార్మికులతో గేట్‌ను దింపే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ప్రత్యేక నిపుణుడు కన్నయ్యనాయుడు సూచనలతో స్టాఫ్‌లాగ్ గేట్లను ఏడు సిద్ధం చేశారు. ఒక్కో పీసు 15 టన్నుల బరువుతో తయారు చేస్తున్న వాటిని ఒక్కొక్కటిగా డ్యామ్ వద్దకు చేర్చి క్రస్ట్ గేట్ స్థానంలోకి భారీ క్రేన్ల సహాయంతో దింపుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరిగినా తక్షణం అన్ని విధాలా రక్షించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. రేపటిలోపు పనులు పూర్తి చేసే అవకాశాలున్నాయని బోర్డు అధికారులు చెప్పారు.

లింగాలగట్టులో చిరుత సంచారం

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం మండలం లింగాలగట్టు గ్రామం బోయ క్యాంపులో తరచూ చిరుత సంచరిస్తుండడంతో స్థానికులు భయభ్రాంతులకు లోనవుతున్నారు. గురువారం తెల్లవారుజామున కుక్కల వేట కోసం చిరుత రాగా.. కుక్కలు అరుస్తుండడంతో, స్థానికులు లేచి చిరుతను తరిమారు. చిరుతతో ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోననే భయం స్థానికులను వెంటాడుతున్నది. అటవీ అధికారులు చిరుతను బంధించి లోతట్టు అటవీప్రాంతంలో వదలాలని కోరుతున్నారు.



బోయ క్యాంపు దగ్గర నక్కిన చిరుత

కొడుకు కోసం.. తల్లి నిర్బంధం

▶ మొదటి పేజీ తరువాయి

‘నీ కొడుకు మైనర్ పిల్లను ఎత్తుకొనిపోయాడు. వాడు ఎక్కడున్నాడో రెండు రోజుల్లో వెతికి తీసుకు రావాలి. లేదంటే వాణ్ణి నేనే పట్టుకొచ్చి తుపాకీతో కాల్చి చంపేస్తా..’అంటూ బెదిరించాడు. దీనికి కళావతి స్పందిస్తూ.. ‘కూలి పనులు చేసుకునే మాకు ఏం తెలుసు సారూ.. వాడు పట్నంలో పనిచేసుకునేవాడు. కాశింపూర్ పిల్లతో ప్రేమ కుదిరింట. అది పిల్ల తల్లికి కూడా తెలుసు. వారు ఎక్కడికి పోయారో నాకు తెలీదు’ అని చెప్పింది. దీంతో ఎస్ఐ ఒక్కసారిగా ఆవేశానికి లోనై లాఠీతో విచక్షణారహితంగా కొట్టారు. ఆ దెబ్బలకు చేతులు, కాళ్లు వాచిపోయాయని, నడవడానికి కూడా రాలేదని బాధితురాలు వాపోయింది. ‘ఆ రోజు నుంచి ప్రతీ రోజు పోలీస్ స్టేషన్‌కి వస్తున్నా. రోజూ ఉదయం 9 గంటలకు పోలీస్ స్టేషన్‌కి వచ్చి కూర్చోవాలి. తాగడానికి నీళ్లు కూడా ఇవ్వరు. ఆకలితో రాత్రి 9 గంటల వరకు ఉండి సారుకు చెప్పి ఇంటికెళ్తున్న. నిన్న ఒక్క రోజే (బుధవారం) స్టేషన్‌కు రాలేదు’అంటూ ఠాణాకు వెళ్లిన విలేకరులకు చెబుతూ కళావతి కన్నీటి పర్యంతమైంది. రోజు కూలి పనులు చేసుకునే తమకు మూడు నెలలుగా పనిలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఎస్ఐపై చట్టపరమైన చర్యలు తీసుకుని, కళావతికి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

విచారణ జరుపుతాం
– అశోక్, సీఐ, తాండూరు రూరల్

కిడ్నాప్ కేసు విషయం మా దృష్టిలో ఉంది. కిడ్నాపర్ మైనర్ అయినా అరెస్టు చేయాల్సిందే. విచారణలో భాగంగా బాలుడి తల్లిని బషీరాబాద్ ఎస్ఐ స్టేషన్‌కు పిలిచి విచారించారు. ఎస్ఐ ఆమెను కొట్టాడనే విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ జరుపుతాం.



ఎట్ హోంలో గవర్నర్ జిష్ణుదేవ్‌తో సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్. చిత్రంలో బుర్రావెంకటేశం, వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, సీఎస్ శాంతికుమారి

జోరు వానలో ఎట్ హోమ్

పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, పొన్నం, పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: దేశ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం సాయంత్రం రాజ్‌భవన్ ప్రాంగణంలో ఎట్ హోమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నేతలు కె.కేశవరావు, చిన్నారెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, ఎంపీలు మల్లు రవి, ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ జితేందర్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభమైన కొద్దిసేపటికే భారీ వర్షం మొదలైంది. అయితే వాటర్‌ప్రూఫ్ టెంట్లు వేసి ఉండటంతో జోరు వానలోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి హాజరైన స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలు, పద్మ పురస్కార గ్రహీతల వద్దకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లి పలకరించారు. చివర్లో గవర్నర్ అతిథుల టేబుల్స్ వద్దకు వెళ్లి అందరినీ పలకరించారు. కాగా, వర్షపు నీటి ప్రవాహం టేబుల్స్ కిందకి చేరడంతో చివర్లో కొంత అసౌకర్యం కలిగింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నేతలు ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు.



టేబుళ్ల వద్ద వర్షపు నీరు



భిన్నత్వంలో ఏకత్వమే మన బలం

మాతృభూమికి స్వాతంత్య్రం కోసం పోరాడిన అసంఖ్యాక దేశభక్తుల నిస్వార్థ త్యాగాలు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన రాజ్‌భవన్ దర్బార్ హాల్ ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. గడిచిన ఏడు దశాబ్దాల్లో దేశం అద్భుత ప్రగతిని సాధించిందన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే మన అతిపెద్ద బలమని స్పష్టం చేశారు. దేశం, రాష్ట్ర అభివృద్ధికి అకుంఠిత దీక్షతో పనిచేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాజ్‌భవన్ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కూకట్‌పల్లి కోర్టు భవనాన్ని ప్రారంభించిన హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి, జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ రాధారాణి, జస్టిస్ సుజన, జస్టిస్ ప్రియదర్శిని, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు



కూకట్‌పల్లి కోర్టు భవనాన్ని ప్రారంభించిన సీజే

కేపీహెచ్‌బీ కాలనీ (హైదరాబాద్): కూకట్‌పల్లి పరిధిలోని కైత్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన కూకట్‌పల్లి కోర్టుల భవన సముదాయాన్ని గురువారం హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ప్రారంభించారు. అనంతరం ఆయన హైకోర్టు న్యాయమూర్తులతో కలిసి భవన సముదాయంలోని కోర్టు హాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ.. న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయించే వారికి సత్వర న్యాయం అందించేందుకు న్యాయమూర్తులతోపాటు, న్యాయవాదులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారత ప్రభుత్వం కొత్తగా తెచ్చిన న్యాయ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. నూతన భవన సముదాయం ప్రారంభించుకోవడం విశేషమేమీ కాదని, న్యాయస్థానాలను ఆశ్రయించే వారికి ఆధునికతను అందిపుచ్చుకుని సత్వర న్యాయం అందేలా చూడటం ముఖ్యమన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున కోర్టును ప్రారంభించుకోవటం హర్షణీయమని, అయితే కక్షిదారులకు కూడా కోర్టు కేసుల నుంచి విముక్తి కల్పించాలని చెప్పారు. రంగారెడ్డి ఉమ్మడి జిల్లా పరిధిలో 40 వేలకు పైగా పెండింగ్ కేసులున్నాయని, సత్వర న్యాయం దిశగా చర్యలు తీసుకుని పెండింగ్ కేసులను తగ్గించాలని పిలుపునిచ్చారు. అనంతరం కోర్టు ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శామ్ కోషి, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ రాధారాణి, జస్టిస్ ప్రియదర్శిని, జస్టిస్ సుజన, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శశిధర్‌రెడ్డి, మేడ్చల్– మల్కాజ్‌గిరి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి బి. బాలభాస్కర్‌రావు, కూకట్‌పల్లి కోర్టుల న్యాయమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



భారీ వర్షంలోనూ జూడాల నిరసన

గాంధీఆస్పత్రి: కోల్‌కతాలో విధినిర్వహణలో ఉన్న వైద్యవిద్యార్థినిపై హత్యాచార ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని, ఈ ఘటనలు పునరావృతం కాకుండా కఠినచర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో జూడాలు నిరసన కార్యక్రమాలు ఉధృతం చేశారు. గురువారం సాయంత్రం భారీవర్షాన్ని సైతం లెక్కచేయకుండా వెయ్యి మంది జూడాలు భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ ఆస్పత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ సికింద్రాబాద్ ప్రధాన రహదారి, పద్మారావునగర్, ముషీరాబాద్ చౌరస్తా మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా సీనియర్ రెసిడెంట్స్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్, జూడాల సంఘం గాంధీ యూనిట్ అధ్యక్షుడు వంశీకృష్ణ మీడియాతో మాట్లాడుతూ న్యాయం జరిగే వరకు ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

2 గంటలు.. 8 సెం.మీ.లు

▶ మొదటి పేజీ తరువాయి



మాదాపూర్, కుత్బుల్లాపూర్, ముషీరాబాద్, అంబర్‌పేట, ఎల్బీ నగర్, ఉప్పల్, నల్లకుంట ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లపై భారీగా వరద చేరడంతో వాహనాలు ముందుకు కదలక ట్రాఫిక్ జామ్ అయ్యింది. వర్షం నేపథ్యంలో అధికారులు అలర్ట్ ప్రకటించారు. అత్యవసరమైతే తప్ప వాహనాలతో రోడ్లపైకి రావొద్దని సూచించారు. కాలినడకన వెళ్లే వారు మ్యాన్ హోల్‌లను చూసుకొని వెళ్లాలని నగర పోలీసులు సూచించారు. ఉప్పల్, నాగోల్‌తోపాటు పలు మెట్రో స్టేషన్లలో వర్షపు నీరు చేరింది.

8.7 సెం.మీ. వర్షపాతం నమోదు

నగరంలో సగటున 8.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. ముషీరాబాద్‌లో 8.7 సెం.మీ., హిమాయత్‌నగర్‌లో 7, సైదాబాద్‌లో 6.8, కూకట్‌పల్లిలో 6.6. బాలానగర్‌లో 6.5, అంబర్‌పేటలో 5.9, ఎల్బీనగర్‌లో 6.1, ఉప్పల్‌లో 6 సెం.మీ.వర్షపాతం నమోదైంది.



సిరి వరాలు

లక్ష్మీదేవి సంపదలనిచ్చే తల్లి. కుచేలుర నుంచి కుబేరుల వరకు అందరికీ ఆమె అనుగ్రహం కావలసిందే. ఉన్నత స్థితి, రాజరికం, అదృష్టం, దాతృత్వం, సముజ్వల సౌందర్యం వంటి ఎన్నో ఉన్నత లక్షణాలు కలిగిన లక్ష్మీదేవి చల్లని చూపు ప్రసరిస్తే సకల సంపదలు పొందగలమనడంలో సందేహం లేదు. శ్రావణ మాసం లక్ష్మీదేవికి చాలా ప్రీతికరమైనది. ఈ మాసంలో వచ్చే శుక్రవారాలు... అందులోనూ రెండవ శుక్రవారమంటే ఇంకా ఇష్టం. ఈ రోజున వరలక్ష్మీవ్రతం చేసుకున్న వారికి సకల సంపదలూ ప్రసాదిస్తుంది ఆ చల్లని తల్లి.

మన ఇంటికి వచ్చిన అతిథిని మనం ఎలా గౌరవాదరాలతో మర్యాదలు చేస్తామో అదేవిధంగా అమ్మవారు మన ఇంటికి వచ్చిందని భావించి, మనసు పెట్టి ఈ వ్రతాచరణ చేస్తే శుభఫలితాలు కలుగుతాయి.

సమకూర్చుకోవలసిన సామగ్రి

పసుపు, కుంకుమ, గంధం, విడి పూలు, పూలమాలలు, తమలపాకులు, వక్కలు, ఖర్జూరాలు, అగరుబత్తీలు కర్పూరం, చిల్లర పైసలు, కండువా, రవికల బట్టలు రెండు, మామిడాకులు, అరటిపండ్లు, ఇతర రకాల పండ్లు ఐదు రకాలు, అమ్మవారి పటం, కలశం, మూడు కొబ్బరి కాయలు, తెల్ల దారం లేదా నోము దారం లేదా పసుపు రాసిన కంకణాలు రెండు, నైవేద్యం కోసం ఓపికను బట్టి ఐదు లేదా తొమ్మిది రకాల స్వీట్లు, బియ్యం, పంచామృతం లేదా పాలు, ఇంకా దీపాలు, గంట, హారతి పళ్లెం, స్పూన్లు, పళ్లేలు, నూనె, వత్తులు, అగ్గిపెట్టె, గ్లాసులు, చిన్న చిన్న గిన్నెలు.

వ్రత విధానం

వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించే రోజున పొద్దున్నే లేచి తల స్నానం చేసి, ఇంటిని శుభ్రం చేసుకోవాలి.

తోరం ఇలా తయారు చేసుకోవాలి

తెల్లటి దారాన్ని ఐదు లేక తొమ్మిది పోగులు తీసుకుని దానికి పసుపు రాసుకోవాలి. ఆ దారానికి ఐదు లేక తొమ్మిది పూలు కట్టి ముడులు వేయాలి. అంటే ఐదు లేక తొమ్మిది పోగుల దారాన్ని ఉపయోగించి, ఐదు లేక తొమ్మిదో పువ్వులతో ఐదులేక తొమ్మిది ముడులతో తోరాలను తయారుచేసుకుని, పీఠం వద్ద ఉంచి పుష్పాలు, పసుపు, కుంకుమ, అక్షతలు వేసి, తోరాలను పూజించి ఉంచుకోవాలి. ఆ విధంగా తోరాలను తయారు చేసుకున్న తరువాత పూజకు సిద్ధంకావాలి.

ఇంట్లోని పూజామందిరంలో ఒక మండపాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఈ మండపం పైన బియ్యపు పిండితో ముగ్గువేసి, కలశం ఏర్పాటు చేసుకోవాలి. అమ్మవారి ఫొటో అమర్చుకోవాలి. పూజాసామగ్రిని అంతా సిద్ధం చేసుకోవాలి. తోరాలు ముందుగానే సిద్ధం చేసుకుని ఉంచాలి. అక్షతలు, పసుపు గణపతిని కూడా సిద్ధంగా ఉంచుకోవాలి. ఇవన్నీ దగ్గర లేకపోతే పూజమీద మనసు నిలపడం కష్టం అవుతుంది..

ముందుగా గణపతి పూజ చేసుకోవాలి.

వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమప్రభ
నిర్విఘ్నం కురుమేదేవో సర్వ కార్యేషు సర్వదా
ఆగచ్ఛ వరసిద్ధ వినాయక, అంబికా ప్రియనందన
పూజాగృహాణ సుముఖ, నమస్తే గణనాయక

గణపతిపై అక్షతలు చల్లాలి. యధాశక్తి పూజ చేసి, స్వామికి పళ్ళుగానీ బెల్లం ముక్క గానీ నివేదించాలి. తర్వాత వినాయకునికి నమస్కరించి పూజ చేసిన అక్షతలు శిరస్సున ధరించాలి. ఆ తర్వాత కలశం ఉంచి అమ్మవారిని ధ్యాన ఆవాహనాది షోడశ ఉపచారాలతో పూజించాలి. మహాలక్ష్మీ అష్టోత్తరం చదువుకోవాలి. అనంతరం తోరపూజ చేసుకుని, 'బధ్నామి దక్షిణే హస్తే నవ సూత్రం శుభప్రదం పుత్రపౌత్రాభివృద్ధ్యంచ మమ సౌభాగ్యం దేహిమే రమే' అని చదువుకుంటూ కుడిచేతికి తోరం కట్టుకోవాలి. ఆ తర్వాత వరలక్ష్మీ వ్రత కథ చదువుకొని అక్షతలు వేసుకుని, అమ్మవారికి ఐదు లేదా తొమ్మిది రకాల పిండివంటలు నైవేద్యం పెట్టాలి. ముత్తయిదువులకు తాంబూలాలు ఇచ్చిన తర్వాత పూజ చేసిన వారు తీర్థప్రసాదాలు స్వీకరించి, పేరంటాళ్లు అందరికీ తీర్థప్రసాదాలు ఇవ్వాలి. తర్వాత బంధుమిత్రులతో, పూజకు వచ్చిన వారితో కలిసి కూర్చుని భోజనం చేయాలి. రాత్రికి ఉపవసించాలి.

ఇక్కడ ఒక విషయం చెప్పుకుందాం. అదేమంటే అమ్మవారికి ఐదు లేదా తొమ్మిది పిండివంటలు నివేదించాలి అన్నారు కదా అని ఎంతో శ్రమ పడి. ఓపిక లేకపోయినా అన్నీ చేయనక్కర లేదు. పులిహోర, పరమాన్నం, పూర్ణాలు, చలిమిడితోపాటు పానకం, వడపప్పు, అరటిపండ్లు, సెనగలు వంటి వాటిని కూడా లెక్కలోకి తీసుకోవచ్చు.



స్త్రీలలోని సృజనకు దర్పణం ఈ వ్రతం

అది ఎలాగంటే ఆ రోజున ఒక మంచి పెద్ద కొబ్బరికాయకి వీరు కళ్లు, ముక్కు, చెవులు, నోరు తీర్చిదిద్ది తగిన ఆభరణాలతో అలంకరించి మరీ వరలక్ష్మిని సృజిస్తారు.



ప్రేమ కానుక

షాజహాన్‌కు భార్య పై ఉన్న ప్రేమ పాలరాతి తాజ్‌మహల్‌లో ప్రతిఫలించింది. మెటా బిలియనీర్ మార్క్ జుకర్ బర్గ్ విషయానికి వస్తే... భార్యపై ఆయనకున్న ప్రేమ ఇంటి పెరట్లోని సుందరమైన నీలిరంగు విగ్రహంలో ప్రతిఫలిస్తోంది. రొమాంటిక్ హావభావాలతో కూడిన భార్య ప్రిస్కిల్లా చాన్ భారీ విగ్రహాన్ని ఇంటి పెరట్లో ఏర్పాటు చేశాడు జుకర్ బర్గ్. ఆ విగ్రహం పక్కన నిలబడి ఫొటో దిగి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఈ విగ్రహం చిత్రాలు ఇంటర్‌నెట్ సెన్సేషన్‌గా మారాయి...

జుకర్ బర్గ్... ప్రేమ మార్క్



● ప్రిస్కిల్లా విగ్రహం

ఫేస్‌బుక్ విజయం గురించి చెప్పుకోవడం కంటే తన ప్రేమ విజయం గురించి చెప్పుకోవడం అంటేనే మార్క్ జుకర్ బర్గ్‌కు ఇష్టం. ప్రిస్కిల్లా చాన్‌తో ఎలా పరిచయం అయింది, ఆ పరిచయం ఎలా ప్రేమగా మారింది కథలు కథలుగా చెబుతుంటాడు. అవి ఎప్పుడో జరిగినట్లుగా ఉండవు. నిన్నా మొన్న జరిగినట్లుగానే ఉంటాయి. అది అతడి మాటల చాతుర్యం కాదు. ప్రేమలోని మాధుర్యం!

19 మే, 2012 అనేది జుకర్ బర్గ్, చాన్‌లకు మరచిపోలేని సుదినం. కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో వారి వివాహం జరిగింది. ఈ ఔట్‌డోర్ వెడ్డింగ్‌లోని విశేషం ఏమిటంటే... పెళ్లి నాటి ప్రమాణాలను కాగితాల రూపంలో ఇరువురు ఇచ్చిపుచ్చుకున్నారు.

జుకర్‌బర్గ్ చాన్‌కు ఇచ్చిన పేపర్‌లో ఇలా రాసి ఉంది.... 'ఇప్పుడు ఎంత సంతోషంగా ఉన్నామో... ఎప్పుడూ ఇలాగే' అదృష్టవశాత్తు ఆ సంతోషం ఇప్పటివరకు వారికి దూరం కాలేదు. 'మార్క్ అప్పుడు ఎంత ప్రేమతో ఉన్నాడో ఇప్పుడూ అంతే. అప్పుడు ఎలా నవ్వించేవాడో ఇప్పుడూ అంతే' అంటూ భర్త గురించి మురిపెంగా చెబుతుంటుంది ప్రిస్కిల్లా చాన్.

ఏడు అడుగుల సిల్వర్ అండ్ బ్లూ ప్రిస్కిల్లా చాన్ విగ్రహం వారి బలమైన ప్రేమ బంధానికి ప్రతీకలా కనిపిస్తోంది. ప్రవహిస్తున్నట్లుగా కనిపించే వెండి వస్త్రం విగ్రహాన్ని మరింత ఆకర్షణీయం చేసింది. ఈ విగ్రహం కోసం న్యూయార్క్‌కు చెందిన ఆర్టిస్ట్, ఆర్కిటెక్చర్, శిల్పి డేనియల్ అర్షమ్‌ను సంప్రదించాడు మార్క్. విగ్రహం ఎలా ఉండాలి? అనే దాని గురించి ఇద్దరి మధ్య ఎన్నోరోజుల పాటు చర్చలు జరిగాయి.

చాన్ విగ్రహం పుణ్యమా అని 'ఎవరీ డేనియల్' అనే శోధన మొదలైంది. ఈ డేనియల్‌కు 'ఇన్‌స్టాగ్రామ్ శిల్పి' అని పేరు. డ్యాన్స్, డిజైన్, ఆర్కిటెక్చర్, ఆర్ట్‌ను మిక్స్ చేసిన కళాకారుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఎన్నో పెద్ద ప్రాజెక్ట్‌లకు పని చేశాడు. 'భార్య విగ్రహాన్ని నెలకొల్పే రోమన్ సంప్రదాయాన్ని తీసుకువద్దాం' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రాశాడు జుకర్ బర్గ్.

టీ సేవిస్తూ తన విగ్రహం దగ్గర ఫొటో దిగిన ప్రిస్కిల్లా చాన్ ఆ ఆర్ట్‌వర్క్‌ను 'అద్భుతం' అని ప్రశంసించింది.

ఏడు అడుగుల ప్రిస్కిల్లా చాన్ విగ్రహంపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు కనిపిస్తున్నాయి. భార్యపై మార్క్ జుకర్‌బర్గ్‌కు ఉన్న ప్రేమను ఎంతోమంది ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. నీలిరంగులో ఉన్నందుకు కావచ్చు... కొందరు మాత్రం ఈ విగ్రహాన్ని అవతార్ క్యారెక్టర్‌లతో పోలుస్తూ జోక్‌లు పేలుస్తున్నారు. ఎవరి మాట ఎలా ఉన్నా... ప్రిస్కిల్లా చాన్ విగ్రహం ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేస్తోంది.



● భార్య ప్రిస్కిల్లాతో మార్క్ జుకర్ బర్గ్

కన్నీళ్లు తుడిచే విగ్రహం



● భార్య విగ్రహంతో తాపస్

'భార్య విగ్రహాన్ని నెలకొల్పే రోమన్ సంప్రదాయాన్ని తీసుకువద్దాం' అని జుకర్ బర్గ్ అంటున్నాడుగానీ మన వాళ్లు ఆ పని ఎప్పుడో చేశారు. చేస్తున్నారు! కోల్‌కత్తాకు చెందిన 65 సంవత్సరాల తాపస్ అనే రిటైర్డ్ సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి 2.5 లక్షలు ఖర్చు చేసి తన భార్య ఇంద్రాణి సిలికాన్ స్టాచ్యూను ఇంట్లో ఏర్పాటు చేసుకున్నాడు. జీవకళ ఉట్టిపడే ఈ విగ్రహంతో తాపస్ ఎన్నోసార్లు మాట్లాడుతుంటాడు. తన భార్య చనిపోలేదని, విగ్రహం రూపంలో ఇంట్లోనే ఉంది అనుకొని దుఃఖానికి దూరం అయ్యాడు. తాపస్‌లాంటి భర్తల కథలు మన దేశ నలుమూలలా ఉన్నాయి.

మై వార్డ్‌రోబ్

హుందాగా... కంఫర్ట్‌గా!

వేడుకలకు, ప్రత్యేక రోజుల్లో రెడీ అవడానికి ప్రతీ ఒక్కరూ తమదైన స్టైల్‌ని డ్రెస్సింగ్‌లో చూపుతుంటారు. హైదరాబాద్ ఎల్.బి.నగర్‌లో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని చందనామారం తన డ్రెస్సింగ్ గురించీ, వార్డ్రోబ్ విషయాలను ఈ విధంగా షేర్ చేసుకున్నారు.



''జాబ్, స్కూల్‌కి వెళ్లే ఇద్దరు పిల్లలు, ఫ్యామిలీతో టైమ్ అసలు సరిపోదు. అయితే మనకోసం మనం కొంచెం టైమ్ అయినా ఉండేలా చూసుకోవాలి అనుకుంటాను. నలుగురిలోకి వెళ్లినప్పుడు ప్రత్యేకంగా కనిపించడానికి, అదే విధంగా నా బడ్జెట్ ప్రకారం డ్రెస్సింగ్ ఉండేలా ఎంపిక చేసుకుంటాను.

హుందాగా...

ఆఫీస్‌కి వెళ్లేటప్పుడు డిగ్నిఫైడ్‌గానూ, కంఫర్ట్‌గానూ ఉండేలా చూసుకుంటాను. అందుకు కుర్తీలు, జీన్స్ ఉంటాయి. వీటిలోనే మిక్స్ అండ్ మ్యాచ్‌కి ట్రై చేస్తుంటాను.

డిజైనర్ శారీస్

రిసెప్షన్ వంటి వేడుకలకు డిజైనర్ శారీస్‌ను ఎంచుకుంటాను. జనరల్‌గా మార్కెట్‌లో వస్తున్న ట్రెండ్స్‌ను కూడా ఫాలో అవుతుంటాను. వీటిలో నాకు ఎలాంటి ఔట్‌ఫిట్ అయితే బాగుంటుందో చెక్ చేస్తుంటాను. స్టిచింగ్‌కు సంబంధించినప్పుడు ఇన్‌స్టా పేజీలు కూడా చూస్తుంటాను. అలాంటి డిజైన్స్ చేయమని బొటిక్స్‌లో చెబుతుంటాను. శారీకి తగినట్టు బ్లౌజ్ సెట్ చేయడానికి డిజైనర్ హెల్ప్ తీసుకుంటాను.



తక్కువ బడ్జెట్‌లో బెటర్‌లుక్

పెళ్లి, ఇంట్లో పండగలు వంటి సందర్భాలలో మనదైన సంప్రదాయ కట్టునే ఇష్టపడతాను. దీనికోసం ఎక్కడైనా శారీస్ కలెక్షన్ గురించి కూడా తెలుసుకుంటాను. కొన్నిచోట్ల నచ్చినా బడ్జెట్ మించి ఉంటే తీసుకోను. అయితే, అవే మోడల్స్‌లో మరో చోట ఒకటికి బదులు రెండు చీరలు వచ్చేలా ఎంపిక చేసుకోవడం గురించి ఆలోచిస్తుంటాను. తక్కువ బడ్జెట్‌లో మంచి డ్రెస్సింగ్ ఉండేలా చూసుకుంటాను. సాధారణంగా ఎక్కువ డబ్బులు పెట్టి కొన్న చీరలు, డ్రెస్సులు వేసుకుంటే నలుగురిలో వెళ్లినప్పుడు మన అప్పీరియన్స్ బాగుంటుంది అనుకుంటారు. కానీ, తక్కువ బడ్జెట్‌లో బెటర్‌గా కనిపించేలా ప్లాన్ చేసుకోవడం మంచిది'' అని వివరిస్తున్నారు ఈ ఉద్యోగిని.





నోట్: మీరూ మీ వార్డ్‌రోబ్ లేదా మీ అమ్మాయి వార్డ్‌రోబ్ గురించి, డ్రెస్సింగ్ విషయంలో తీసుకుంటున్న విశేషాల గురించి ఫొటోలతో సహా 'సాక్షి' పాఠకులతో పంచుకోవచ్చు. బాగున్న వాటిని మై వార్డ్‌రోబ్ శీర్షికన ప్రచురిస్తాం.

మా చిరునామా: మై వార్డ్‌రోబ్,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి, రోడ్ నం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్ -34.
sakshifamily3@gmail.com

బ్యూటిప్స్

➡ గ్రీన్ టీ తాగిన తర్వాత పడేసే టీ బ్యాగ్‌తో ముఖాన్ని తుడవాలి. ముఖంపై ఉన్న దుమ్ము, మృతకణాలు తొలగిపోతాయి. ప్రతి రోజూ ఇలా చేయడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

➡ పెదవులపై మృతకణాలు తొలగిపోయి, మృదువుగా ఉండాలంటే పంచదార పొడిని అద్ది, మృదువుగా రబ్ చేయాలి.



➡ వేడినీళ్లతో స్నానం చేయడం వల్ల చర్మంపై ఉండే సహజ నూనెలు తగ్గిపోతాయి. అందుకని, గోరువెచ్చని నీటిని ఉపయోగించాలి.

తెలుగింటి వెలుగులు



అమ్మానాన్నలు వెంట లేకుండానే... టీచర్లు తోడు లేకుండానే ఈ అమ్మాయిలు ధైర్యంగా దేశం దాటి చైనా వెళ్లారు. శాస్త్ర సాంకేతిక సదస్సులో 38 దేశాల నుంచి హాజరైన బృందాలలో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించారు. తెలుగు వారి తెలివితేటలను నిరూపించుకున్నారు. అంతర్జాతీయ ప్లాట్‌ఫారంపై అదరగొట్టారు. భావి శాస్త్రవేత్తలుగా భళా అనిపించుకున్నారు. ఎంచక్కా తిరిగి వచ్చారు. తమ అనుభవాలను సాక్షితో సంతోషంగా పంచుకున్నారు. ఇంతకూ ఎవరా అమ్మాయిలు..?

ఆంధ్రప్రదేశ్, కాకినాడకు చెందిన సాయిశ్రీ శ్రుతి చిట్టూరి, లక్ష్మీ ఆశ్రిత నామ, సంజన పల్లా, వైష్ణవి వాకచర్లలకు అంతర్జాతీయ వేదికపై భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చింది. చైనీస్ అసోషియేషన్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ, చైనా ఎడ్యుకేషన్ క్యాంప్ రెగ్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన యూత్ సైన్స్ టెక్నాలజీ వర్క్‌షాపులో ఈ స్టూడెంట్స్ పాల్గొన్నారు. సదస్సులో పాల్గొని ఇటీవలే తిరిగి వచ్చారు.

ఎనిమిదో ఏడు

చైనా ఏటా ప్రపంచ స్థాయిలో 2017 నుంచి సైన్స్ అండ్ టెక్నాలజీ వర్క్‌షాపు నిర్వహిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాలు, వివిధ భాషలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆలోచనలను పంచుకోవాలి. అలా భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారీ అమ్మాయిలు.

భావి శాస్త్రవేత్తలకు దిక్సూచి: విశ్వం ఆవిర్భావం నుంచి నేటివరకూ ప్రపంచంలో చోటు చేసుకున్న మార్పులపై నిరంతరం పరిశోధనలు కొనసాగడం ఈ వర్క్‌షాపు లక్ష్యం. ఈ వర్క్‌షాపు లో ఎంపీసీ స్టూడెంట్స్ (శృతి, వైష్ణవి) 'చేజింగ్ ద సన్' అంశాన్ని, బైపీసీ స్టూడెంట్స్ (లక్ష్మి ఆశ్రిత, సంజన) ఫాజిల్స్‌ను ఎంపిక చేసుకున్నారు. వివిధ దేశాల నుంచి ఎంపికైన వారితో తమ అభిప్రాయాలను పంచుకుని విజయవంతంగా తిరిగి వచ్చారు.

ఆలోచనలను పంచుకున్నాం



దక్షిణాఫ్రికా, నేపాల్, ఆస్ట్రేలియా, మంగోలియా తదితర దేశాల విద్యార్థినుల పరిశోధన అంశాలపై ఆలోచనలు పంచుకోవడానికి మాకు మంచి అవకాశం వచ్చింది. ముఖ్యంగా ఒకే వయస్సు వాళ్లం ఒక చోట చేరి ఎంపిక చేసుకున్న అంశాలపై విశ్లేషించుకోవడానికి ఈ సదస్సు ఉపకరించింది.

- వైష్ణవి, ఎంపీసీ విద్యార్థిని, కాకినాడ

పురాతన జీవశాస్త్రంపై పరిశోధన



ఈ వర్క్‌షాపు ద్వారా వివిధ ప్రాంతాల విశిష్టత, ఆయా ప్రాంతాల్లో జీవరాశుల స్వభావం, స్థితిగతులపై ప్రాథమికంగా కొంత అవగాహన ఏర్పరుచుకుకోగలిగాం. భవిష్యత్తులో శాస్త్రవేత్తలం కావాలనే మా సంకల్పానికి ఈ వర్క్‌షాపు కచ్చితంగా ఉపయోగమే.

- సంజన, బైపీసీ విద్యార్థిని, కాకినాడ

- లక్కింశెట్టి శ్రీనివాస రావు, సాక్షి, కాకినాడ
ఫొటోలు: **తలాటం సత్యనారాయణ**

భక్తి నివేదన

వరలక్ష్మీ వ్రతం అనగానే ముందుగా అందరికీ గుర్తొచ్చేది పూర్ణాలూ బొబ్బట్లే. ఆ తర్వాతే తక్కినవన్నీ. ఎందుకంటే ఏ పూజ అయినా పూర్ణంతోనే పరిపూర్ణం అవుతుందని పెద్దలు చెబుతారు. ఈ వేళ అమ్మవారికి పూర్ణాలు, భక్ష్యాలను నివేదిద్దాం.



పూర్ణాలు

కావలసినవి: పచ్చిశనగ పప్పు – అర కేజీ, బెల్లం – అరకేజీ, యాలక్కాయలు – పది, బియ్యం – రెండు కప్పులు, పొట్టుతీసిన మినప గుళ్లు – కప్పు, ఉప్పు – రుచికి సరిపడా, ఆయిల్ – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ● ముందుగా మినప పప్పు, బియ్యాన్ని శుభ్రంగా కడిగి ఆరుగంటల పాటు నానబెట్టుకోవాలి. శనగ పప్పుని కూడా కడిగి గంట పాటు నానబెట్టాలి. ● నానిన బియ్యం, మినప పప్పులని మెత్తగా రుబ్బి పక్కన పెట్టుకోవాలి. ● నానిన శనగపప్పుని కుకర్‌లో వేసి రెండు గ్లాసులు నీళ్లపోసి మూడు విజిల్స్ రానివ్వాలి. ● ఉడికిన శనగ పప్పులో బెల్లం వేసి మెత్తగా గరిటతో తిప్పుతూ దగ్గర పడేంత వరకు ఉడికించి, యాలుక్కాయల పొడి వేసి తిప్పి దించేయాలి. ● శనగపప్పు మిశ్రమం చల్లారాక, ఉండలుగా చుట్టుకోవాలి. ● బియ్యం, మినపగుళ్ల పిండిలో కొద్దిగా ఉప్పు వేసి కలపాలి. ఇప్పుడు శనగ పప్పు ఉండలను ఈ పిండిలో ముంచి ఆయిల్‌లో డీప్ ఫ్రై చేయాలి. ● మీడియం మంట మీద బంగారు రంగులోకి మారేంత వరకు వేయిస్తే తియ్యని పూర్ణాలు రెడీ.

భక్ష్యాలు

కావలసినవి: పచ్చిశనగ పప్పు – రెండు కప్పులు, బెల్లం తురుము – రెండు కప్పులు, యాలకుల పొడి – రెండు టేబుల్ స్పూన్లు, మైదా – రెండు కప్పులు, గోధుమ పిండి – మూడు టేబుల్ స్పూన్లు, నెయ్యి – అరకప్పు, నీళ్ల – కప్పు, ఉప్పు – చిటికెడు.

తయారీ: ● ముందుగా శనగ పప్పుని శుభ్రంగా కడిగి రెండు గంటలపాటు నానబెట్టాలి. ● నానిన పప్పుని కుకర్‌లో వేసి, రెండు కప్పుల నీళ్ల పోసి మూత పెట్టి మూడు విజిల్స్ రానివ్వాలి. ఇంతకు మించి ఉడికించకూడదు. ● ఉడికిన తరువాత నీళ్ల తీసేసి పప్పుని పక్కన పెట్టుకోవాలి. ● మైదాలో గోధుమ పిండి, టేబుల్ స్పూను నెయ్యి, కప్పు నీళ్లపోసి పిండిని ముద్దలా కలుపుకోని పక్కనపెట్టుకోవాలి. ● శనగ పప్పుని కూడా మెత్తగా రుబ్బుకోవాలి. ● మందపాటి పాత్రలో బెల్లం తురుము, అరకప్పు నీళ్ల పోసి సన్నని మంట మీద ఉడికించాలి. ● మధ్య మధ్యలో కలియ తిప్పుతూ రుబ్బుకున్న శనగపప్పు, యాలకుల పొడి వేసి కలిపి, పదినిమిషాల పాటు ఉడికించాలి. ● ఉడికిన మిశ్రమాన్ని నిమ్మకాయ సైజు పరిమాణంలో ఉండలుగా చుట్టుకుని పక్కన పెట్టుకోవాలి. ● అల్యూమినియం ఫాయిల్‌పైన కొద్దిగా నెయ్యి రాసుకుని కలిపి పెట్టుకున్న మైదా పిండిని చిన్న ఉండలుగా చేసుకుని చపాతీలా చేత్తో వత్తుకోవాలి. ● ఈ చపాతీలో శనగపప్పు ఉండని పెట్టి చపాతీ మొత్తం చుట్టి పూరీలా వత్తుకోవాలి. ● పెనం మీద నెయ్యి వేసి రెండు వైపులా బంగారు రంగులోకి మారేంత వరకు కాల్చితే భక్ష్యాలు రెడీ.



యువర్స్



● గేమింగ్

అడుగడుగునా అంతులేని ధైర్యం

మల్టీప్లేయర్ ఆన్‌లైన్ రోల్–ప్లేయింగ్ గేమ్ 'వరల్డ్ క్రాఫ్ట్: ది వార్ విత్‌ఇన్' ఈ నెల 26న విడుదల కానుంది. 'వరల్డ్ ఆఫ్ వార్‌క్రాఫ్ట్'కు ఎక్స్‌పాన్షన్ ప్యాక్‌గా వస్తున్న గేమ్ ఇది. 2004లో వచ్చిన 'వరల్డ్ ఆఫ్ వార్‌క్రాఫ్ట్'లో ప్లేయర్ 'క్యారెక్టర్ అవతార్'ను క్రియేట్ చేసి థర్డ్ లేదా ఫస్ట్–పర్సన్ వ్యూ నుంచి ఓపెన్ గేమ్ వరల్డ్‌ను ఎక్స్‌ప్లోర్ చేయాల్సి ఉంటుంది. ఇక 'ది వార్ విత్‌ఇన్' విషయానికి వస్తే...ఈ గేమ్‌లో ఖాజ్ అల్గార్ అనేది ప్రైమరీ సెట్టింగ్. ది ఇజెల్ ఆఫ్ డోర్న్, ది రింగింగ్ డీప్స్, హాలోఫాల్, అజి–కహెట్ అనే నాలుగు జోన్‌లుగా విభజించబడి ఉంటుంది.ఈ గేమ్‌లో 'డైనమిక్ ఫ్లైయింగ్' అనే ఫీచర్ ఉంది. న్యూ గేమ్స్‌ను ఎక్స్‌ప్లోర్ చేయడానికి ఇది ఉపయోగపడుతుంది.

సిరీస్: వార్‌క్రాఫ్ట్; **ప్లాట్‌ఫామ్:** విండోస్, మ్యాక్‌వోఎస్; **మోడ్:** మల్టీప్లేయర్
జానర్: ఎంఎంఆర్‌పీజీ (మాస్‌ప్లీ మల్టీప్లేయర్ ఆన్‌లైన్ రోల్–ప్లేయింగ్ గేమ్)

● టెక్... టాక్



రియల్‌మీ జీ7 6టీ

సైజ్	6.78 అంగుళాలు
రిజల్యూషన్	2780× 1264 పిక్సెల్స్
ఫ్రంట్ కెమెరా	32 ఎంపీ
బ్యాటరీ	5, 500 ఎంఏహెచ్
ర్యామ్	6జీబి, 8జీబి, 12జీబి
స్టోరేజ్	128జీబి/256 జీబి/512 జీబి

హానర్ మ్యాజిక్ ప్యాడ్ 2



సైజ్	12.3 అంగుళాలు
రిజల్యూషన్	2,560×1,600 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్	144 హెచ్‌జడ్
బ్యాటరీ	10,050 ఎంఏహెచ్
మెమోరీ	8/256 జీబి, 12/256 జీబి 16/512 జీబి

లెనొవో ట్యాబ్ ప్లస్

సైజ్	11 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్	90 హెచ్‌జడ్
రిజల్యూషన్	1200×2000 పిక్సెల్స్
● బరువు	650గ్రా.
బ్యాటరీ	8600 ఎంఏహెచ్
ఇంటర్నల్ స్టోరేజ్	256జీబి

● 8 జేబీఎల్ స్పీకర్స్





జంప్ ఆన్ ది బ్యాండ్‌వాగెన్

ఫ్యాషనబుల్, ప్రాఫిటబుల్‌గా ఉందనే కారణంతో ఒక పని లేదా వ్యాపారం చేయడానికి ముందుకు రావడం....మొదలైన సందర్భాలలో వాడే మాట జంప్ ఆన్ ది బ్యాండ్ వాగెన్. **ఉదా:** మై ఫ్రెండ్స్ ఆర్ అబ్సెస్డ్ విత్ బయింగ్ ఐఫోన్, బట్ ఐ రిఫ్యూజ్ టు గెట్ ఆన్ ది బ్యాండ్‌వాగెన్.

● ఏఐ ఏరియా



ఏఐ గర్ల్‌ఫ్రెండ్స్ వస్తున్నారహో!

'నాకు ఒక్క గర్ల్‌ఫ్రెండ్ కూడా లేదు' అని ఇక ముందు బాధపడ నక్కర్లేదు. ఎందుకంటే ఇప్పుడు ఏఐ గర్ల్‌ఫ్రెండ్ ట్రెండ్ నడుస్తోంది. ఈ గర్ల్ ఫ్రెండ్స్‌తో హాయిగా సంభాషించవచ్చు. మనసులోని భావాలను పంచుకోవచ్చు. సలహాలు అడగవచ్చు. ఫొటోలు దిగవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా యువతలో ఎంతోమంది ఒంటరితనంలో బాధపడుతున్నారు. డిప్రెషన్ బారిన పడుతున్నారు. అలాంటి వారికి ఈ ఏఐ గర్ల్‌ఫ్రెండ్స్ స్నేహహస్తాన్ని చాస్తున్నాయి.

'నాకంటూ ఒకరు ఉన్నారు' అని భరోసా ఇస్తున్నాయి. ఏఐ డేటింగ్, ఏఐ గర్ల్‌ఫ్రెండ్స్...లాంటి స్టార్టప్‌లు యూత్‌ను పలకరిస్తున్నాయి. 'వోన్లీ ఫ్యాన్స్' స్టార్టప్ ఇప్పటికే దూసుకుపోతుంది. 'వేర్‌యాజ్'లోని సౌలభ్యం ఏమిటంటే యూజర్లు ఐడియల్ వర్చువల్ గర్ల్‌ఫ్రెండ్‌ను క్రియేట్ చేసుకోవచ్చు.

ఏఐ గర్ల్‌ఫ్రెండ్ చాట్–బాట్‌తో మరో మనిషితో మాట్లాడుతున్నట్లే కృత్రిమ గర్ల్‌ఫ్రెండ్‌తో సహజమైన భాషలో మాట్లాడవచ్చు. అడ్వాన్స్‌డ్ మోడల్స్ ఆఫ్ ఏఐలో 'ఏఐ గర్ల్‌ఫ్రెండ్ సిమ్యులేటర్' ఒకటి. దీనిలో త్రీడి టెక్నాలజీ, ఏఆర్, వర్చువల్ రియాలిటీ ఫీచర్‌లు ఉంటాయి. మోస్ట్ రియలిస్టిక్ ఎక్స్‌పీరియన్స్‌ను యూజర్‌లకు చేరువ చేయడం ఏఐ గర్ల్‌ఫ్రెండ్ చాట్–బాట్ లక్ష్యం.

● మల్టీ టాలెంట్

50 యాప్స్.. 1000 డిజైన్‌లు

పిల్లల లోకంలో కార్టూన్‌లు, కార్టూన్‌ల లోకంలో పిల్లలు ఉంటారు. ఎంతోమంది పిల్లల లాగే సిద్ధిత మొహంతికి కార్టూన్‌లు అంటే బోలెడు ఇష్టం. ఆ ఇష్టం వినోదానికే పరిమితమై పోలేదు. సాంకేతిక విషయాలపై ఆసక్తికి దారి తీసింది. ఆ దారి తనను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ దగ్గరికి తీసుకువెళ్లింది. బెంగళూరుకు చెందిన పదిహేనేళ్ల సిద్ధిత పదమూడేళ్ల వయసులోనే స్టార్టప్ మొదలు పెట్టేలా చేసింది...



పదమూడు సంవత్సరాల వయసులో 'బ్లూమ్ రిద్ధి సిద్ధి' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది సిద్ధిత మొహంతి. గ్రాఫిక్ డిజైనింగ్, కంప్యూటర్ లిటరసీకి సంబంధించిన స్టార్టప్ ఇది. తల్లిదండ్రులు సిద్ధితకు లాప్‌టాప్ కొనివ్వడంతో అది తన ప్రయోగాలకు వేదిక అయింది. మొదట్లో యూట్యూబ్‌లో కార్టూన్ వీడియోలు మాత్రమే చూసేది. ఆ తరువాత ఆమె ఆసక్తి సాంకేతిక విషయాలపై మళ్లింది. డిజిటల్ డిజైన్ అనేది పాషన్‌గా మారింది. డిజిటల్ డిజైనింగ్ అనే కోర్సు ఉంటుందని తెలియని వయసులోనే సొంతంగా డిజైన్‌లు చేసి అందరూ 'వావ్' అనేలా చేసేది. బొమ్మలు గీయడంలోనూ సిద్ధితకు మంచి నైపుణ్యం ఉంది.

బెంగళూరులోని సిద్ధిత చదివే 'ఆర్చిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్' బాగా ప్రోత్సహించింది. 'లాక్‌డౌన్ టైమ్ అనేది నాకు గోల్డెన్ టైమ్' అంటున్న సిద్ధిత ఆ ఖాళీ సమయాన్ని బాగా సద్వినియోగం చేసుకుంది. 'నా గురించి నేను బాగా తెలుసుకోవడానికి, ఇంకా ఏం చేయవచ్చు అని ఆలోచించడానికి ఆ ఖాళీ సమయం నాకు ఉపయోగపడింది' అంటుంది సిద్ధిత. తన స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవడానికి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, లైఫ్ స్కిల్స్, వెబ్ డిజైన్, కోడింగ్, రొబోటిక్స్. పబ్లిక్ స్పీకింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, స్పోకెన్ ఇంగ్లీష్....మొదలైన ఎన్నో కోర్సులు చేసింది. ఈ కోర్సులన్నీ పూర్తి చేసిన తరువాత ఏదైనా సాధించాలనే తపన సిద్ధితలో మొదలైంది. ఇప్పటి వరకు 50 యాప్స్, 1,000 త్రీడీ డిజైన్‌లు క్రియేట్ చేసింది. జాతీయ, అంతర్జాతీయ ఒలింపియాడ్స్‌లో పాల్గొంది. ఒక సమావేశంలో పాల్గొన్న సిద్ధితకు చిన్న వయసులోనే ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా ప్రయాణం ప్రారంభించిన ఎంతో మందితో మాట్లాడే అవకాశం వచ్చింది. వారి మాటల నుంచి స్ఫూర్తి పొంది తాను కూడా స్టార్టప్ మొదలు పెట్టింది. పదమూడేళ్ల వయసులో 'గర్ల్ ప్రాడిజీ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైంది. సాంకేతిక విషయాలలో ప్రతిభ చూపుతున్న సిద్ధితకు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం అంటే ఇష్టం. గ్రాఫిక్ డిజైనింగ్‌తో పాటు రచనలు చేయడం, కరాటే, క్రికెట్ అంటే సిద్ధితకు ఇష్టం. మెడిసిన్ చదవాలనేది ఆమె కల. 'సూపర్ సిద్ధి' పేరుతో పుస్తకం రాసే పనిలో ఉంది.

● లేటెస్ట్

ఎడోబ్ ఎక్స్‌ప్రెస్‌లో కొత్త ఫీచర్‌లు

ఎడోబ్ ఎక్స్‌ప్రెస్(ఎడ్యుకేషన్)లో జనరేట్ టెక్స్ట్ ఎఫెక్ట్, జనరేట్ ఇమేజ్, జనరేటివ్ ఫిల్‌లాంటి ఏఐ పవర్డ్ ఫీచర్‌లు ఉన్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులకు మరింత ఉపయోగపడే విధంగా 'ఎడోబ్ ఎక్స్‌ప్రెస్'ను అప్‌డేట్ చేస్తున్నట్లు ప్రకటించింది ఎడోబ్. క్రియేటివిటీకి ఉపయోగపడేలా ఈ ఏఐ ఫీచర్‌లను డిజైన్ చేశారు. వీటితో టెంప్లెట్‌లు, బ్రోచర్‌లు, ఫ్లైయర్స్, ఒరిజినల్ కలరింగ్ పేజీలు జనరేట్ చేయవచ్చు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని యానిమేషన్ ఫీచర్‌లు తీసుకురానుంది ఎడోబ్.

● సమ్‌థింగ్ స్పెషల్

'ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరు ఊహించెదరు' అంటూ 'లవకుశ' పాట గుర్తుకొచ్చినా సరే, ఊహించడం కష్టమేమీ కాదు అంటుంది ది సింప్సన్. ఆర్థిక, సామాజిక. సాంస్కృతిక... ఇలా పలురంగాలకు సంబంధించిన భవిష్యత్ పరిణామాలను ప్రసిద్ధ యానిమేషన్ సిరీస్ 'ది సింప్సన్' ఊహించింది. గతంలో ఊహించిన వాటిలో కొన్ని నిజం అయ్యాయి.



జోకులేస్తూ... జోస్యం చెబుతూ!

'ది సింప్సన్' ఊహించిన వాటిలో కొన్ని నిజం కావడంతో 'సింప్సన్' మోడ్రన్ నోస్ట్రడామస్‌గా పేరు తెచ్చుకుంది. ఈ యానిమేటెడ్ కామెడీ సిరీస్ అమెరికన్ సాంస్కృతిక, సామాజిక పరిణామాలపై హాస్యంతో కూడిక వ్యాఖ్యానాలు చేయడమే కాదు జోస్యం కూడా చెబుతుంటుంది.



2000 సంవత్సరంలో ప్రసారమైన 11వ సీజన్‌లోని 17వ ఎపిసోడ్‌లో లీసా సింప్సన్ యూఎస్ మొదటి మహిళా అధ్యక్షురాలిగా రికార్డ్ సృష్టిస్తుంది. 'ఆ ప్రెసిడెంట్ ఎవరో కాదు కమలా హారిసే' అంటున్నారు ఇప్పుడు చాలా మంది. టీవీ సిరీస్‌లోని అమెరికా ప్రెసిడెంట్ కమలా హారిస్ ధరించే దుస్తులను పోలిన దుస్తులలో(ప్యాంట్‌స్యూట్) కనిపిస్తుంది. మెడలో ముత్యాల నెక్లెస్...సేమ్ టు సేమ్! కమలా హారిస్‌ను అలనాడే డెమోక్రాట్ అభ్యర్థిగా ప్రిడిక్ట్ చేయడంపై 'ది సింప్సన్' షో రైటర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఏఐ జీన్ గర్వంగా ఫీలవుతూ 'ది సింప్సన్స్ ప్రిడిక్షన్. ఐయామ్ ప్రౌడ్ టు బీ ఏ పార్ట్ ఆఫ్' అంటూ పోస్ట్ చేశాడు. 'ఈ పదవిని గతంలో ఒక రియల్ ఎస్టేట్ మొఘల్ నిర్వహించాడు' అనే మాట ఈ ఎపిసోడ్‌లో వినిపిస్తుంది. గతంలో అమెరికా అధ్యక్షుడిగా పని చేసిన డోనాల్డ్ ట్రంప్ రియల్ ఎస్టేట్ మొఘల్ కావడం గమనార్హం.

'ఇలా జరగనుంది' అని సింప్సన్ వ్యంగ్యంగానో, సూచన ప్రాయంగానో చెప్పిన విషయాలు కొన్ని నిజం అయ్యాయి.

రియల్ ఎస్టేట్‌లో ఉన్న వారు అమెరికా అధ్యక్ష బరిలోకి వస్తారని, స్మార్ట్ వాచ్‌ల వినియోగం బాగా పెరుగుతుందని, ట్వంటీయత్ సెంచరి ఫాక్స్‌ను డిస్నీ కొనుగోలు చేస్తుందని, ఆర్థికవేత్త బెంగ్ ఆర్ హోమ్‌స్ట్రోమ్ నోబెల్ బహుమతి గెలుచుకుంటాడని...ఇలాంటి అంచనాలు నిజం అయ్యాయి.

మరికొన్ని.... ● రిచర్డ్ బ్రాన్సన్ స్పేస్ ఫ్లైట్ (2021)ని 2015 సంవత్సరంలో సీజన్ 25, ఎపిసోడ్ 15లో ప్రిడిక్ట్ చేశారు ● జనవరి 6, 2021లో జరిగిన యూఎస్ క్యాపిటల్ అల్లర్లకు సంబంధించిన దృశ్యం 1996లో వచ్చిన సీజన్ 7, ఎపిసోడ్ 18 (ది డే ది వయోలెన్స్ డైడ్)లో కనిపిస్తుంది. ● 2003లో జరిగిన ఒక లైవ్ పెర్‌ఫార్మెన్స్‌లో సిగ్‌ఫ్రీడ్, రాయ్ అనే మ్యాజిషియన్‌లపై పులి దాడి చేసింది. 1993లో ప్రసారమైన సీజన్ 5, ఎపిసోడ్ 10లో ఇలాంటి దృశ్యమే కనిపిస్తుంది.

● యూఎస్ మెన్ కర్లింగ్ టీమ్ 2018లో వింటర్ ఒలింపిక్స్‌లో తొలిసారిగా బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ విజయాన్ని సీజన్ 21, ఎపిసోడ్ 12లోనే ఊహించారు.

సినిమా

వినాయక చవితికి భలే ఉన్నాడే!



● రాజ్ తరుణ్, మనీషా కంద్కూర్

రాజ్ తరుణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'భలే ఉన్నాడే!'. ఈ చిత్రంలో మనీషా కంద్కూర్ హీరోయిన్‌గా నటించారు. జె. శివ సాయి వర్ధన్ దర్శకత్వంలో మారుతి టీమ్ సమర్పణలో రవికిరణ్ ఆర్ట్స్ బ్యానర్‌పై ఎన్వీ కిరణ్ కుమార్ నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు 7న రిలీజ్ చేయనున్నట్లుగా చిత్రబృందం గురువారం అధికారికంగా ప్రకటించింది. ''ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్స్‌కు మంచి స్పందన లభించింది. సినిమా కూడా ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. సింగీతం శ్రీనివాస్, అమ్ము అభిరామి, లీలా శాంసన్, వీటీవీ గణేశ్, హైపర్ ఆది, కృష్ణ భగవాన్, గోపరాజు రమణ, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: నగేశ్ బానెల్లా.

విలేజ్ పాలిటిక్స్ షురూ



● సంపద, విశ్వక్ సేన్, వశిష్ఠ

హీరో విశ్వక్ సేన్ కెరీర్‌లోని 13వ సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. 'ఎవ్రీ యాక్షన్ ఫైర్స్ ఎ రియాక్షన్' అన్నది ఉపశీర్షిక. ఈ చిత్రంలో కన్నడ బ్యూటీ సంపద హీరోయిన్‌గా నటించనున్నారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాతో శ్రీధర్ గంటా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎల్ఎస్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవంలో ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వశిష్ఠ క్లాప్ ఇవ్వగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కెమెరా స్విచాన్ చేశారు. నిర్మాతలు నాగవంశీ, సాహు గారపాటి స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. ఈ చిత్రంలో విశ్వక్ సేన్ పోలీసాఫీసర్‌గా నటించనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూట్‌ను సెప్టెంబరులో ఆరంభించనున్నామని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: కిశోర్ కుమార్.



● చిరంజీవి

శంకర్ దాదా వస్తున్నాడు

శంకర్ దాదాగా చిరంజీవి మరోసారి ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయడానికి వస్తున్నారు. ఆయన హీరోగా జయంత్ సి. పరాన్జీ దర్శకత్వం వహించిన చిత్రం 'శంకర్ దాదా ఎంబీబీఎస్' (2004). ఈ సినిమాలో సోనాలీ బింద్రే హీరోయిన్‌గా నటించగా, శ్రీకాంత్ ఏటీఎం పాత్రలో సందడి చేశారు. కామెడీ అండ్ ఎమోషనల్ మూవీగా రూపొందిన 'శంకర్ దాదా ఎంబీబీఎస్' దాదాపు ఇరవై ఏళ్ల తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నెల 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా జీఆర్‌కే పిక్చర్స్ ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తోంది. ''సంజయ్ దత్ హీరోగా నటించిన హిందీ మూవీ 'మున్నాభాయ్ ఎంబీబీఎస్'కి తెలుగు రీమేక్‌గా రూపొందిన చిత్రం 'శంకర్ దాదా ఎంబీబీఎస్'. ఈ మూవీలో తన నటనతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు చిరంజీవి. అలాగే భావోద్వేగ సన్నివేశాల్లో కూడా అందరి మనసుని హత్తుకునేలా నటించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించింది. ఈ నెల 22న ఎక్కువ థియేటర్స్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని జీఆర్‌కే పిక్చర్స్ ప్రతినిధులు తెలిపారు.

దసరాకి పొట్టేల్



● 'పొట్టేల్' పోస్టర్

దసరాకి థియేటర్స్‌లోకి 'పొట్టేల్' రానుంది. యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె ఈ చిత్రాన్ని నిర్మించారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రాన్ని దసరా పండక్కి రిలీజ్ చేయనున్నట్లుగా గురువారం చిత్రయూనిట్ వెల్లడించింది. ''పొట్టేల్' సినిమా తెలంగాణ నేపథ్యంలో ఉంటుంది. దీంతో దసరాకు ఈ సినిమా రిలీజ్ అనేది అడ్వాంటేజ్ అవుతుందని ఆశిస్తున్నాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: మోనిష్ భూపతి రాజు.



● శ్రీలీల

నిజమేనా?

తెలుగులో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళుతున్న శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ గురించి అప్పుడప్పుడు వార్తలు వస్తూనే ఉన్నాయి. వరుణ్ ధావన్, ఇబ్రహీం అలీ ఖాన్ (సైఫ్ అలీఖాన్ తనయుడు) హీరోలుగా రూపొందుతున్న హిందీ సినిమాల్లో శ్రీలీల హీరోయిన్ అనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. కానీ ఈ విషయాలపై ఆయా చిత్రబృందాలు ఇప్పటివరకూ అధికారిక ప్రకటన చేయలేదు. కాగా శ్రీలీలకు మరో హిందీ చిత్రంలో హీరోయిన్‌గా నటించే అవకాశం లభించిందట. హీరో సిద్ధార్థ్ మల్హోత్రా, దర్శకుడు బల్వీందర్ సింగ్ కాంబినేషన్‌లో ఓ హిందీ సినిమా రానుందని సమాచారం. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్రకు మేకర్స్ శ్రీలీల పేరును పరిశీలిస్తున్నారని, త్వరలో ఈ విషయంపై స్పష్టత రానుందని టాక్. మరి.. సిద్ధార్థ్ మల్హోత్రాతో శ్రీలీల జోడీ కట్టనున్నారనే వార్త నిజమేనా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.

సైనికుల గొప్పతనంతో...



● పోటు నాగబాబు, గోపీచంద్, సందిరెడ్డి శ్రీనివాసరావు

సంతోష్ కల్వచెర్ల, పావని రామిశెట్టి జంటగా నటించిన చిత్రం 'జై జవాన్'. తనికెళ్ల భరణి, సత్యప్రకాశ్, నాగినీడు, సంజనా చౌదరి ఇతర పాత్రల్లో నటించారు. నాగబాబు పోటు దర్శకత్వంలో ఈశ్వరీ కుమారి సమర్పణలో సందిరెడ్డి శ్రీనివాసరావు, పోసం మధుసూదన్ రెడ్డి, పోటు వెంకటేశ్వర్లు ఈ సినిమా నిర్మించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని దర్శకుడు గోపీచంద్ మలినేని విడుదల చేసి, మాట్లాడుతూ– ''జై జవాన్' కాన్సెప్ట్ నచ్చింది. ట్రైలర్ చూస్తుంటే దేశభక్తి నేపథ్యంలో రూపొందిన చిత్రంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో సైనికుల గొప్పతనం గురించి తెలియజేశాం. సంతోష్ కల్వచెర్ల అద్భుతంగా నటించారు'' అని నిర్మాతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫైట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎవరీ దర్శకుడు అని ఆశ్చర్యపోయాను

\- సందీప్ కిషన్



● సరోజ్ కుమార్, సందీప్ కిషన్

''చెన్నైలో 'పార్కాలం' సినిమా చూసి ఎవరీ దర్శకుడు అని ఆశ్చర్యపోయా. ఆ సినిమా డైరెక్టర్ బండి సరోజ్ కుమార్ అని తెలిసి, ఫేస్ బుక్‌లో వెతికి మరీ తనతో టచ్‌లోకి వెళ్లాను. మనం ఇండస్ట్రీలోకి గెలవడానికి మాత్రమే రాము.. ఇదొక ప్రయాణం. ప్రేక్షకుల అభిమానం పొందడానికి ట్రై చేస్తుంటాం. సరోజ్ కుమార్ ఎంతో నిజాయతీగా తీసిన 'పరాక్రమం' సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. బండి సరోజ్ కుమార్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'పరాక్రమం'. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'పరాక్రమం' ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌కి సందీప్ కిషన్, నిర్మాత ఎస్‌కేఎన్ అతిథులుగా హాజరయ్యారు. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ– ''ప్రతి సాధారణ పౌరుడికి కనెక్ట్ అయ్యే సినిమా ఇది. మన జీవితాల్లో హీరోలు ఉంటారు, విలన్లూ ఉంటారు. ఎన్నో భావోద్వేగాలు ఉంటాయి. అవన్నీ తెరపై చూసుకున్నట్లు మా సినిమా ఉంటుంది'' అన్నారు.

హారర్... థ్రిల్



● వెంకట సాయి

తెలంగాణలోని కరీంనగర్‌కి చెందిన వెంకట సాయి గుండ ప్రధాన పాత్రలో నటించిన హాలీవుడ్ చిత్రం 'ది డిజర్వింగ్'. తన స్నేహితులు విస్మయ్ కుమార్ కోతోపల్లి, తిరుమలేశ్ గుండ్రత్ సహకారంతో వెంకట సాయి గుండ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 1న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ''సైకాలజికల్ హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన సినిమా 'ది డిజర్వింగ్'. చిన్నతనంలో జరిగే పరిస్థితులు, గృహ హింస, సైకాలజికల్ సమస్యలపై వినూత్నంగా తెరకెక్కించాం. ఇందులో మూగవాడిగా నటించాను. మా సినిమా ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై అవార్డులు గెలుచుకుంది. అలాగే బెస్ట్ యాక్టర్‌గా అంతర్జాతీయ వేదికలపై నేను అవార్డులు అందుకున్నాను'' అని చెప్పారు వెంకట సాయి గుండ.

బాల కార్మిక వ్యవస్థపై పోరాటం



● సుధాకర్ గౌడ్

సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్, బేబీ అక్షర, గీతా గోవింద్, అభినవ్, చరణ్ నటించిన చిత్రం 'అభినవ్'. శ్రీలక్ష్మి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సమర్పణలో భీమగాని సుధాకర్ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు భరత్ భూషణ్, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, నిర్మాత దామోదర్ ప్రసాద్ అతిథులుగా పాల్గొన్నారు. ట్రైలర్‌ను భరత్ భూషణ్ రిలీజ్ చేశారు. ''సత్య అనే మాఫియా డాన్ గ్రామీణ ప్రాంతాల్లోని హరిజన, గిరిజన విద్యార్థులతో గంజాయి స్మగ్లింగ్ చేయిస్తుంటాడు. ఉపాధ్యాయురాలు భారతి ద్వారా ప్రేరణ పొందిన కొందరు బాల బాలికలు డ్రగ్ మాఫియాను ఎలా అంతం చేశారు? అనేది కథ. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రధానాంశం'' అన్నారు సుధాకర్ గౌడ్.

సర్దార్ సీక్వెల్‌లో...



● రజీషా

'సర్దార్' స్పై టీమ్‌లో చేరారు హీరోయిన్ రజీషా విజయన్. కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'సర్దార్' (2022) మంచి హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం కార్తీ, మిత్రన్ కాంబినేషన్‌లోనే 'సర్దార్'కి సీక్వెల్‌గా 'సర్దార్ 2' తెరకెక్కుతోంది. ఎస్‌జే సూర్య, మాళవికా మోహన్, ఆషికా రంగనాథ్ ఈ చిత్రంలో ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. హీరోయిన్ రజీషా విజయన్ మరో లీడ్ రోల్‌లో నటించనున్నట్లు గురువారం మేకర్స్ తెలిపారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
16-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
150	5
79,106	24,144

విదేశీ సూచీలు (తొలి సెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,565	▲ 372
డోజోన్స్	4,0514	▲ 506
ఎఫ్‌టీఎస్ఈ 100	8,347	▲ 66
డాక్స్	18,183	▲ 298
షాంఘై	2,877	▽ 27
నికాయ్	36,726	▲ 284

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో (బుధవారం ముగింపు)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	70,793	▲ 394
బంగారం (99.5 స్వచ్ఛత)	70,510	▲ 348
వెండి (కిలో)	80,921	▲ 219

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.51	84.53
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.74	109.32
€	యూరో	ఎస్‌బీఐ	91.16	93.54
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.64	57.93
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.41	56.34
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.05	66.21
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.89	12.71



5 డోర్ల థార్ 'రాక్స్'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్స్ (ఎస్‌యూవీ) అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్న మహీంద్రా అయిదు డోర్ల థార్ రాక్స్ భారత్‌లో ఎంట్రీ ఇచ్చింది. ప్రారంభ ధర ఎక్స్‌షోరూంలో రూ.12.99 లక్షలు. సెప్టెంబర్ 14 నుంచి టెస్ట్ డ్రైవ్ కోసం రాక్స్ అందుబాటులో ఉంటుంది. అక్టోబర్ 3 నుంచి బుకింగ్స్ ప్రారంభం. దసరా నుంచి డెలివరీలు ఉంటాయి. 2 లీటర్ ఎం-స్టాలియన్ టీజీడీఐ పెట్రోల్ ఇంజన్, 2.2 లీటర్ ఎం-హాక్ డీజిల్ ఇంజన్ ఆప్షన్స్‌లో ఆరు వేరియంట్లలో రేర్ వీల్ డ్రైవ్, 4 వీల్ డ్రైవ్ డ్రైవ్‌ట్రెయిన్‌తో లభిస్తుంది. 6 స్పీడ్ మాన్యువల్ లేదా ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంచుకోవచ్చు. 360 డిగ్రీ కెమెరా, పనోరమిక్ సన్‌రూఫ్, 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 6 ఎయిర్‌బ్యాగ్స్, కీ లెస్ ఎంట్రీ, పుష్ బటన్ స్టార్ట్, 644 లీటర్స్ బూట్ స్పేస్ వంటి హంగులు ఉన్నాయి.

ప్రారంభ ధర రూ.12.99 లక్షలు



ప్రారంభ ధర రూ.2.99 లక్షలు

భారత్‌లోకి బీఎస్ఏ ఎంట్రీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మహీంద్రా గ్రూప్‌నకు చెందిన మోటార్‌సైకిల్స్ బ్రాండ్ బీఎస్ఏ భారత్‌లో అడుగు పెట్టింది. గోల్డ్‌స్టార్ 650 మోడల్‌తో ఎంట్రీ ఇచ్చింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.2.99 లక్షల నుంచి రూ.3.34 లక్షల వరకు ఉంది. 45.6 పీఎస్ పవర్, 55 ఎన్ఎం టార్క్‌తో 652 సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజన్, 5 స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో తయారైంది. 12 లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్, బ్రెంబో బ్రేక్స్, డ్యూయల్ చానెల్ ఏబీఎస్, 12వీ సాకెట్, యూఎస్‌బీ చార్జింగ్ పోర్ట్ వంటి హంగులు ఉన్నాయి. డెలివరీలు ప్రారంభం అయ్యాయి. పాతతరం ద్విచక్ర వాహన తయారీ దిగ్గజాల్లో బీఎస్ఏ ఒకటి. మహీంద్రా గ్రూప్ కంపెనీ క్లాసిక్ లెజెండ్స్ 2016లో బీఎస్ఏను కైవసం చేసుకుంది. యూకే సంస్థ బర్మింగ్‌హామ్ స్మాల్ ఆర్మ్స్ కంపెనీ (బీఎస్ఏ) 1861లో ప్రారంభం అయింది. తొలి బైక్‌ను 1910లో విడుదల చేసింది.

ఒక్క చార్జింగ్‌తో 579 కిలోమీటర్లు
ధర 74,999 నుంచి

ఓలా ఈ-బైక్స్ వచ్చేశాయ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్స్ విభాగంలోకి ప్రవేశించింది. రోడ్‌స్టర్, రోడ్‌స్టర్ ఎక్స్, రోడ్‌స్టర్ ప్రో వేరియంట్లను ప్రవేశపెట్టింది. 2.5–16 కిలోవాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యంతో తయారయ్యాయి. ధర రూ.74,999 నుంచి మొదలై రూ.2,49,999 వరకు ఉంది. 2025 దీపావళి నుంచి డెలివరీలు ప్రారంభం అవుతాయి. ఒకసారి చార్జింగ్‌తో వేరియంట్‌నుబట్టి 200 నుంచి 579 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. టాప్ స్పీడ్ గంటకు 124–194 కిలోమీటర్లు. కాగా, క్విక్ కామర్స్‌లోకి ఓలా ఎంట్రీ ఇచ్చింది. ఇందుకోసం ఓలా క్యాబ్స్ కాస్తా ఓలా కన్జూమర్ అయింది. అలాగే ఓలా పే పేరుతో యూపీఐ సేవలను సైతం కంపెనీ ఆవిష్కరించింది. అనుబంధ కంపెనీ కృత్రిమ్ ఏఐ 2026 నాటికి ఏఐ చిప్‌ను ప్రవేశపెట్టనుంది.



కరకర@ 50,000 కోట్లు!

యునైటెడ్ 'స్నాక్స్' ఆఫ్ ఇండియా!

- స్నాక్స్ మార్కెట్‌ను కొల్లగొడుతున్న దేశీ కంపెనీలు
- సాంప్రదాయ 'బ్రాండెడ్' రుచులకు జనాల లొట్టలు...
- పాశ్చాత్య పొటాటో చిప్స్ వంటి వాటికి దీటుగా వ్యాపారం
- సగం వాటా సాంప్రదాయ ప్యాకేజ్డ్ స్నాక్స్‌దే...
- హల్దీరామ్స్, బాలాజీ, బికాజీ జోరు..

కరకరలాడే సేవ్ భుజియా, వేయించిన పల్లీలు, బఠానీలు, మిక్చర్, జంతికలు ఇలా ఒకటేమిటి.. సాంప్రదాయ చిరుతిళ్లను ఇప్పుడు ఐదు, పది రూపాయల ప్యాకెట్లలో భారతీయులు లొట్టలేసుకుంటూ తినేస్తున్నారు. పొటాటో చిప్స్ ఇతరత్రా పాశ్చాత్య స్నాక్స్ హవాకు సాంప్రదాయ, బ్రాండెడ్ ప్యాకేజ్డ్ స్నాక్స్ గండికొడుతున్నాయి. విదేశీ, దేశీ కంపెనీలు మారుమూల ప్రాంతాల జనాలకు సైతం ఈ ప్యాకేజ్డ్ స్నాక్స్‌ను అందిస్తూ మార్కెట్‌ను భారీగా విస్తరించేందుకు పోటీ పడుతున్నాయి.


– సాక్షి, బిజినెస్ డెస్క్

సాల్టెడ్ స్నాక్స్ మార్కెట్ విలువ రూ. 50,800 కోట్లు
15 శాతం వార్షికంగా అమ్మకాల వృద్ధి
ఇందులో సాంప్రదాయ స్నాక్స్ వాటా **56 శాతం**

దేశీయంగా సాల్టెడ్ స్నాక్స్ అమ్మకాలు గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.50,800 కోట్లకు ఎగబాకాయి. కరోనా మహమ్మారి తర్వాత భారతీయ స్నాక్స్ వాటా క్రమంగా జోరందుకుంటూ వస్తోంది. ప్రస్తుతం మొత్తం స్నాక్స్ మార్కెట్లో సాంప్రదాయ రుచుల వాటా 56 శాతానికి చేరుకోవడం దీనికి నిదర్శనం. ఐదు, పది రూపాయల చిన్న ప్యాకెట్ల రూపంలో రకరకాల దేశీ రుచులన్నీ లభించడంతో పాటు విదేశీ స్నాక్స్ రకాలతో పోలిస్తే కొంత ఎక్కువ పరిమాణం కూడా ఉంటుండటం దేశీ స్నాక్స్ జోరుకు ప్రధాన కారణంగా నిలుస్తోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 'భారతీయులు ఎక్కువగా సాంప్రదాయ రుచులనే ఇష్టపడతారు. ఇప్పుడిది స్నాక్స్ మార్కెట్లో కూడా ప్రతిబింబిస్తోంది' అని బికనీర్‌వాలా ఫుడ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సురేశ్ గోయెల్ పేర్కొన్నారు. ఈ సంస్థ దేశవ్యాప్తంగా సాంప్రదాయ రెస్టారెంట్ల నిర్వహణతో పాటు బికానో బ్రాండ్‌తో స్నాక్స్ ప్యాకెట్లను కూడా విక్రయిస్తోంది.


హల్దీరామ్స్ హవా...

ప్రస్తుతం దేశంలో ఏ మారుమూలకెళ్లినా హల్దీరామ్స్ పేరు తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదేమో! మిక్చర్ పొట్లం, పల్లీల ప్యాకెట్ నుంచి రకరకాల ఉత్తరాది, దక్షిణాది రుచులతో సాంప్రదాయ స్నాక్స్‌కు పర్యాయపదంగా మారిపోయింది ఇది. హల్దీరామ్స్ దాదాపు 25% మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉంది. 2023–24లో కంపెనీ విక్రయాలు 18% ఎగసి రూ.12,161 కోట్లకు చేరాయి. పెప్సికో స్నాక్స్ అమ్మకాలు 14% పెరిగి రూ. 7,336 కోట్లుగా నమోదయ్యాయి. గుజరాత్‌కు చెందిన బాలాజీ వేఫర్స్ సేల్స్ 12% వృద్ధితో రూ.5,931 కోట్లకు దూసుకెళ్లడం విశేషం. భారతీయ స్నాక్స్ మార్కెట్ జోరుతో విదేశీ కంపెనీల ఇక్కడ ఫోకస్ పెంచాయి. హల్దీరామ్స్‌ను చేజిక్కించుకోవడానికి అమెరికా ప్రైవేటు ఈక్విటీ (పీఈ) దిగ్గజం బ్లాక్‌స్టోన్ రంగంలోకి దిగినట్లు టాక్. 51% మెజారిటీ వాటా కోసం బ్లాక్‌స్టోన్ రూ. 40,000 కోట్లను ఆఫర్ చేసినట్లు సమాచారం. హల్దీరామ్స్ విలువను రూ.70,000–78,000 కోట్లుగా లెక్కగట్టినట్లు తెలుస్తోంది.



రెండు దశాబ్దాల క్రితం వాటిదే జోరు...

మొత్తం దేశీ స్నాక్స్ మార్కెట్లో బంగాళదుంప చిప్స్, కుర్‌కురే, ఫింగర్ స్టిక్స్ వంటి పాశ్చాత్య స్నాక్స్ వాటా రెండు దశాబ్దాల క్రితం మూడింట రెండొంతుల మేర ఉండేది. దీన్ని కూడా పెప్సీ ఫ్రిటో లేస్, ఐటీసీ ఫుడ్స్ వంటి కార్పొరేట్ దిగ్గజాలే శాసిస్తూ వచ్చాయి. 'గతంలో బడా కంపెనీలు విక్రయించే పాశ్చాత్య స్నాక్స్ ఇంటింటా తిష్ట వేశాయి. ఇప్పుడీ ట్రెండ్ రివర్స్ అవుతోంది. సాంప్రదాయ స్నాక్స్ తయారీదారులు తమ పంపిణీ వ్యవస్థను విస్తరించుకోవడం ద్వారా పల్లెటూర్లకు కూడా చొచ్చుకుపోతున్నాయి' అని గోయెల్ చెప్పారు. కొత్త కొన్నేళ్లుగా సాంప్రదాయ స్నాక్స్ విభాగం భారీగా అమ్మకాలను కొల్లగొడుతోంది. ఇక మార్కెట్ వాటా విషయానికొస్తే, సాల్టెడ్ స్నాక్స్‌లో హల్దీరామ్స్, పెప్సీ, బాలాజీ, ఐటీసీ, బికాజీ వంటి పెద్ద కంపెనీలకు 60 శాతం మార్కెట్ వాటా ఉండగా.. మిగతా 40 శాతాన్ని చిన్నాచితకా కంపెనీలు, ప్రాంతీయ సంస్థల చేతిలో ఉండటం విశేషం. పెద్ద కంపెనీలతో పోలిస్తే ఎక్కువ గ్రాములను అందిస్తుండటం, మరిన్ని స్థానిక రుచులతో ఉత్పత్తులను ప్రవేశపెడుతుండటం వాటికి కలిసొస్తోంది. 'ఇప్పటికే పాతుకుపోయిన కంపెనీలు సాంప్రదాయ స్నాక్స్‌లో జోరు పెంచుతుండగా.. ప్రాంతీయంగా పేరొందిన కంపెనీలు సైతం క్రమంగా జాతీయ స్థాయిలో విస్తరిస్తున్నాయి' అని పార్లే ప్రొడక్ట్స్ సీనియర్ కేటగిరీ హెడ్ కృష్ణారావు బుద్ధ చెబుతున్నారు. ఇలా అందరూ స్థానిక సాంప్రదాయ రుచులను అందించేందుకు పోటీ పడుతుండటంతో వాటి అమ్మకాలు కూడా పెరిగేందుకు దోహదం చేస్తోందని, దీంతో అన్‌బ్రాండెడ్ సంస్థల నుంచి మార్కెట్ క్రమంగా సంస్థాగత కంపెనీల చేతికి వెళ్తోందని ఆయన పేర్కొన్నారు.



తొలిసారి లాభాల్లోకి ఓయో...

న్యూఢిల్లీ: ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కావాలని చూస్తున్న హోటల్స్ బుకింగ్ సేవల సంస్థ 'ఓయో' తన పనితీరును గణనీయంగా మెరుగుపరుచుకుంది. కంపెనీ చరిత్రలో తొలిసారి రూ.229 కోట్ల నికర లాభాన్ని 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో సాధించింది. గత ఆర్థిక సంవత్సరానికి రూ.100 కోట్ల లాభం అంచనాలను అధిగమించినట్టు ఓయో వ్యవస్థాపకుడు రితేష్ అగర్వాల్ కంపెనీ వార్షిక నివేదికలో తెలిపారు.

హింద్ జింక్ రూ. 8,000 కోట్ల ప్రత్యేక డివిడెండ్!

న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 8,000 కోట్ల ప్రత్యేక డివిడెండ్ ఇచ్చే ప్రణాళికల్లో ఉంది. వచ్చే మంగళవారం (20న) జరిగే బోర్డు మీటింగ్‌లో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రత్యేక డివిడెండ్‌లో దాదాపు 30 శాతం అంటే రూ. 2,400 కోట్లు కేంద్ర వాటాకు దక్కనుంది. కాగా, ఏటా సాధారణంగానే కంపెనీ రూ. 6,000 కోట్ల భారీ డివిడెండ్‌ను చెల్లిస్తుంటుంది. కంపెనీలో 65% వాటా ఉన్న ప్రమోటర్ వేదాంతకు ఈ ఏడాది ప్రత్యేక డివిడెండ్‌లో మెజారిటీ వాటా (దాదాపు రూ.5,100 కోట్లు) లభించనుంది.

సాక్షి స్పోర్ట్స్

వీవీఎస్ లక్ష్మణ్ పదవీకాలం మరో ఏడాది పొడిగింపు

జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) హెడ్‌గా వ్యవహరిస్తున్న భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ పదవిలో కొనసాగనున్నాడు. లక్ష్మణ్ మూడేళ్ల కాంట్రాక్ట్ సెప్టెంబరుతో ముగియనుంది. అయితే ఎన్‌సీఏ హెడ్‌గా మరో ఏడాది కాలం పాటు అతడి పదవీకాలాన్ని పొడిగించాలని బీసీసీఐ నిర్ణయించింది. బెంగళూరు శివార్లలో బీసీసీఐ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కొత్త ఎన్‌సీఏ 2025లో ప్రారంభం కానున్న నేపథ్యంలో లక్ష్మణ్ కొనసాగితే బాగుంటుందని బోర్డు భావించింది. కొన్నాళ్ల క్రితం వరకు వ్యక్తిగతంగా కొంత అనాసక్తి ప్రదర్శిస్తూ లక్ష్మణ్ ఈ బాధ్యతల నుంచి తప్పుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఇప్పుడు బోర్డు జోక్యంతో అతను కొనసాగనున్నాడు. ఎన్‌సీఏ హెడ్‌గా ఉన్న సమయంలో ఇంజ్యూరీ మేనేజ్‌మెంట్, ప్లేయర్ రీహాబిలిటేషన్, కోచింగ్ కార్యక్రమాలు, వివిధ వయో విభాగాల క్రికెట్ టోర్నీల ప్లానింగ్ వంటి అంశాల్లో లక్ష్మణ్ సమర్థంగా పని చేశాడు. ఎన్‌సీఏ కోచ్‌లు హృషికేశ్ కనిత్కర్, సాయిరాజ్ బహుతులే, షితాన్షు కొటక్ కూడా కొనసాగే అవకాశం ఉంది.





ప్రతి ఒక్కరూ చాంపియనే

ఒలింపిక్ బృందాన్ని అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ

- స్వాతంత్య్రదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అథ్లెట్లు
- ఒలింపిక్స్ నిర్వహించడం భారత్ కల అని వెల్లడి

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత అథ్లెట్ల బృందాన్ని గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ఎర్రకోట వద్ద స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల అనంతరం న్యూఢిల్లీలోని తన నివాసంలో అథ్లెట్ల బృందంతో ప్రధాని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పారిస్ క్రీడల్లో రెండు పతకాలు సాధించి కొత్త చరిత్ర లిఖించిన షూటర్ మనూ భాకర్.. ఒలింపిక్స్‌లో వినియోగించిన పిస్టల్ ను ప్రధానికి చూపించింది. ఇక వరుసగా రెండో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత పురుషుల హాకీ జట్టును ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్‌తో మోదీ ముచ్చటించారు. ఈ సందర్భంగా జట్టు ఆటగాళ్లంతా సంతకాలు చేసిన జెర్సీతో పాటు ఓ హాకీ స్టిక్‌ను ప్రధానికి అందించారు. పారిస్ క్రీడల్లో కాంస్య పతకం అందుకున్న రెజ్లర్ అమన్ సెహ్రావత్ కూడా భారత జెర్సీని ప్రధానికి బహుమతిగా ఇచ్చారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మనూ భాకర్‌తో కలిసి కాంస్య పతకం గెలిచిన సరబ్‌జ్యోత్ సింగ్, 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో కాంస్యం నెగ్గిన స్వప్నిల్ కుసాలేను కూడా ప్రధాని అభినందించారు. అనంతరం క్రీడాకారుల మధ్య కలియదిరిగిన ప్రధాని వారితో సంభాషించారు. ఒలింపిక్స్‌లో వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవీయా, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష పాల్గొన్నారు. 'పారిస్ ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లతో మాట్లాడడం చాలా ఆనందంగా ఉంది. విశ్వక్రీడల్లో వారి అనుభవాలు వినడం.. వారి విజయాలను ప్రశంసించడం తృప్తినిచ్చింది. పారిస్‌కు వెళ్లిన ప్రతీ భారత క్రీడాకారుడు చాంపియనే. ప్రభుత్వం క్రీడలకు మద్దతునిస్తుంది. మౌలిక సదుపాయాల కల్పనలో ఎల్లప్పుడూ ముందుంటుంది' అని ప్రధాని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. పారిస్ క్రీడలు ముగిసిన వెంటనే చికిత్స కోసం జర్మనీకి వెళ్లడంతో అతడు ఈ కార్యక్రమంలో పాల్గొనలేదు. త్రుటిలో పతకానికి దూరమైన షట్లర్ లక్ష్యసేన్, వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, బాక్సర్ లవ్లీనా బొర్గోహైన్‌తో పాటు ఇతర అథ్లెట్లతోనూ ప్రధాని సంభాషించారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి 117 మంది అథ్లెట్లు బరిలోకి దిగారు. ఓవరాల్‌గా ఈ క్రీడల్లో దేశానికి ఆరు (ఒక రజతం, 5 కాంస్యాలు) పతకాలు వచ్చాయి. అంతకుముందు ఎర్రకోట వద్ద జరిగిన 78వ స్వాతంత్య్ర వేడుకల్లో ఒలింపిక్ అథ్లెట్ల బృందం పాల్గొంది. ఈ సందర్భంగా ప్రధాని 'పారిస్' క్రీడల్లో పాల్గొన్న అథ్లెట్లకు ధైర్యం చెబుతూనే.. పారాలింపిక్స్‌కు వెళ్లనున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వడం భారత్ కల అని.. 2036లో విశ్వక్రీడలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామని ప్రధాని పునరుద్ఘాటించారు.



ఫీల్డ్ గోల్స్‌తోనే అది సాధ్యం: శ్రీజేశ్

న్యూఢిల్లీ: విశ్వక్రీడల్లో నిలకడగా పతకాలు సాధించాలంటే.. ఫీల్డ్ గోల్స్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరముందని అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికిన భారత గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ అన్నాడు. ఒలింపిక్స్ వంటి మెగా టోర్నీల్లో సత్తా చాటాలంటే.. పెనాల్టీ కార్నర్‌లను వినియోగించుకోవడంతో పాటు.. ఫీల్డ్‌గోల్స్ ఎక్కువ చేయాలని శ్రీజేశ్ పేర్కొన్నాడు. పారిస్ క్రీడల్లో కాంస్య పతకం సాధించిన భారత జట్టు మెగా టోర్నీలో మొత్తం 15 గోల్స్ చేసింది. అందులో 9 పెనాల్టీ కార్నర్‌లు, మూడు పెనాల్టీ స్ట్రోక్స్ ఉన్నాయి. అంటే కేవలం మూడే ఫీల్డ్ గోల్స్ చేయగలిగింది. అదే సమయంలో స్వర్ణం గెలిచిన నెదర్లాండ్స్ 14 ఫీల్డ్ గోల్స్, రజతం నెగ్గిన జర్మనీ 15 ఫీల్డ్ గోల్స్ చేశాయి. కాంస్య పతక పోరులో భారత్ చేతిలో ఓడి నాలుగో స్థానంలో నిలిచిన స్పెయిన్ కూడా 10 ఫీల్డ్ గోల్స్‌తో ఆకట్టుకుంది. 'పెనాల్టీ కార్నర్‌ల విషయంలో మన ప్లేయర్ల ఆలోచనల్లో మార్పు రావాల్సిన అవసరముంది. వరుస విజయాలు సాధించాలంటే మనం ఎందులో మెరుగ్గా ఉన్నామో దానిపైనే కాకుండా.. ఇతర వాటిపై కూడా దృష్టి పెట్టాలి. ఫీల్డ్ గోల్స్‌లో సత్తా చాటితే హాకీలో పూర్వవైభవం సాధ్యమే' అని శ్రీజేశ్ అన్నాడు.

సచిన్‌కు రూ. 2.15 కోట్లు

- భారీ మొత్తంతో సొంతం చేసుకున్న తమిళ్ తలైవాస్
- రెజాకు రూ. 2.07 కోట్లు
- ప్రొ కబడ్డీ లీగ్ వేలం



సచిన్ తన్వర్



రెజా

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఆటగాళ్ల వేలంలో రూ. కోట్ల కూత కూసింది. దీంతో కబడ్డీ ప్లేయర్ల రాత కూడా రానురానూ మారుతోంది. పీకేఎల్ 11వ సీజన్ కోసం నిర్వాహకులు గురువారం ఆటగాళ్ల వేలం ప్రక్రియను మొదలుపెట్టారు. తొలిరోజు ఎ, బి కేటగిరీలకు చెందిన ఆటగాళ్ల వేలం నిర్వహించగా, రాజస్తాన్‌కు చెందిన సచిన్ తన్వర్‌పై ఫ్రాంచైజీలు రూ. రెండు కోట్లకు పైగా వెచ్చించేందుకు పోటీ పడ్డాయి. చివరకు తమిళ్ తలైవాస్ ఈ రెయిడర్‌పై రూ. 2.15 కోట్లు కురిపించి మరీ కైవసం చేసుకుంది. గత సీజన్‌లో పట్నా పైరేట్స్ తరఫున కూత పెట్టిన సచిన్ అంతకుముందు గుజరాత్ జెయింట్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. తన్వర్ భారత జట్టులో కీలక సభ్యుడు. గతేడాది హాంగ్జౌలో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన విజేత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఇతనితో పాటు 'ఎ' కేటగిరీలో ఉన్న మరో స్టార్ కబడ్డీ ప్లేయర్, ఇరానియన్ ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజా కోసం ఫ్రాంచైజీలు ఎగబడి వేలం పాట పాడాయి. చివరకు అతన్ని రూ. 2.07 కోట్లతో హరియాణా స్టీలర్స్ చేజిక్కించుకుంది. తొలి రోజు వేలంలో రెండు కేటగిరీల్లో కలిపి 8 మంది ఆటగాళ్లు రూ. కోటికి పైగా ధర పలికారు. రెయిడర్లు గుమన్ సింగ్ రూ. 1.97 కోట్లు (గుజరాత్ జెయింట్స్), మణీందర్ సింగ్ రూ. 1.15 కోట్లు (బెంగాల్ వారియర్స్), అజింక్యా అశోక్ రూ. 1.10 కోట్లు (బెంగళూరు బుల్స్), ఆల్‌రౌండర్లు పవన్ కుమార్ సెహ్రావత్ రూ.1.72 కోట్లు (తెలుగు టైటాన్స్), భరత్ రూ. 1.30 కోట్లు (యూపీ యోధాస్), డిఫెండర్ సునీల్ కుమార్ రూ. 1.01 కోట్లు (యు ముంబా)లు భారీ ధర పలికారు. తెలుగు టైటాన్స్ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ పవన్ సెహ్రావత్‌తో పాటు డిఫెండర్ క్రిషన్ ధుల్ (రూ. 70 లక్షలు), ఆల్‌రౌండర్ విజయ్ మలిక్ (రూ. 20 లక్షలు)లను తొలిరోజు వేలంలో కొనుక్కుంది. రెండో రోజు శుక్రవారం వేలంలో 'ఎ', 'బి'లతో పాటు 'సి' కేటగిరీ ఆటగాళ్ల వేలం నిర్వహిస్తారు.

కుప్పకూలిన దక్షిణాఫ్రికా



జోసెఫ్

ప్రావిడెన్స్: వెస్టిండీస్ పేసర్ల ధాటికి రెండో టెస్టులో దక్షిణాఫ్రికా బ్యాటర్లు తడబడ్డారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా జట్టు... విండీస్ బౌలర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. షామర్ జోసెఫ్ (5/33), జైడెన్ సీల్స్ (3/41) ధాటికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 47 ఓవర్లలో 134 పరుగులకే 9 వికెట్లు కోల్పోయింది. డేవిడ్ బెడింగ్‌హామ్ (28), ట్రిస్టన్ స్టబ్స్ (26), కైల్ వెరిన్ (21) ఓ మాదిరిగా ఆడగా.. కెప్టెన్ తెంబా బవుమా (0), మార్క్‌రమ్ (14), టోనీ డి జోర్జి (1), ముల్డర్ (0), కేశవ్ మహరాజ్ (0) విఫలమయ్యారు.

ప్రజ్ఞానందకు ఆఖరి స్థానం

సెయింట్ లూసియా: భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద.. సెయింట్ లూసియా ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌లో ఆకట్టుకోలేకపోయాడు. ర్యాపిడ్ విభాగంలో వరుస పరాజయాలు ఎదుర్కొన్న ప్రజ్ఞానంద.. తొమ్మిది రౌండ్‌ల ఈ టోర్నీలో చివరి స్థానంలో నిలిచాడు. మొత్తం 18 పాయింట్లు సాధించే అవకాశం ఉండగా.. ప్రజ్ఞానంద కేవలం 4 పాయింట్లకే పరిమితమయ్యాడు. పోటీల చివరి రోజు మూడు రౌండ్లు ఆడిన ప్రజ్ఞానంద అందులో రెండింట ఓడి.. ఒక దాన్ని 'డ్రా' చేసుకున్నాడు.

మహిళల ప్రపంచకప్ నిర్వహణకు 'నో'

- ఐసీసీ ఆఫర్‌ను తిరస్కరించిన బీసీసీఐ
- వర్షాలు, వచ్చే ఏడాది వరల్డ్ కప్ ఉండటమే కారణం



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో వచ్చే అక్టోబరులో నిర్వహించాల్సిన మహిళల టి20 ప్రపంచకప్ ఆతిథ్యానికి భారత్ తిరస్కరించింది. బంగ్లాలో నెలకొన్న రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, హింసాయుత వాతావరణం వల్ల వేదిక మార్పు అనివార్యమైంది. దీంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఇచ్చిన ఆఫర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నో చెప్పింది. వచ్చే ఏడాది భారత్‌లో మహిళల వన్డే ప్రపంచకప్ జరగాల్సి ఉంది. దీంతో పాటు ఈ అక్టోబర్ నెల వరకు వర్షాకాలం తీవ్ర స్థాయిలో ఉంటుంది. వరుస వరల్డ్‌కప్‌లతో పాటు, ప్రతికూల వాతావరణం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు కార్యదర్శి జై షా వెల్లడించారు. 'మహిళల మెగా ఈవెంట్‌కు భారత్ ఆతిథ్యమివ్వాల్సిందిగా ఐసీసీ మమ్మల్ని కోరింది. అయితే ఇది సాధ్యం కాదని ఖరాఖండిగా చెప్పాం' అని జై షా చెప్పారు. దీంతో అక్టోబర్ 3 నుంచి 20 వరకు జరగాల్సిన మెగా ఈవెంట్ కోసం ఐసీసీ ప్రత్యామ్నాయ వేదికలపై దృష్టిసారించింది. శ్రీలంక లేదంటే యూఏఈలలో ఒక వేదికను ఈ నెల 20వ తేదీకల్లా ఖరారు చేసే అవకాశముంది. బంగ్లాలో కొన్ని రోజులుగా హింసాత్మక ఘటనలతో దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో అక్కడ అమ్మాయిల ప్రపంచకప్‌ను సురక్షితంగా నిర్వహించడం ఐసీసీకి క్లిష్టతరం కానుంది. ఈ నేపథ్యంలో ఐసీసీ ఎప్పటికప్పుడు బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ)తో సంప్రదింపులు జరుపుతోంది. అక్కడి తాజా పరిస్థితులపై రోజూ సమీక్ష చేస్తోంది. బంగ్లాదేశ్ పురుషుల క్రికెట్ జట్టు త్వరలో భారత్‌లో పర్యటించాల్సి ఉంది. బంగ్లా ప్రస్తుతం పాకిస్తాన్ టూర్‌లో ఉంది. అక్కడ రెండు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్ ఈ నెల 21న మొదలవుతుంది. అనంతరం వచ్చే నెల భారత పర్యటనలో రెండు టెస్టులతో పాటు మూడు మ్యాచ్‌ల టి20ల సిరీస్‌లో బంగ్లాదేశ్ పాల్గొంటుంది.

ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చి.. గంజాయి చాక్లెట్లు తెప్పించి..



టీజీ ఏఎన్‌బీ ఉన్నతాధికారుల డెకాయ్ ఆపరేషన్..

పక్కాగా ఆధారాలు సేకరించి.. యూపీ, రాజస్తాన్‌లో వీటిని తయారు చేసే ఫ్యాక్టరీలు సీజ్

ఇండియా మార్ట్ వెబ్‌సైట్ నుంచి ఈ తరహా ఉత్పత్తుల తొలగింపు

సాక్షి, హైదరాబాద్

జగిత్యాలలో గంజాయి చాక్లెట్లు తిన్న ఓ బాలుడు వాటి ప్రభావంతో బాలికపై అత్యాచారం చేశాడు.

నిజామాబాద్‌కు చెందిన కొందరు చిన్నారులు ఈ చాక్లెట్లకు బానిసలయ్యారు. మరో పెద్దింటి బిడ్డను బానిసను చేయడానికి ప్రయత్నించారు.

కొత్తూరు, చిట్యాల, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లోని పాఠశాలల సమీపంలో ఉన్న దుకాణాల కేంద్రంగా ఈ చాక్లెట్ల దందా సాగింది.

ఇలా 2022 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా గంజాయి చాక్లెట్లకు సంబంధించి ఏకంగా 42 కేసులు నమోదయ్యాయి. ఈ సరుకంతా ఈ–కామర్స్ సైట్ ఇండియామార్ట్ ద్వారా క్యాష్ ఆన్ డెలివరీ విధానంగా ఇక్కడకు రావడం గమనార్హం. దీనిని పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ) అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కేంద్రం అదీనంలోని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోతో (ఎన్సీబీ) కలిసి పనిచేసి ఉత్తరప్రదేశ్, రాజస్తాన్‌ల్లో ఉన్న ఎనిమిది ఫ్యాక్టరీలను మూయించారు.

ఆయుర్వేద మందుల పేరుతో..

గంజాయి చాక్లెట్ల కర్మాగారాల నిర్వాహకులు ఇండియా మార్ట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇస్తే..కొరియర్ ద్వారా డెలివరీ చేస్తున్నారు. వివిధ పేర్లతో రూపొందిన ఈ చాక్లెట్ల రేపర్లు, కవర్లపై ఆయుర్వేద మందులుగా, 21 ఏళ్ల పైబడి వారికే అమ్మాలనే హెచ్చరికను ముద్రించారు. విద్యాసంస్థల సమీపంలో ఉన్న దుకాణాల ద్వారా విద్యార్థుల చేతుల్లోకి వెళ్లి, వారిని బానిసలుగా మారుస్తున్న ఈ చాక్లెట్ల వ్యవహారం టీజీ ఏఎన్‌బీ దృష్టికొచ్చింది. తయారీదారులు చెబుతున్నట్టు అవి ఆయుర్వేద మందులే అయినా, కేవలం డాక్టర్ చీటీ ఆధారంగానే విక్రయించాలి. అలా కాకుండా ఆన్‌లైన్‌లో అమ్మేస్తుండటంతో లోతుగా ఆరా తీసిన అధికారులు అసలు విషయం గుర్తించారు.

ఆపరేషన్ జరిగిందిలా..

మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసుల నమోదుకు వినియోగించే ఎన్డీపీఎస్ యాక్ట్ ఎంత కఠినమైందో..అంతే సున్నితమైంది. నిబంధనలు పాటించకపోతే కోర్టుల్లో ఆ కేసులు నిలబడవు. దీంతో టీజీ ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్‌శాండిల్య, ఎస్పీలు సాయి చైతన్య, సీతారాం వ్యూహాత్మకంగా వ్యవహరించి డెకాయ్ ఆపరేషన్ చేశారు. అధీకృత పంచ్ విట్నెస్ (సాక్షులు) సమక్షంలోనే ఇండియామార్ట్ నుంచి ఆర్డర్ ఇచ్చారు. సీఓడీ కాకుండా తమ అధికారిక ఖాతా నుంచే చెల్లించారు. సదరు కంపెనీ కొరియర్‌లో పంపిన చాక్లెట్లను పంచ్ విట్నెస్ సమక్షంలోనే తీసుకొని పక్కాగా పంచనామా నిర్వహించారు. ఆపై ఈ వ్యవహారాన్ని వివరిస్తూ ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా నమోదైన కేసులో ఆ కంపెనీ యజమానిని నిందితుడిగా చేర్చారు. మరింతలోతుగా ఆరా తీసిన అధికారులు యూపీ, రాజస్తాన్‌ల్లో ఉన్న 8 గంజాయి చాక్లెట్స్ తయారీ కంపెనీలను గుర్తించారు.



గంజాయి చాక్లెట్ల ప్యాకెట్



గంజాయి చాక్లెట్లు వచ్చింది ఇందులోనే..

ఎన్సీబీ సహకారంతో దాడులు, అరెస్టులు

ఈ విషయాలన్నీ టీజీ ఏఎన్‌బీ అధికారులు ఎన్సీబీ దృష్టికి తీసుకెళ్లారు. వారితో కలిసి ఉత్తరప్రదేశ్ వెళ్లిన ప్రత్యేక బృందం అక్కడి బిజ్నౌర్ జిల్లాలో ఉన్న కంపెనీపై దాడి చేసి ఇద్దరు యజమానులను అరెస్టు చేయించారు. ఆ ప్రాంతంతోపాటు రాజస్తాన్‌లోని మరో ఏడు కంపెనీల్లోనూ సోదాలు చేసి నమూనాలు సేకరించారు. వీటికి సంబంధించి ఫోరెన్సిక్ నివేదికలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ గంజాయి చాక్లెట్ల విక్రయానికి సంబంధించి ఇండియామార్ట్‌కు టీజీ ఏఎన్‌బీ నోటీసులు పంపించింది. వీటితో స్పందించిన ఆ సంస్థ తమ వెబ్‌సైట్‌లో ఉన్న ఈ తరహా ఉత్పత్తులు అన్నింటినీ తొలగించింది. వీటిని డెలివరీ చేసిన కొరియర్ సంస్థలనూ బాధ్యులను చేస్తూ నోటీసులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా 87126-71111 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని, అలా చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని టీజీ ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య 'సాక్షి'కి తెలిపారు.

యూనిట్ల వారీగా గంజాయి చాక్లెట్ల కేసులు ఇలా...

సైబరాబాద్	20	రామగుండం	01
హైదరాబాద్	10	సంగారెడ్డి	01
రాచకొండ	04	వరంగల్	01
నల్లగొండ	01	నారాయణ	
మెదక్	01	పేట	01
సిరిసిల్ల	01	కొత్తగూడెం	01

స్కిల్స్ వర్సిటీ చైర్‌పర్సన్‌గా ఆనంద్ మహీంద్రా

పదవీ కాలం ఏడాది.. ఉత్తర్వులు జారీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్ పర్సన్‌గా పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూపు సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్రా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఏడాది పాటు పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆటోమొబైల్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎనర్జీ, ఐటీ వంటి కీలక రంగాల్లో మహీంద్రా గ్రూపు సంస్థలకు ఆనంద్ మహీంద్ర చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో స్కిల్స్ ఇండియా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ ఇటీవలే అసెంబ్లీలో బిల్లును ఆమోదించడం తెలిసిందే. ఇటీవల ఆనంద్ మహీంద్రాతో సీఎం రేవంత్ సమావేశమై స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, లక్ష్యాలను వివరించడంతో పాటు చైర్‌పర్సన్‌గా కొనసాగాలని కోరిన నేపథ్యంలో ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆ పాప వైద్యం ఖరీదు రూ.18 కోట్లు



కర్నూలు (హాస్పిటల్): కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన నాగేష్, మరియమ్మ దంపతులు వ్యవసాయ కూలీలు. వారికి ముగ్గురు కుమార్తెలు. రెండో కూతురు అక్షయ (2)కు అత్యంత అరుదైన స్పైనల్ మస్కులర్ అట్రోఫి అనే వ్యాధి వచ్చింది. ఈ కారణంగా పాప ఎదుగుతున్నా కండరాలు సహకరించక నిలబడలేకపోతోంది. నడవలేక.. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతోంది. తల్లిదండ్రులు పాపను వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. పాప లక్షణాలను బట్టి హైదరాబాద్‌లోని సీసీఎంబీ ల్యాబ్‌లో జెనటిక్ పరీక్షను చేయించారు. పరీక్షలో ఆ పాపకు స్పైనల్ మస్కులర్ అట్రోఫిగా నిర్ధారణ అయ్యింది. నిర్లక్ష్యం చేస్తే పాప ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు చెప్పారు. న్యూరోఫిజీషియన్ హేమంత్ కుమార్ ఆ పాప పరిస్థితిని వివరిస్తూ.. పాప చికిత్సకు జోల్‌జెరి ఎస్‌ఎంఏ అనే ఇంజెక్షన్ చేయాలని, దాని ఖరీదు రూ.18 కోట్లు అవుతుందని చెప్పారు. బిడ్డను కాపాడుకోవడం రోజు కూలీలైన తమకు కష్టమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అక్షయను రాష్ట్ర ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని కోరుతున్నారు.

నేడే నింగిలోకి డీ–3

సూళ్లూరుపేట/తిరుమల: తిరుపతి జిల్లా సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగవేదిక నుంచి శుక్రవారం ఉదయం 9.17 గంటలకు స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ డీ3) ప్రయోగించేందుకు సర్వం సిద్ధమైంది. ప్రయోగాన్ని 16.56 నిమిషాల్లో పూర్తి చేయనున్నారు. ప్రయోగవేదికపై సిద్ధంగా ఉన్న రాకెట్‌కు అన్ని పరీక్షలను పూర్తి చేసే పనిలో ఇస్రో శాస్త్రవేత్తలు నిమగ్నమయ్యారు. ఏదైనా వాతావరణ పరిస్థితులను బట్టి ప్రయోగ సమయం కొద్దిగా మార్పు చేసే అవకాశం లేకపోలేదు. ఈ ప్రయోగానికి సంబంధించి గురువారం లాంచ్ రిహార్సల్స్ నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మిషన్ సంసిద్ధతా సమావేశం (ఎంఆర్ఆర్) నిర్వహించి ప్రయోగ తేదీని అధికారికంగా ప్రకటించారు. ఎంఆర్ఆర్ సమావేశం అనంతరం ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) వారికి అప్పగించారు. ల్యాబ్ చైర్మన్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో రాకెట్‌కు తుది విడత తనిఖీలు నిర్వహించి ప్రయోగానికి ఏడు గంటల ముందు అంటే శుక్రవారం వేకువజామున 2.17 కౌంట్ డౌన్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ ఏడు గంటల కౌంట్ డౌన్ ప్రక్రియలో నాలుగో దశలో 0.05 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపడంతో పాటు రాకెట్‌లోని అన్ని వ్యవస్థలను అప్రమత్తం చేసి ప్రయోగానికి సిద్ధమవుతారన్నమాట. అయితే ఈ ప్రయోగంలో మూడు దశలూ ఘన ఇంధనం సాయంతో నిర్వహించనున్నారు. దీనికి కౌంట్‌డౌన్ సమయాన్ని అతికొద్ది గంటలు మాత్రమే తీసుకుంటున్నారు. ఈ ప్రయోగంలో ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్–08)తో పాటు ఎస్ఆర్–0 డెమోశాట్ అనే చిన్న తరహా ఉపగ్రహాలను 475 కిలోమీటర్ల ఎత్తులోని సర్క్యులర్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టనున్నారు.

శ్రీవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు

తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎస్ఎస్ఎల్‌వీ డీ–3, ఈఓఎస్–08 నమూనాలకు ఇస్రో అధికారులు గురువారం ప్రత్యేక పూజలు చేయించారు. ఇస్రో డైరెక్టర్ ఏకే పాత్ర, ప్రిన్సిపల్ సెక్రటరీ యశోదతో కలసి శాస్త్రవేత్తలు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి పాదాల చెంత ఎస్ఎస్ఎల్‌వీ డీ–3, ఈఓఎస్–08 నమూనాలను ఉంచి పూజలు నిర్వహించారు.



రాకెట్ వివరాలు.. ప్రయోగమిలా..

ఎస్ఎస్ఎల్‌వీ డీ3 రాకెట్ 34 మీటర్ల పొడవు రెండు మీటర్ల వెడల్పు 119 టన్నుల బరువుతో నాలుగు దశల్లోనే ప్రయోగించనున్నారు. ఈ ప్రయోగాన్ని 16 (994 సెకన్లు) నిమిషాల్లో పూర్తి చేయనున్నారు. ఈ రాకెట్ మొదటి దశను 87 టన్నుల ఘన ఇంధనాన్ని ఉపయోగించి 124 సెకన్లకు పూర్తి చేయనున్నారు. రెండో దశను 7.7 టన్నుల ఘన ఇంధనంతో 384.2 సెకన్లకు, మూడో దశను 4.5 టన్నుల ఘన ఇంధనంతో 674.9 సెకన్లకు పూర్తి చేయనున్నారు. నాలుగో దశలో మాత్రమే 0.05 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో 808 సెకన్లకు 175.5 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్–08) మొదటిగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తర్వాత ఎస్ఆర్–0 డెమోశాట్ అనే ఉపగ్రహాన్ని 994 సెకన్లు భూమికి 475 కిలో మీటర్ల ఎత్తులోని లియో ఆర్బిట్ (సూర్య సమకాలిక కక్ష్య)లోకి ప్రవేశపెట్టడంతో ప్రయోగం పూర్తి చేసేవిధంగా ఇస్రో శాస్త్రవేత్తలు డిజైన్ చేశారు.

కౌంట్‌డౌన్ వ్యవధి తక్కువ..

ఎస్ఎస్ఎల్‌వీ డీ3 రాకెట్‌కు కౌంట్‌డౌన్ సమయాన్ని తక్కువగా అంటే ఏడు గంటల వ్యవధి మాత్రమే తీసుకున్నారు. ఎందుకంటే ఈ రాకెట్ మొదటి మూడు దశలు ఘన ఇంధనాన్ని ఉపయోగించి చేయనున్నారు. అంటే ఘన ఇంధనాన్ని ముందుగానే నింపి రాకెట్‌ను అనుసంధానం చేశారు. ద్రవ ఇంధనాన్ని నింపేందుకు మాత్రమే కౌంట్‌డౌన్ సమయాన్ని తీసుకున్నారు. ఈ ప్రయోగంలో నాలుగోదశలో 0.05 టన్నులు మాత్రమే ద్రవ ఇంధనాన్ని వినియోగించనున్నారు. అందుకే ఏడు గంటల కౌంట్‌డౌన్ సమయం వ్యవధిలో ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియతో పాటు రాకెట్‌లోని అన్ని వ్యవస్థలను అప్రమత్తం చేయడానికి ఈ తక్కువ సమయాన్ని తీసుకున్నారు. ఎస్ఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది మూడో ప్రయోగం. షార్ కేంద్రం నుంచి 97వ ప్రయోగం కావడం విశేషం.

ప్లాస్టిక్ బాటిల్ నీళ్లతో హై బీపీ

అధిక రక్తపోటుకు కారణమవుతున్న మైక్రో ప్లాస్టిక్స్

- ఇన్‌ఫ్లమేషన్, హార్మోన్ల అసమతుల్యత, కేన్సర్ లాంటి వాటికీ దోహదం
- తొలుత రక్తంలోకి..తర్వాత గుండె కణజాలం, కాలేయం, ఊపిరితిత్తులు తదితరాలకు వ్యాప్తి
- ఆస్ట్రియాలోని డాన్యూబ్ ప్రైవేట్ యూనివర్సిటీ పరిశోధనలో వెల్లడి
- నల్లా నీళ్లను వేడిచేసి తాగడం, స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్ల వినియోగం మంచిదని సూచన



సాక్షి, హైదరాబాద్: మన రోజువారీ అలవాట్లే మన ఆరోగ్యానికి చేటు చేస్తున్నాయి. అందులో ప్లాస్టిక్ వినియోగం ఒకటి. ప్రస్తుతం మనం కూరగాయలు, పండ్లు, ఇతర ఆహారపదార్థాలు సులువుగా తీసుకెళ్లేందుకు వాడు తున్న ప్లాస్టిక్ కవర్లు, బ్యాగ్‌లు కూడా అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. అంతేకాదు నీళ్లు తాగేందుకు అత్యధిక శాతం మంది ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ సీసాలు కూడా మనుషుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. నిత్యం ప్లాస్టిక్ సీసాలతో తాగుతున్న మంచినీటి ద్వారా శరీరంలోకి చేరుతున్న సూక్ష్మ రూపాల్లోని ప్లాస్టిక్ రేణువులు (మైక్రో ప్లాస్టిక్స్) అధిక రక్తపోటు (హై బ్లడ్‌ప్రెషర్)కు కారణమవుతున్నట్టు ఆస్ట్రియాలోని డాన్యూబ్ ప్రైవేట్ యూనివర్సిటీ తాజా పరిశోధనలో వెల్లడైంది. గుండె సంబంధిత వ్యాధులు, గుండెపోటు వంటి వాటికి బీపీనే ప్రధాన కారణమని వైద్య నిపుణులు చెబుతున్న విషయం తెలిసిందే. ఇదే కాకుండా ఈ మైక్రో ప్లాస్టిక్స్ ఇన్‌ఫ్లమేషన్, హార్మోన్ల అసమతుల్యత, కేన్సర్ వంటి వాటికి కారణమవుతున్నాయని ఇప్పటికే పరిశోధకులు తేల్చారు. ఈ మైక్రోప్లాస్టిక్స్ తొలుత రక్త ప్రవాహంలోకి తర్వాత సలైవా, గుండె కణజాలం, కాలేయం, ఊపిరితిత్తులు ఇంకా ప్లాసెంటా (మావి).. ఇలా అన్ని అవయవాల్లోకీ చేరుతున్నాయి. ముఖ్యంగా 'బాటిల్డ్ వాటర్'లో హెచ్చు స్థాయిల్లో ఈ మైక్రోప్లాస్టిక్స్ ఉన్నట్టుగా అధ్యయనంలో తేలింది. అధ్యయనంలో భాగంగా మైక్రో ప్లాస్టిక్స్ – పెరుగుతున్న రక్తపోటు మధ్య ఉన్న ప్రత్యక్ష సంబంధాన్ని పరిశీలించారు. 'జర్నల్ మైక్రోప్లాస్టిక్స్'లో ప్రచురితమైన ఈ అధ్యయనం.. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా రక్తపోటు సమస్యను గణనీయంగా తగ్గించవచ్చునని పేర్కొంది. రక్తపోటు సమస్యలను తగ్గించుకునేందుకు ప్లాసిక్ సీసాలలో మంచినీళ్లు, ఇతర పానీయాలు (ప్యాకేజ్డ్ బాటిల్స్) తీసుకునే అలవాటును మానుకుంటే మంచిదని సూచించింది. నల్లాల ద్వారా వచ్చే నీటిని కాచి వడబోశాక తాగడంతో పోల్చితే ప్లాస్టిక్ సీసాలలోని నీటిని, అలాగే కొన్ని సందర్భాల్లో గాజు సీసాల్లోని నీటిని తాగాక రక్తపోటు పెరిగినట్టుగా పరిశోధకులు గుర్తించారు.

సింథటిక్ వస్త్రాలు ఉతకడం వల్ల కూడా..

నిత్యం ఐదు మిల్లీమీటర్ల కంటే కాస్త తక్కువ పరిమాణంలో మైక్రోప్లాస్టిక్స్ శరీరంలో చేరుతుండడంతో వివిధ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పరిశోధన స్పష్టం చేసింది. గతంలోనే నిర్వహించిన ఓ అధ్యయనంలో...ప్రతి వారం బాటిళ్ల ద్వారా తీసుకునే వివిధ రూపాల్లోని ద్రవాల ద్వారా ఐదు గ్రాముల చొప్పున మైక్రోప్లాస్టిక్స్ శరీరంలో చేరుతున్నట్టు వెల్లడైంది. కారు టైర్ల అరుగుదల మొదలు పెద్దమొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాల ధ్వంసం, సింథటిక్ వస్త్రాలు ఉతకడం తదితర రూపాల్లో కూడా ఇవి శరీరంలో చేరుతున్నట్టు తెలిపింది. మనం తీసుకునే ఆహారం, నీళ్లు, పీల్చే గాలి తదితరాల ద్వారా మనకు తెలియకుండానే ప్లాస్టిక్ రేణువులు శరీరాల్లో చేరుతున్నట్టు పేర్కొంది. అయితే బాటిల్ నీళ్లను తాగకుండా ఉంటే ఈ సమస్యను కొంతవరకు నివారించ వచ్చని, నల్లా నీళ్లను వేడిచేసి చల్లబరిచి, ఫిల్టర్ చేసి తాగడం మంచిదని సూచించింది. దీనిద్వారా మైక్రో ప్లాస్టిక్స్, నానో ప్లాస్టిక్స్ శరీరంలో చేరడాన్ని 90 శాతం దాకా తగ్గించవచ్చునని అధ్యయనం పేర్కొంది. ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు..రోజువారి జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు ప్లాస్టిక్ బాటిళ్లలో పానీయాలను భద్రపరచడం నిలిపేయాలని సూచించింది. ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌లకు బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని, స్టెయిన్‌లెస్ స్టీల్ లేదా గ్లాస్ కంటైనర్లు వినియోగించాలని, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అనుసరించాలని స్పష్టం చేసింది.

వైభవంగా పవిత్రోత్సవాలు



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజైన గురువారం ఉదయం శ్రీస్వామి వారికి నవకలశ స్నపనం జరిపించారు. ఆలయ ప్రాకార మండపంలోని యజ్ఞశాలలో ద్వారతోరణ పూజ, కుంభారాధన, చక్రబ్జ మండలారాధన వంటి పూజలు చేశారు. ప్రత్యేక హోమాన్ని నిర్వహించి, నిత్య లఘు పూర్ణాహుతి చేపట్టారు. అనంతరం 108 నూలు ధారాలతో తయారు చేసిన పవిత్ర మాలలను పుణ్యాజలంలో సంప్రోక్షించి, ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠాలంకారమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మూల మంత్ర హవనం, ప్రాయశ్చిత హవనం జరిపిస్తారు. గర్భాలయం పైభాగంలో ఉన్న విమాన గోపురంపై ఉన్న శ్రీసుదర్శన చక్రానికి పవిత్ర మాల ధరింపజేశారు. పాతగుట్ట ఆలయంలో సైతం పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం మహాపూర్ణాహుతి నిర్వహించి, శ్రీస్వామి అమ్మవార్లకు పవిత్ర మాలలను ధరింపజేసి, ఉత్సవాలను పరిసమాప్తి చేస్తారు.

యాదగిరిగుట్ట

అఫ్సర్‌కు 'ఇంద్రగంటి' పురస్కారం ప్రదానం



ఇంద్రగంటి శ్రీకాంత శర్మ సాహితీ పురస్కారాన్ని కవి, సాహితీ పరిశోధకుడు అఫ్సర్‌కు గురువారం రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను రూ.25 వేలు, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. అనంతరం సాహితీవేత్త ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం యువ కవులు, రచయితలు రావలసిన అవసరం ఎంతగానో ఉందన్నారు. నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. తల్లిదండ్రుల పేరిట పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కవయిత్రి విమల, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ సతీమణి జానకిబాల, కుమార్తె కిరణ్మయి ఇంద్రగంటి, కుమారుడు మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్)

'బహురూపి'కి బహుమతి



పశ్చిమ బెంగాల్‌కు చెందిన జానపద కళారూపం 'బహురూపి' కోసం ఓ కుర్రాడికి మేకప్ వేసి సిద్ధం చేస్తున్న దృశ్యమిది. అక్కడి గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు విశేష ఆదరణ పొందిన ఈ కళారూపం ఇప్పుడు క్షీణ దశలో ఉంది. 'మనం మరిచిపోతున్న వారసత్వం' శీర్షికన కోల్‌కతాకు చెందిన అర్పణ్ బసు చౌదరీ ఈ కళారూపానికి సంబంధించి పలు చిత్రాలను తన ఒప్పో మొబైల్‌లో తీశారు. అందులోని ఈ ఫొటోకు మొబైల్ ఫొటోగ్రఫీకి సంబంధించి ఒప్పో ఇండియా ప్రకటించిన ఇమాజిన్ఇఫ్ ఫొటోగ్రఫీ–2024 పురస్కారాల్లో మొదటి బహుమతి దక్కింది. 34 వేలు ఎంట్రీలు రాగా.. అందులో ఈ చిత్రం విజేతగా నిలిచింది.

కలుపు తీస్తూ.. ఎరువు వేస్తూ..



పెట్టుబడి ఖర్చు తగ్గించడానికి ఓ రైతుకు వచ్చిన ఐడియాతో బహుళ ప్రయోజనం కలిగింది. అదేంటో తెలుసుకుందాం. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం మొగిలిదొరి గ్రామానికి చెందిన కొండె శ్రీశైలం తనకున్న మూడెకరాల పొలంలో పత్తి సాగు చేస్తున్నాడు. అరక లేకపోవడంతో ఆధునిక సాగుయంత్రమైన మినీట్రాక్టర్ కొనుగోలు చేశాడు. రూ.50 వేలు వ్యయం చేసి ట్రాక్టర్‌కు ఏడు నాగళ్ల సెట్‌తో కూడిన కల్టివేటర్, దానిపైన డబ్బా బిగించాడు. ఆ డబ్బా నుంచి ఎరువు సాళ్లకు (మొక్కల వరుసలు)కొద్దిదూరంలో పడేవిధంగా ముందు వరుసలోని నాగళ్ల వరకు పైపులను అమర్చాడు. పత్తిచేలో సాళ్ల మధ్య గల కలుపు మొక్కలను తొలగించడానికి కల్టివేటర్ దున్నడం(గుంటుక మాదిరిగా)తోపాటు ఒకేసారి మూడు వరుసలలోని మొక్కలకు ఎరువు వేయొచ్చు. మొక్కకు సుమారు ఐదు అంగుళాల దూరంలో ఎరువు పడుతుంది. వెనుక వరుసలోని నాగళ్లు ఆ ఎరువుపై మట్టిని కప్పివేస్తాయి. ఎకరం పత్తిచేలో కలుపు మొక్కలను తొలగించడానికి సాళ్ల మధ్య దున్నడంతోపాటు మొక్కలకు ఎరువు వేయడానికి గంట సమయం పడుతుంది. ఎకరాకు 2 లీటర్ల డీజిల్ అవసరం. డబ్బాలో ఎరువు పోయడానికి ఒక వ్యక్తి ఉంటే సరిపోతుంది. ఎకరాకు వేయి రూపాయలు అద్దెగా నిర్ణయించాడు. దీంతో పలువురు రైతులు ఈ యంత్రాన్ని అద్దెకు తీసుకుపోతున్నారు. దీనివల్ల ఏకకాలంలో రెండు పనులు పూర్తి కావడంతో పాటు సగానికిపైగా ఖర్చు, సమయం ఆదా అవుతోంది.

రామన్నపేట(యాదాద్రి భువనగిరి)

273 మంది ఏఈలకు పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న 273 మంది అసిస్టెంట్ ఇంజనీర్లకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఆ శాఖ ఈఎన్‌సీ (జనరల్) అనిల్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.